సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 359

బుధవారం 20-3-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'



రోబో తోటమాలి!

నెదర్లాండ్స్‌లోని తులిప్ తోటల్లో చీడపీడలను ఏరేస్తున్న ఏఐ రోబో - 6లో



తొలి మహిళా షిప్ సర్వేయర్

భిన్న ఉపాధిని ఎంచుకున్న కేరళవాసి పూజా ఛతోత్‌పై కథనం - 11లో



వాళ్లు అంతర్ధానమౌతారు..

'శక్తి'ని అంతం చేయాలని బయల్దేరిన వాళ్లే నాశనమవుతారని ప్రధాని మోదీ తమిళనాడు లోని సేలం సభలో వ్యాఖ్యానించారు.

- వివరాలు 6లో



కాలుష్య రాజధానిగా ఢిల్లీ

ప్రపంచ వాయు నాణ్యతా నివేదికలో ఢిల్లీ మరోసారి 'అత్యంత కాలుష్య దేశ రాజధాని'గా అప్రతిష్ట మూటగట్టుకుంది.

- వివరాలు 6లో



ముగియనున్న 'హెచ్-1బీ' గడువు

2025 సంవత్సరానికి గాను హెచ్-1బీ వీసాల ప్రాథమిక నమోదు గడువు 22తో ముగియనుందని యూఎస్‌సీఐఎస్ తెలిపింది.

- వివరాలు 6లో



కేంద్ర మంత్రి పశుపతి రాజీనామా

రాష్ట్రీయ లోక్‌శక్తి పార్టీ (ఎల్‌జేపీ) నేత పశుపతి కుమార్ పరాస్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

సామాన్యులకే సై



సార్వత్రిక ఎన్నికల్లో శాసనసభ, లోక్‌సభ అభ్యర్థులుగా పార్టీలో కష్టపడి పని చేస్తున్న సాధారణ కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసాధారణ అవకాశం కల్పించారు.

- వివరాలు 10లో

ఎకరాకు రూ.10 వేలు



అకాల వర్షాలు, వడగళ్ల కారణంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఎకరాకు రూ.10 వేలు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు పంటనష్టం అంచనా వేయాలని వ్యవసాయశాఖను ఆదేశించింది.

- వివరాలు 3లో

ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి



మావోయిస్టు పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు గడ్చిరోలి జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో వివిధ కమిటీలకు చెందిన నలుగురు మావోయిస్టులు మృతి చెందారు.

- వివరాలు 10లో

ఒత్తిడి తగ్గాలి.. నైపుణ్యం పెరగాలి



ఇంజనీరింగ్ క్లాసులు మొదలయ్యే ముందే విద్యార్థులను మానసికంగా సిద్ధం చేయాలని దేశంలోని అన్ని ఇంజనీరింగ్ కాలేజీలను ఏఐసీటీఈ ఆదేశించింది. దీని కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించింది.

- వివరాలు 5లో

ఇరకాటం



కార్యాలయాన్నే అద్దెకిచ్చాం! పార్టీని కాదంటే వినవేం!!

కాంగ్రెస్

రెండో జాబితా రెడీ!

లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ కసరత్తు పూర్తి.. కేంద్ర ఎన్నికల కమిటీ భేటీలో ఆమోదం

ప్రకటన వెలువడక పోవడంతో ఆశావహుల్లో కొనసాగుతున్న ఉత్కంఠ

8 స్థానాలకు పేర్లు ఖరారయ్యాయంటున్న ఏఐసీసీ వర్గాలు

ఐదు స్థానాలకే క్లియరెన్స్ వచ్చిందంటూ గాంధీభవన్ వర్గాల్లో చర్చ

ఒకటి, రెండురోజుల్లో అధికారికంగా జాబితా విడుదల!

ఇప్పటివరకు నాలుగు నియోజకవర్గాలకే అభ్యర్థుల ప్రకటన

ఏఐసీసీ వర్గాలు చెబుతున్న పేర్లు..



రంజిత్‌రెడ్డి (చేవెళ్ల)



సునీతా మహేందర్‌రెడ్డి (మల్కాజిగిరి)



మల్లు రవి (నాగర్‌కర్నూల్)



గడ్డం వంశీ (పెద్దపల్లి)



జీవన్‌రెడ్డి (నిజామాబాద్)



ప్రవీణ్‌రెడ్డి (కరీంనగర్)



పసునూరి దయాకర్ (వరంగల్)



డాక్టర్ సుమలత (ఆదిలాబాద్)

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి రెండో విడత జాబితా ప్రకటనపై కాంగ్రెస్ పార్టీ కసరత్తు పూర్తి చేసింది. నేతల జనాదరణను పరిగణనలోకి తీసుకుని పేర్లు ఫైనల్ చేసినట్లు సమాచారం. అయితే దీనిపై ఎలాంటి ప్రకటనా వెలువడక పోవడంతో.. ఎన్ని స్థానాలకు అభ్యర్థులు ఖరారయ్యారు, ఎవరెవరికి టికెట్లు లభించాయన్న దానిపై ఆశావహుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ఎనిమిది చోట్ల అభ్యర్థులు ఫైనల్ అయ్యారని ఏఐసీసీ వర్గాలు చెబుతుండగా, ఆరు స్థానాలు పరిశీలించినా, ఐదుగురు అభ్యర్థుల ఎంపిక మాత్రమే పూర్తయిందనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది.

సీఈసీ ఆమోద ముద్ర: ఢిల్లీలో మంగళవారం సాయంత్రం సీఈసీ సమావేశం జరిగింది. తెలంగాణ సహా వివిధ రాష్ట్రాలకు సంబంధించి పలువురు అభ్యర్థులకు ఆమోదముద్ర వేసింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత సోనియాగాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, మంత్రి ఉత్తమ్ సహా

మిగతా 2వ పేజీలో ▶

బీఆర్‌ఎస్ సవాళ్లను అధిగమిస్తూ.. సత్తా చాటేలా


- లోక్‌సభ ఎన్నికలపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ దృష్టి
- నేతలు, కేడర్‌లో ఆత్మవిశ్వాసం నింపుతూ సిద్ధం చేసేలా ప్రణాళికలు
- అభ్యర్థుల ఎంపిక, సమన్వయం, ప్రచార షెడ్యూల్‌పై కసరత్తు
- ఇప్పటికే 11 స్థానాలకు అభ్యర్థుల ఖరారు
- ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను చేర్చుకోవడం ద్వారా కొత్త ఎత్తుగడ!
- మొదటి వారం నుంచీ ఎన్నికల ప్రచారానికి సమాయత్తం - 2లో

బీజేపీ ఆ రెండు స్థానాలు ఎవరికో?

- బీజేపీ వరంగల్, ఖమ్మం స్థానాలపై రాని స్పష్టత
- మిగతా 15 స్థానాలకు అభ్యర్థులు ఖరారు
- వరంగల్ అరూరి రమేష్‌కు ఖాయమంటున్న పార్టీ వర్గాలు
- ఖమ్మం టికెట్ కోసం ఓ బీఆర్‌ఎస్ ఎంపీ సహా పలువురి ప్రయత్నాలు
- పరిశీలనలో జలగం వెంకటరావు పేరు
- నల్లగొండ అభ్యర్థి ఖరారైనా ప్రయత్నాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ! - 2లో

తెలంగాణ గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్

- జార్ఖండ్ గవర్నర్‌కు అదనపు బాధ్యతలు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి కార్యాలయం
- బీజేపీలో చురుగ్గా పనిచేసిన రాధాకృష్ణన్



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా జార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రాజీనామాను ఆమోదించిన రాష్ట్రపతి.. కొత్త గవర్నర్ నియామకం జరిగే వరకూ తెలంగాణ గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా రాధాకృష్ణన్‌కు అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు రాష్ట్రపతి కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాధాకృష్ణన్ బుధవారం ఉదయం 11.15 గంటలకు రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, అధికార విపక్ష పార్టీల ముఖ్య నేతలు, హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొననున్నారు.

తమిళనాడులో క్రియాశీలకంగా..

తమిళనాడుకు చెందిన రాధాకృష్ణన్ సుదీర్ఘ కాలం పాటు బీజేపీలో క్రియాశీలకంగా పని చేశారు. 1974లో భారతీయ జనసంఘ్ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడిగా ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. 1996లో తమిళనాడు బీజేపీ కార్యదర్శిగా పని చేశారు. 1998–1999లో రెండుసార్లు కోయంబత్తూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 1998–2003 మధ్య పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారు. 2004–2007 మధ్య రాష్ట్ర అధ్యక్షుడి గానూ సేవలందించారు. ఆ సమయంలోనే దేశంలోని నదుల అనుసంధానం, ఉగ్రవాదం నిర్మూలన, అందరికీ ఉమ్మడి పౌర చట్టం కోసం, అంటరానితనం నిర్మూలన, నార్కోటిక్ డ్రగ్స్ నిర్మూలన వంటి ఐదు అంశాలపై 93 రోజుల పాటు 19 వేల కి.మీ. మేర 'రథయాత్ర'తో

మిగతా 2వ పేజీలో ▶

ఇద్దరు రైతుల ఆత్మహత్య

ఒకరు పంటలు ఎండిపోయి.. మరొకరు అప్పుల్లో కూరుకుపోయి..

హనుమకొండ, ఆదిలాబాద్ జిల్లాల్లో ఘటన




సుధాకర్ (ఫైల్)



కాకర్ల ఆశన్న

వేలేరు/తలమడుగు: రాష్ట్రంలో ఇద్దరు అన్నదాతలు ఆత్మహత్య చేసుకున్నారు. నీరు తడి లేక పంట ఎడిపోయి ఒకరు.. పంట దిగుబడి సరిగా రాక అప్పుల్లో కూరుకుపోయి తీర్చే దారిలేక మరొక రైతు పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. హనుమకొండ, ఆదిలాబాద్ జిల్లాల్లో రెండ్రోజుల వ్యవధిలో జరిగిన ఈ రైతుల ఆత్మహత్యలకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీచర గ్రామానికి చెందిన పిట్టల సుధాకర్(43)కు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. కొంతభాగం మొక్కజొన్న సాగుచేశాడు. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోవడంతో అప్పులు చేసి బావిలో సైడ్ బోర్లు వేయించాడు. అయినా నీరు పడకపోవడంతో పంట చేతికందే సమయంలో ఎండిపోయింది. బోర్లు వేసేందుకు, పంట పెట్టుబడికి, రెండేళ్ల క్రితం

మిగతా 10వ పేజీలో ▶



మంగళవారం ఢిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ భేటీలో సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్

పంచ 'న్యాయ్'లతో ప్రజలకు న్యాయం చేస్తాం

- ఐదు 'న్యాయ్' గ్యారంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
- సీడబ్ల్యూసీ భేటీలో కాంగ్రెస్ నేతల నిర్ణయం
- దేశం మార్పు కోరుతోంది: ఖర్గే
- మోదీ గ్యారంటీలకు 'ఇండియా షైనింగ్' గతేనంటూ విమర్శలు

- వివరాలు 6లో

2 నెలలు.. రూ.28 వేల కోట్ల రాబడి

రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు నెలకు సగటున రూ.14 వేల కోట్ల ఆదాయం
జీఎస్టీ పద్దు కింద రూ.7,500 కోట్లు.. ఎక్సైజ్ ద్వారా రూ.3,300 కోట్లు
అప్పులు, కేంద్ర గ్రాంట్ల కింద రూ.4 వేల కోట్లు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఖజానా ప్రస్తుత పరిస్థితేంటి? ఆదాయం బాగానే వస్తోందా? గతంతో పోలిస్తే తగ్గిందా? సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు, పింఛన్లు లాంటి చెల్లింపులకు నెలసరి రాబడులు సరిపోతున్నాయా? ప్రభుత్వం అప్పులు తీసుకుంటోందా? తీసుకుంటే ఎంత తీసుకుంది? కేంద్రం ఏమైనా సాయం చేస్తోందా? రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కొత్తగా అధికారం చేపట్టిన నేపథ్యంలో..సహజంగానే తలెత్తే ఇలాంటి పలు సందేహాలకు ప్రభుత్వం తాజాగా వెల్లడించిన వివరాలు జవాబిస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి 2 నెలల (డిసెంబర్, జనవరి)కు సంబంధించిన ఆదాయ, వ్యయ వివరాలను కంప్ట్రోలర్ అండర్ ఆడిటర్ జనరల్ (కాగ్)కు రాష్ట్ర ప్రభుత్వం పంపింది. ఆ వివరాల ప్రకారం.. గత డిసెంబర్, జనవరి నెలలకు కలిపి ప్రభుత్వ ఖజానాకు రూ.28 వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరింది.

పన్ను రాబడులు, అప్పులు ఇలా..

పన్ను రాబడుల శాఖలకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తే..ఎక్సైజ్ ఆదాయం రెండు నెలల్లో రూ.3,300 కోట్ల మేర సమకూరింది. జీఎస్టీ పద్దు కింద రూ.7,500 కోట్లు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.2,300 కోట్లు, అమ్మకపు పన్ను ద్వారా రూ.5,400 కోట్లు

మిగతా 5వ పేజీలో ▶

'రియల్' మోసాలు రూ.10 వేల కోట్లు

తక్కువ ధరకే ఇళ్లు.. ప్రీలాంచ్ ఆఫర్ అంటూ 'రియల్' వల
సాహితీ, భువనతేజ, జేజే ఇన్‌ఫ్రా, జేవీ బిల్డర్స్ వంటి రియల్ ఎస్టేట్ సంస్థలెన్నో...
గ్రేటర్‌లో మోసాల విలువ రూ.10 వేల కోట్లని అంచనా



సాక్షి, హైదరాబాద్: తక్కువ ధరకే ఇళ్లు..పెట్టుబడిపై అధిక లాభాలు.. ప్రీలాంచ్ ఆఫర్ అంటూ వంద శాతం వసూలు పేరిట రియల్ ఎస్టేట్ మోసాలు ఇటీవలి కాలంలో నగరంలో ఎక్కువ అయ్యాయి. సొంతింటి కల నెరవేర్చుకోవాలనుకునే సామాన్యుడి ఆశను కొందరు బిల్డర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఏజెంట్లు అడియాసలు చేస్తున్నారు. పైసాపైసా కూడబెట్టుకున్న సొమ్ము, కష్టార్జితాన్ని లూటీ చేస్తున్నారు. డబ్బు వసూలు చేశాక మొహం చాటేయడం, ఏళ్ల తరబడి ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం వంటివి సర్వసాధారణమయ్యాయి.

కస్టమర్ల సొమ్మే యజమానికి..

నగరానికి నలువైపులా దాదాపు 50 నుంచి 100 కిలోమీటర్ల లోపు రోడ్లు, విద్యుత్ వంటి కనీస మౌలిక వసతులు కూడా లేని ప్రాంతాల్లో రియల్ ప్రాజెక్టుల పేరిట ఊదరగొడుతూ ప్రచారం చేస్తున్నారు. భూమి యజమానులతో ఒప్పందం చేసుకొని, ప్రభుత్వ విభాగాల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే, ప్రీలాంచ్‌లో కొనుగోలు చేస్తే తక్కువ ధరకే ఇస్తామంటూ నమ్మబలికి రూ.కోట్లలో వసూలు చేస్తున్నారు. ఆ డబ్బే భూమి యజమానికి కట్టి, ఆ తర్వాత అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నారు. అనుమతులు

మిగతా 3వ పేజీలో ▶

ఈడీ చర్యలు రాజ్యాంగ విరుద్ధం



- ఎమ్మెల్సీ కవిత ఆరోపణ
- కస్టడీ నుంచి విడుదలకు ఆదేశించాలని సుప్రీంకోర్టులో తాజా పిటిషన్.. గత రిట్ పిటిషన్ ఉపసంహరణ
- ఢిల్లీ మద్యం కేసు విచారిస్తున్న జడ్జి ఎంకే నాగ్‌పాల్ బదిలీ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో తనను అరెస్టు చేయడంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించిందంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. తన తండ్రి తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కేంద్రంలో అధికార పార్టీతో పొత్తు లేని కారణంగానే తనపై తప్పుడు ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. ఎఫ్‌ఐఆర్‌లో ఇప్పటివరకూ తన పేరు చేర్చలేదని, అదేవిధంగా చార్జిషీటులోనూ తన పేరు లేదన్నారు. ఆగస్టు 22, 2022న ఈడీ దర్యాప్తు ప్రారంభించిందని, ఆ సమయంలో చందన్ రెడ్డి అనే వ్యక్తిపై పరుషంగా ప్రవర్తించిన విషయాన్ని పిటిషన్‌లో ప్రస్తావించారు. ఈడీ ప్రాసిక్యూషన్ ఫిర్యాదులో కూడా తనను నిందితురాలిగా పేర్కొనలేదన్నారు. సీబీఐ విచారణ సమయంలో బుచ్చిబాబు తప్పుడు వాంగ్మూలాలు ఇచ్చారన్నారు. ఈడీ తనకు మార్చి 7, 2023న సమన్లు జారీ చేసిందని, తన హక్కులకు భంగం కలిగించేలా ప్రవర్తించొద్దని

మిగతా 5వ పేజీలో ▶

ఈదురు గాలులకు ఊయలతో సహా ఎగిరిపడి..



సీత

- ఐదేళ్ల చిన్నారి దుర్మరణం
- మరో ఘటనలో చెట్టుకొమ్మ విరిగిపడి టెన్త్ విద్యార్థి కూడా..
- సిద్దిపేట జిల్లాలో బీభత్సం సృష్టించిన వడగళ్ల వాన
- పలు పంటలకు అపార నష్టం

గజ్వేల్ రూరల్/ కౌడిపల్లి (నర్సాపూర్): రాష్ట్రంలో గాలి వాన బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులకు మెదక్ జిల్లాలో ఊయలలో ఆడుకుంటున్న చిన్నారి ఎగిరి పక్కింటి డాబాపై పడి మృతిచెందగా, సిద్దిపేట జిల్లాలో చెట్టు కూలిన ఘటనలో ఓ టెన్త్ విద్యార్థి కన్నుమూశాడు. వడగళ్ల వాన ధాటికి సిద్దిపేట జిల్లాలో పంటలకు తీవ్ర నష్టం కలిగింది. వివరాలు.. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని రాజిపేట జాజితండాకు చెందిన మాలోత్ మాన్‌సింగ్, మంజుల దంపతులకు ఒక కుమారుడు, కవలలు సీత, గీత ఉన్నారు. దంపతులు కూలిపనులకు వెళ్లగా పిల్లలు, నానమ్మ ఇంటివద్ద ఉన్నారు. మంగళవారం గాలి వాన ధాటికి ఇంటి పైకప్పు ఒక్కసారిగా లేచిపోయింది. ఇంట్లో చీర ఉయ్యాలలో ఆడుకుంటున్న సీత (5) కూడా రేకులతో పాటు ఎగిరి సుమారు

మిగతా 10వ పేజీలో ▶

అన్ని వేళ్లూ అటు వైపే!



ప్రణీత్‌రావు

- ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎస్పీగా పని చేసిన ప్రభాకర్‌రావు
- ప్రణీత్ పరిచయమైందీ అక్కడే...
- టీమ్ మొత్తం గతంలో నల్లగొండలో పని చేసిందే
- ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను అదుపులోకి తీసుకున్న సిట్

సాక్షి, హైదరాబాద్: అక్రమ ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు 'సైన్యానికి', నల్లగొండ జిల్లాకు లింకు ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న వాళ్లు గతంలో ఆ ఉమ్మడి జిల్లాలో పని చేసిన వాళ్లే కావడం గమనార్హం. పోలీసు కస్టడీలో ఉన్న మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును సిట్ అధికారులు మూడో రోజైన మంగళవారమూ బంజారాహిల్స్ ఠాణాలో ప్రశ్నించారు. మరోపక్క ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను సిట్ అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ప్రభాకర్‌రావు 2014కు ముందు ప్రాధాన్యత కలిగిన పోస్టింగ్స్ చాలా తక్కువ చేశారు. అలాంటి వాటిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎస్పీ కూడా ఒకటి. ప్రభాకర్‌రావుకు ప్రణీత్ అక్కడే పరిచయమైనట్లు తెలిసింది. అతడితోపాటు ఎస్ఐబీ కేంద్రంగా ప్రభాకర్‌రావుకు, కొందరు రాజకీయ నాయకులకు ప్రైవేట్ సైన్యంలా

మిగతా 5వ పేజీలో ▶

అత్యధిక ఎంపీ సీట్లలో గెలవాలి

బీజేపీ ప్రధాన కార్యదర్శి తివారీ పిలుపు



సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక ఎంపీ సీట్లు గెలవడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్ తివారీ పిలుపునిచ్చారు. తెలంగాణలో కచ్చితంగా 12కు పైగా పార్లమెంటు సీట్లు, దేశంలో 400కు పైగా సీట్లు బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఎస్సీ మోర్చా రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షుల సమావేశం జరిగింది. ఈ భేటీకి ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రశేఖర్ మాట్లాడుతూ 17 ఎంపీ సీట్లకు ఎస్సీ మోర్చా తరఫున 17 మంది ప్రభారీలను (ఇన్‌చార్జ్) నియమించాలని సూచించారు. ప్రతి పార్లమెంటు కేంద్రంలో 5 వేల మంది ఎస్సీ ప్రతినిధులతో సమ్మేళనాలు నిర్వహించి మోదీని మూడవసారి ప్రధానిని చేయడానికి కృషి చేయాలన్నారు. బీజేపీ ఉపాధ్యక్షుడు, ఎస్సీ మోర్చా ఇన్‌చార్జి మనోహర్‌రెడ్డి, సీనియర్ నేతలు చింతా సాంబమూర్తి, రాములు, బోసుపల్లి ప్రతాప్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కుమ్మరి శంకర్, కాంతి కిరణ్, మొగులయ్య పాల్గొన్నారు.

ఉద్యమ ద్రోహులే బీఆర్‌ఎస్‌కు ద్రోహం చేస్తున్నారు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉద్యమంలో ద్రోహం చేసిన వారే ఇప్పుడు కూడా బీఆర్‌ఎస్ పార్టీకి ద్రోహం చేస్తున్నారని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో చేరి లాభం పొందిన కొందరు స్వార్థపరులే బీఆర్‌ఎస్‌ను వీడుతున్నారన్నారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి మంగళవారం తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు చెందిన బహుజన నాయకులను లోబరచుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అంబేడ్కర్ సిద్ధాంతాలను బీఆర్‌ఎస్ అనుసరిస్తున్నందునే ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ తమ పార్టీలో చేరారని చెప్పారు. తనపై పదేళ్లుగా దుష్ప్రచారం జరుగుతోందని, అయోధ్యకు వెళ్లినంత మాత్రాన తాను బీజేపీలో చేరుతున్నట్లు చెప్పడం అవాస్తవమని ఆయన స్పష్టం చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై పరువు నష్టం దావా వేస్తానని ప్రకటించారు. విచారణల పేరిట కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన దళితబంధు వంటి పథకాల అమలును రాష్ట్ర ప్రభుత్వం పక్కన పెడుతోందని కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. ముఖ్యమంత్రి అధికార దురహంకారంతో వ్యవహరిస్తున్నారని ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మండిపడ్డారు.

తెలంగాణ ఉద్యమకారుల సంఘం గౌరవాధ్యక్షుడిగా గజ్జెల కాంతం



పంజగుట్ట (హైదరాబాద్): తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలంతో పాటు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.25 లక్షలు సాధించడమే లక్ష్యంగా తెలంగాణ ఉద్యమకారుల సంఘం పనిచేస్తుందని సంఘం వ్యవస్థాపకులు తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఉద్యమకారుల సంఘాన్ని ప్రకటించి 32 మందితో అడ్‌హాక్ కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, తెలంగాణ ఉద్యమకారుల సంఘం గౌరవాధ్యక్షుడు గజ్జెల కాంతం మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఏనాడూ ఉద్యమకారులను గౌరవించలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇస్తానని ప్రకటించిందని, ఆరు గ్యారంటీల పథకాల్లో ఉద్యమకారుల గురించి కూడా పొందుపర్చిందని గుర్తుచేశారు. కేసీఆర్ చావునోట్లో తల పెట్టాను అనడం సరికాదని, ఉద్యమకారుల పోరాటం, ఆత్మబలిదానాలవల్లే సోనియాగాంధీ తెలంగాణ ప్రకటించారని తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి సంబంధంలేని కొంతమంది తెలంగాణ ఉద్యమ జేఏసీ అని చెప్పుకుంటూ తిరుగుతున్నారని, వారికి ఉద్యమానికి ఎలాంటి సంబంధంలేదనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారిపై చర్యలు తీసుకునేలా చేస్తామని హెచ్చరించారు.

ప్రాక్టీస్ టెస్టులు మిస్ అవొద్దు

నీట్, జేఈఈ ప్రిపరేషన్ మెళకువలు తెలిపిన ఆకాశ్ టాపర్స్

సాక్షి, హైదరాబాద్: నీట్, జేఈఈ వంటి కాంపిటీటివ్ పరీక్షలకు ముందు విద్యార్థులు ప్రాక్టీస్ టెస్టులు అస్సలు మిస్ కావొద్దని నీట్-2023 టాపర్ ఆకాషియన్ విముక్త శర్మ చెప్పారు. ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్‌కు సంబంధించి నీట్, జేఈఈ వంటి కాంపిటీటివ్ పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన పలువురు విద్యార్థులు వారి ప్రిపరేషన్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు ఇచ్చారు. టాపర్లుగా నిలిచివారి విజయంలో రోజువారీ టెస్టులు కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. నీట్ యూజీ-2023 టాపర్ కౌస్తవ్ బౌరి మాట్లాడుతూ మాక్ టెస్టులు రాయడం తప్పనిసరని, పరీక్ష అనంతరం ప్రశ్నపత్రం గురించి లెక్చరర్లతో చర్చిస్తే సందేహాలు నివృత్తి అవుతాయన్నారు. జేఈఈ మెయిన్ టాపర్ శ్రీరామ్ మాట్లాడుతూ ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్‌లో లెక్చరర్లు ప్రతీ విద్యార్థి గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారని చెప్పారు.

సవాళ్లను అధిగమిస్తూ..

సత్తా చాటేలా

లోక్‌సభ ఎన్నికలపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ దృష్టి



- పార్టీ నేతలు, కేడర్‌లో ఆత్మవిశ్వాసం నింపుతూ సన్నద్ధులను చేసేలా ప్రణాళికలు
- అభ్యర్థుల ఎంపిక, సమన్వయం, ప్రచార షెడ్యూల్‌పై కసరత్తు
- ఇప్పటికే 11 స్థానాలకు అభ్యర్థుల ఖరారు
- ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను చేర్చుకోవడం ద్వారా కొత్త ఎత్తుగడ!
- కాంగ్రెస్, బీజేపీల అడుగులపై నజర్
- నేతలు పార్టీని వీడిన ప్రాంతాల్లో దిద్దుబాటు చర్యలు
- ఏప్రిల్ మొదటి వారం నుంచి ఎన్నికల ప్రచారానికి సమాయత్తం

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇంటా బయటా ఎదురవుతున్న వరుస సవాళ్లను అధిగమిస్తూ, లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటే దిశగా పార్టీని నడిపించేందుకు బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. నేతల నిష్క్రమణ, ఎమ్మెల్సీ కవిత అరెస్టు వంటి పరిణామాలు పార్టీలో కలకలం రేపుతున్నప్పటికీ.. కీలకమైన అభ్యర్థుల ఎంపిక, సమన్వయం, ప్రచార షెడ్యూల్ వంటి అంశాలపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించారు. పార్టీ నేతలు, కేడర్‌లో ఆత్మవిశ్వాసం నింపుతూ ఎన్నికలకు సన్నద్ధులను చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. బీఎస్పీతో పొత్తు వ్యూహం విఫలమైనా, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను పార్టీలో చేర్చుకోవడం ద్వారా కొత్త ఎత్తుగడలకు శ్రీకారం చుట్టారు. మరో అరడజను లోకసభ స్థానాలకు పార్టీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపైనా ముమ్మర కసరత్తు చేస్తున్నారు. వచ్చే నెల మొదటి వారం నుంచి భారీ బహిరంగ సభల నిర్వహణ ద్వారా ఎన్నికల ప్రచార పర్వంలోకి అడుగు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు.

త్వరలోనే మిగతా అభ్యర్థుల ప్రకటన

రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు గాను ఇప్పటికే 11 స్థానాలకు అభ్యర్థులను కేసీఆర్ ఖరారు చేశారు. 9 మంది బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎంపీల్లో ఐదుగురు పార్టీని వీడిన నేపథ్యంలో..మిగిలిన ముగ్గురు సిట్టింగ్ ఎంపీలతో పాటు కొత్తగా 8 మంది పోటీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఇక పార్టీలో తాజాగా చేసిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నాగర్‌కర్నూలు నుంచి పోటీ చేయడం దాదాపు ఖాయమైంది. దీంతో పాటు కీలకంగా భావిస్తున్న సికింద్రాబాద్, భువనగిరి, నల్లగొండ, మెదక్ నుంచి పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపైనా కసరత్తు జరుగుతోంది. మెదక్ నుంచి వంటేరు ప్రతాప్‌రెడ్డి, నల్లగొండ నుంచి కంచర్ల కృష్ణారెడ్డి పేర్లు దాదాపు ఖరారైనట్లు సమాచారం. హైదరాబాద్ నుంచి కూడా బలమైన అభ్యర్థిని బరిలోకి దించాలని కేసీఆర్ భావిస్తున్నారు. అయితే సికింద్రాబాద్, భువనగిరి అభ్యర్థులు ఎవరనే అంశంపై పార్టీ లోపలా బయటా సస్పెన్స్ కొనసాగుతోంది.

సీనియర్లకు సమన్వయ బాధ్యతలు

తొలుత అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఎన్నికల సన్నద్ధత సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెల 23న చేవెళ్లలో నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభను రద్దు చేసి, అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా భేటీలు జరపాలని ఆదేశించారు. చేవెళ్ల లోక్‌సభ స్థానానికి సంబంధించి మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి సంపూర్ణ సమన్వయ బాధ్యతలు అప్పగించారు. హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ బాధ్యతలు రాజ్యసభ ఎంపీ బడుగుల లింగయ్యకు అప్పగించారు. వర్ధన్నపేట నియోజకవర్గ కేడర్‌ను సమన్వయం చేయాల్సిందిగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును ఆదేశించారు.

ఆశావహులకు బుజ్జగింపులు

లోక్‌సభ టికెట్లు ఆశించి భంగపడిన నేతలను బుజ్జగించే బాధ్యతను స్థానిక నేతలకు కేసీఆర్ అప్పగించారు. ఈ నేపథ్యంలో వరంగల్ టికెట్ ఆశించిన డాక్టర్ నిరంజన్, జోరిక రమేశ్, యాదగిరి, బోడ అనయ్ తదితరులను మంగళవారం వినయభాస్కర్, పెద్ది సుదర్శన్ రెడ్డి తదితరులు బుజ్జగించారు. త్వరలో కేసీఆర్ లేదా కేటీఆర్ వద్దకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఇదే తరహాలో మహబూబాబాద్, ఆదిలాబాద్, చేవెళ్ల తదితర లోక్‌సభ నియోజకవర్గాల్లోనూ బుజ్జగింపుల పర్వం కొనసాగుతోంది.

ఎప్పటికప్పుడు నష్ట నివారణ చర్యలు

జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ వేస్తున్న ఎన్నికల ఎత్తుగడలు, అనుసరిస్తున్న వ్యూహాలను కేసీఆర్ నిశితంగా పరిశీలిస్తున్నారు. కొందరు పార్టీ సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలను చేర్చుకుంటూ బీఆర్‌ఎస్‌ను బలహీన పరిచేందుకు ఆ రెండు పార్టీలూ చేస్తున్న ప్రయత్నాలపై దృష్టి పెట్టారు. ఎప్పటికప్పుడు నష్ట నివారణ చర్యలు చేపడుతున్నారు. సిట్టింగ్ ఎంపీలు పార్టీని వీడిన నియోజకవర్గాల్లో ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేయడం ద్వారా కేడర్‌లో అయోమయానికి తెరదించారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్ (వర్ధన్నపేట), సైదిరెడ్డి (హుజూర్‌నగర్), ఎమ్మెల్యేలు దానం నాగేందర్ (ఖైరతాబాద్), తెల్లం వెంకటరావు (భద్రాచలం) తదితరులు పార్టీని వీడిన నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల్లో దిద్దుబాటు చర్యలు చేపట్టారు. సంబంధిత జిల్లా నేతలకు సమన్వయ బాధ్యతలు అప్పగించారు. స్థానిక కేడర్‌తో బుధవారం నియోజకవర్గ కేంద్రాల్లో సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఢిల్లీలోనే కేటీఆర్, హరీశ్‌రావు

ఎమ్మెల్సీ కవిత అరెస్టు నేపథ్యంలో మూడురోజుల క్రితం ఢిల్లీకి వెళ్లిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, హరీశ్‌రావు అక్కడే మకాం వేశారు. గురువారం వారు హైదరాబాద్‌కు తిరిగి వచ్చే అవకాశం ఉందని బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి. ఎన్నికల ప్రచార షెడ్యూల్ సిద్ధమైందని, కేసీఆర్ స్వయంగా మీడియా ముందుకు వచ్చే అవకాశమున్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే బహిరంగ సభలతో పాటు అవసరమైన చోట కేసీఆర్ బస్సు యాత్ర కూడా చేపట్టే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. త్వరలో ఓ ప్రముఖ చానల్ ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు ఇతర అంశాల విషయంలో, తనపై, పార్టీపై వస్తున్న ఆరోపణలు, విమర్శలకు కేసీఆర్ సుదీర్ఘ వివరణ ఇస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

రెండో జాబితా రెడీ!

▶ మొదటి పేజీ తరువాయి

కమిటీ ఇతర సభ్యులు ఈ భేటీలో పాల్గొన్నారు. తెలంగాణకు సంబంధించి చర్చ జరిగినప్పుడు టీపీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఆదివారం ముంబైలో జరిగిన రాష్ట్ర స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో ఖరారు చేసిన జాబితాపై చర్చించారు.



ఢిల్లీలో జరిగిన సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్

13 మందిని ప్రకటించాలనుకున్నా..

తొలి జాబితాలో జహీరాబాద్, మహబూబాబాద్, నల్లగొండ, మహబూబ్‌నగర్ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మిగిలిన 13 స్థానాలకు అభ్యర్థుల ఖరారుపై పార్టీ పెద్ద ఎత్తున కసరత్తు జరిపింది. ఏఐసీసీ వర్గాల సమాచారం ప్రకారం..13 మంది అభ్యర్థుల పేర్లను సీఈసీలో చర్చించి ఒకేసారి ప్రకటించాలని భావించారు. అయితే ఐదు లోక్‌సభ స్థానాలకు ఎక్కువ మంది ఆశావహులు ఉండడంతో వాటిపై పీటముడి పడింది. దీంతో అవి మినహా మిగిలిన 8 స్థానాలపై చర్చించి ఆమోద ముద్ర వేశారు. చేవెళ్ల నుంచి రంజిత్‌రెడ్డి, మల్కాజ్‌గిరి నుంచి సునీతా మహేందర్ రెడ్డి, నాగర్‌కర్నూల్ నుంచి మల్లు రవి, పెద్దపల్లి నుంచి గడ్డం వంశీ, నిజామాబాద్ నుంచి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్ నుంచి డాక్టర్ సుమలత, కరీంనగర్ నుంచి ప్రవీణ్‌రెడ్డి, వరంగల్ నుంచి పసునూరి దయాకర్‌ల పేర్లు పరిగణనలోకి తీసుకుని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఖమ్మం, సికింద్రాబాద్, భువనగిరి, హైదరాబాద్, మెదక్ స్థానాలపై ఈ నెల 21న మరోసారి జరుగనున్న సీఈసీ భేటీలో చర్చించే అవకాశం ఉందని ఏఐసీసీ వర్గాలు చెపుతున్నాయి.

ఆరు స్థానాలపైనే చర్చ: గాంధీభవన్ వర్గాలు

గాంధీభవన్ వర్గాల సమాచారం ప్రకారం.. సీఈసీ భేటీలో ఆరు స్థానాలపైనే చర్చ జరిగింది. అయితే ఐదు స్థానాలకు మాత్రమే అభ్యర్థులను ఖరారు చేశారు. పెద్దపల్లి నుంచి గడ్డం వంశీ, చేవెళ్ల నుంచి రంజిత్‌రెడ్డి, మల్కాజ్‌గిరి నుంచి సునీతా మహేందర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ నుంచి మల్లు రవి, ఆదిలాబాద్ నుంచి డా. సుమలతల అభ్యర్థిత్వాలకు సీఈసీ ఆమోదం తెలిపింది. భువనగిరిపై కూడా చర్చ జరిగినా.. టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సతీమణి కోమటిరెడ్డి లక్ష్మిల్లో ఒకరిని ఖరారు చేయాలా? ఇంకెవరికైనా అవకాశం కల్పించాలా? అన్న దానిపై మరోమారు చర్చించాలనే నిర్ణయానికి వచ్చారు. మొత్తం మీద బుధవారం అధికారికంగా జాబితా ప్రకటించే అవకాశం ఉందని, కాని పక్షంలో మరుసటి రోజు విడుదల చేస్తారని చెబుతున్నారు. అయితే 8 స్థానాలకు ప్రకటిస్తారా లేక ఐదుకే పరిమితమవుతారా? అనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది.

నేటి నుంచి శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు



తెప్పోత్సవాలకు ముస్తాబైన పుష్కరిణి

తిరుమల: తిరుమల శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు ఈనెల 20 నుంచి 24 వరకు జరుగనున్నాయి. రాత్రి 7-8 గంటల వరకు పుష్కరిణిలో స్వామి, అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. తెప్పోత్సవాల్లో భాగంగా 20న శ్రీ సీతాలక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి తెప్పలపై పుష్కరిణిలో 3 చుట్లు తిరుగుతారు. 21న రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణస్వామిగా, 22న శ్రీ భూ సమేతంగా మలయప్పస్వామిగా మూడు సార్లు పుష్కరిణిలో విహరిస్తారు. శ్రీమలయప్ప స్వామివారు 23న ఐదు సార్లు, 24న ఏడు సార్లు తెప్పపై పుష్కరిణిలో విహరిస్తారు. ఈ కారణంగా మార్చి 20, 21వ తేదీల్లో సహస్రదీపాలంకార సేవ, మార్చి 22, 23, 24వ తేదీల్లో ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

భారత్, యూఎస్ రక్షణ బంధం మరింత బలోపేతం

- ఇండియన్ యూఎస్ అంబాసిడర్ ఎరిక్ గార్సెట్టి
- విశాఖలో భారత్, యూఎస్ త్రివిధ దళాల ఆధ్వర్యంలో టైగర్ ట్రయాంఫ్ విన్యాసాలు



కవాతు చేస్తున్న భారత్, అమెరికా దళాలు

సాక్షి, విశాఖపట్నం : భారత్, అమెరికా మధ్య రక్షణ విభాగ బంధం మరింత బలోపేతం కానుందని భారత్-యూఎస్ రాయబారి ఎరిక్ గార్సెట్టి చెప్పారు. పసిఫిక్ సముద్రజలాల్లో అన్ని దేశాలూ స్వేచ్ఛాయుత వాణిజ్య కార్యకలాపాలు సాగించేలా చేయడమే తమ లక్ష్యమన్నారు. తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం విశాఖపట్నంలో భారత్, యూఎస్ త్రివిధ దళాల ఆధ్వర్యంలో టైగర్ ట్రయాంఫ్ యుద్ధ విన్యాసాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా.. ఐఎన్‌ఎస్ జలాశ్వా యుద్ధనౌక ఆన్‌బోర్డుపై ఇరుదేశాల ప్రతినిధులు మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎరిక్ మాట్లాడుతూ సాగర జలాల సరిహద్దుల్లో చొరబాట్లు, సముద్రపు దొంగల ఆట కట్టించేందుకు భారత్‌తో కలిసి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. యూఎస్ సెవెన్త్ ఫ్లీట్ రిజర్వ్ వైస్ కమాండర్ రియర్ అడ్మిరల్ జోక్విన్ జె మార్టినైజ్ మాట్లాడుతూ టైగర్ ట్రయాంఫ్ నిర్వహణతో భారత్, యూఎస్ మధ్య ఉన్న బంధాన్ని ప్రపంచానికి చాటిచెబుతున్నామన్నారు. తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ మాట్లాడుతూ టైగర్ ట్రయాంఫ్ విన్యాసాల్లో భాగంగా హార్బర్ ఫేజ్‌లో విపత్తు, యుద్ధ సమయంలో రెండు దేశాల మధ్య పరస్పర సహకారాన్ని ఎలా అందిపుచ్చుకోవాలనే అంశాలతో పాటు ప్రీసెయిల్ చర్చలు, వృత్తిపరమైన విషయాలపై ఎక్స్‌పర్ట్స్ ఎక్స్ఛేంజీలు జరగనున్నాయని తెలిపారు.

యాదాద్రిలో వైభవంగా రథోత్సవం



దివ్యవిమాన రథంపై స్వామి, అమ్మవారిని ఊరేగిస్తున్న అర్చకులు.. రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లు తిరుమాడ వీధుల్లో దివ్య విమాన రథంపై ఊరేగారు. సాయంత్రం ఆలయంలో నిత్యారాధనలు నిర్వహించిన అనంతరం ఆచార్యులు చతుస్థానార్చనలు, మండపారాధన, మహామంత్ర పుష్ప పఠనాథులు, పురాణ, ఇతిహాస విజ్ఞాపనలు చేపట్టారు. అనంతరం రథాంగహోమం, రథబలి వంటి కార్యక్రమాలు జరిపించారు. రాత్రి సమయంలో ఆగమశాస్త్రానుసారంగా దివ్య విమాన రథోత్సవం నిర్వహించారు. కల్యాణ మూర్తులైన శ్రీలక్ష్మీనృసింహస్వామి వార్ల ఉత్సవ మూర్తుల అలంకారసేవను రథంపై ఊరేగించారు. ఇక ఉదయం ఆలయంలో శ్రీస్వామి వారిని శ్రీమహావిష్ణు అలంకారంలో గరుడ వాహనంపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు.

సన్నబియ్యం కావలెను!

- పౌర సరఫరాల సంస్థ వద్ద నిల్వలేక టెండర్ల ఆహ్వానం
- ఇటీవల వేలంలో సన్న ధాన్యాన్ని సైతం విక్రయించిన సంస్థ

సాక్షి, హైదరాబాద్: దేశానికి అవసరమైన బియ్యం అందించిన చరిత్ర ఉన్న రాష్ట్ర పౌర సరఫరాల సంస్థకు ఇప్పుడు సన్నబియ్యం కొనుక్కోవాల్సిన పరిస్థితి తలెత్తింది. దేశవ్యాప్తంగా బియ్యానికి ఒకవైపు డిమాండ్ పెరగగా, మరోవైపు రాష్ట్రంలో మిల్లర్ల వద్ద నిల్వ ఉన్న ధాన్యం వేలం వేశారు. దాంతో పౌరసరఫరాల సంస్థ వద్ద బియ్యం నిల్వలు నిండుకున్నట్టయింది. ఈ నేపథ్యంలో 2024-25 సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వ అవసరాలకు సన్న బియ్యం లేకుండా పోయాయి. దీంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టింది.

2.2 ఎల్‌ఎంటీ సన్నబియ్యం కావాలి..

రాష్ట్రంలోని హాస్టళ్లు, గురుకులాలు, అంగన్‌వాడీలతో పాటు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కోసం అవసరమైన సన్న బియ్యాన్ని పౌరసరఫరాల సంస్థ సరఫరా చేస్తుంది. ఇందుకు ఏడాదికి 2.2 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా సన్నబియ్యం అవసరం. ఇప్పటివరకు రాష్ట్రంలో యాసంగి, వానాకాలం సీజన్లలో రైతులు పండించిన ధాన్యం నుంచి సన్న రకాలను సేకరించి సీఎమ్మార్ కింద పంపేవారు. అయితే 2022-23 యాసంగి ధాన్యాన్ని మిల్లర్లు మిల్లింగ్ చేయక పోవడంతో 35 ఎల్‌ఎంటీ ధాన్యాన్ని ఇటీవలే వేలం వేశారు. ఇందులో 1.59 ఎల్‌ఎంటీ సన్న ధాన్యం కూడా ఉంది. అంతకు ముందు వానాకాలం ధాన్యం సీఎంఆర్ చేసి పూర్తిగా ఎఫ్‌సీఐకి పంపడంతో పౌరసరఫరాల శాఖ వద్ద సన్న బియ్యం లేవు. దీంతో ప్రత్యామ్నాయంగా సన్నబియ్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు టెండర్లు ఆహ్వానించింది. త్వరలోనే టెండర్లను ఫైనలైజ్ చేసే అవకాశం ఉంది.

వేలంలో కొనుగోలు చేస్తే ఆర్థికంగా భారం!

గతంలో సన్న బియ్యం అవసరం అయినప్పుడు ప్రభుత్వం మిల్లర్ల నుంచి నేరుగా కొనుగోలు చేసేది. క్వింటాకు రూ.3,500 నుంచి రూ. 3,800 వరకు ధర వెచ్చించేది. కానీ ఈసారి 2.2 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని వేలం ద్వారా కొనుగోలు చేస్తే ప్రస్తుత డిమాండ్ దృష్ట్యా అధిక భారం పడే అవకాశం ఉన్నది. ఇటీవల వేలం ద్వారా విక్రయించిన 1.59 లక్షల టన్నుల సన్న ధాన్యాన్ని ఉంచుకొని మిల్లింగ్ చేయిస్తే సుమారు 1.06 లక్షల టన్నుల బియ్యం వచ్చేవని, ఆ మేరకు సంస్థపై ఆర్థికభారం తగ్గే అవకాశం ఉండేదని పౌర సరఫరాల శాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

కన్నారావు పిటిషన్‌పై తీర్పు రిజర్వు

ఆదిబట్ల పీఎస్‌లో నమోదైన కేసులో...

సాక్షి, హైదరాబాద్: తనపై అక్రమంగా ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలని మాజీ సీఎం కేసీఆర్ అన్న కొడుకు కల్వకుంట్ల తేజేశ్వర్‌రావు అలియాస్ కన్నారావు దాఖలు చేసిన పిటిషన్‌లో హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. ఆదిబట్ల పీఎస్ పరిధిలోని అబ్దుల్లాపూర్ మండలం మన్నెగూడ వద్ద 2 ఎకరాల ప్రైవేట్ భూమిని కబ్జా చేశారన్న ఆరోపణలపై కన్నారావుపై కేసు నమోదైంది. ఓఎస్‌ఆర్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ శ్రీనివాస్ మార్చి 3న ఆదిబట్ల పీఎస్‌లో దీనిపై ఫిర్యాదు చేశారు. ఓఆర్‌ఎస్ ప్రాజెక్టుకు సంబంధించి వంశీ అభివృద్ధి చేస్తున్న భూమిని కన్నారావు, మరో 30 మంది బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి బలవంతంగా ఆక్రమించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. దీంతో పోలీసులు హత్యాయత్నం, నేరపూరిత చొరబాటు, నష్టం కలిగించడం, పేలుడు పదార్థాలను ఉపయోగించడం, అల్లర్లకు పాల్పడినందుకు కేసు నమోదు చేశారు. తనపై హత్యాయత్నం, భూ ఆక్రమణ ఆరోపణలపై ఆదిబట్ల పోలీసులు నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ కన్నారావు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన విచారణ చేపట్టారు. వాదనలు విన్న అనంతరం తీర్పును రిజర్వు చేశారు.

ఆ రెండూ ఎవరికో?

బీజేపీ వరంగల్, ఖమ్మం స్థానాలపై రాని స్పష్టత

- మిగతా 15 స్థానాలకు అభ్యర్థులు ఖరారు
- వరంగల్ అరూరి రమేశ్‌కు ఖాయమంటున్న పార్టీ వర్గాలు
- ఖమ్మం టికెట్ కోసం ఓ బీఆర్‌ఎస్ ఎంపీ సహా పలువురి ప్రయత్నాలు
- పరిశీలనలో జలగం వెంకటరావు పేరు
- నల్లగొండ అభ్యర్థి ఖరారైనా ప్రయత్నాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ!



సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లకు గాను 15 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయగా..పెండింగ్‌లో ఉన్న వరంగల్, ఖమ్మం అభ్యర్థుల విషయంలో ఇంకా పూర్తిస్థాయిలో స్పష్టత రాలేదు. వరంగల్ ఎంపీ సీటు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌కు ఖరారైనట్టు సమాచారం. మరోవైపు ఖమ్మం సీటు కోసం పలువురు ప్రయత్నాలు చేస్తుండగా, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావు పేరును నాయకత్వం పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. మంగళవారం బీజేపీ కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్ తివారీతో ఆయన సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు బీఆర్‌ఎస్‌కు చెందిన ఓ ఎంపీ ఖమ్మం టికెట్ కోసం ఢిల్లీస్థాయిలో పెద్దెత్తున ప్రయత్నాలు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. గతంలో తాను టీడీపీలో ఉన్నందున, ఇప్పుడు ఏపీలో టీడీపీ-బీజేపీల మధ్య పొత్తు దృష్ట్యా, ఖమ్మంలో తనకు టీడీపీ శ్రేణులు సహకరిస్తాయని, తప్పకుండా గెలుస్తానంటూ బీజేపీ నాయకత్వాన్ని ఒప్పించే ప్రయత్నాల్లో ఆయన నిమగ్నమైనట్టు చెబుతున్నారు. దీంతో ఖమ్మం విషయంలో ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని బీజేపీ భావిస్తున్నట్టు తెలుస్తోంది.

శానంపూడికి ఖాయమేనా?

నల్లగొండ సీటును బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డికి ఇప్పటికే ప్రకటించారు. కానీ తనకు టికెట్ ఇస్తే అక్కడి నుంచి పోటీ చేసి గెలుస్తానంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ ఒకరు గట్టిగా ప్రయత్నాలు సాగిస్తున్నట్టు తెలిసింది. దీనిపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ప్రకటించిన అభ్యర్థిని మార్చడం కుదరదని కొందరు అంటుంటే, గెలుపు ఖాయమనుకుంటే అభ్యర్థిని మార్చేందుకు నాయకత్వం వెనుకాడదని కొందరు అంటున్నారు. 22వ తేదీన జరిగే పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో పెండింగ్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించవచ్చునని పార్టీ నేతలు చెబుతున్నారు.

23న అభ్యర్థులతో కిషన్‌రెడ్డి సమావేశం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఈ నెల 23న పార్టీ కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించనున్నారు. శనివారం నాటి కల్లా 17 స్థానాలకు అభ్యర్థులు ఖరారు అయ్యే అవకాశాలు ఉండడంతో వారితో ఈ భేటీ జరపనున్నట్టు సమాచారం. ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాలు సమావేశంలో చర్చిస్తారని తెలుస్తోంది.

తెలంగాణ గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్

▶ మొదటి పేజీ తరువాయి

బీజేపీ బలోపేతానికి కృషి చేశారు. 2023 ఫిబ్రవరి 12న జార్ఖండ్ గవర్నర్‌గా నియమితులయ్యారు.

రాష్ట్రపతి, ప్రధానికి ధన్యవాదాలు

తెలంగాణ గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించినందుకు ఎంతో సంతోషంగా ఉందని రాధాకృష్ణన్ పేర్కొన్నారు. మాతృభూమికి సేవ చేయడానికి అవకాశం ఇచ్చిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఎక్స్ (ట్విటర్) ద్వారా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

క్లుప్తంగా...

కేటీఆర్‌కు నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీ ఆహ్వానం

ఏప్రిల్ 13న ఇండియా వాణిజ్య సదస్సులో ప్రసంగం



సాక్షి, హైదరాబాద్: అమెరికాలోని నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 13న నిర్వహించే ఇండియా వాణిజ్య సదస్సుకు హాజరు కావాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావును ఆహ్వానించారు. ఇల్లినాయిస్ రాష్ట్రంలో జరిగే ఈ సదస్సులో భారత పారిశ్రామిక రంగంలో నెలకొన్న అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై ఆయన ప్రసంగిస్తారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో పారిశ్రామిక పురోగతి, పెట్టుబడుల ఆకర్షణ కోసం రూపొందించిన విధానాలు, వాటి విజయాలపై వివరించాలంటూ నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీలోని కెల్లాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ డైరెక్టర్ శ్వేత మేడపాటి కేటీఆర్‌కు ఆహ్వానపత్రం పంపారు.

బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలి

ఆర్.కృష్ణయ్య డిమాండ్



ముషీరాబాద్ (హైదరాబాద్): బీసీ కులాలకు 8 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం పట్ల బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. 56 బీసీ కులాలు, వృత్తి కులాలు ఉన్న ప్రతి కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో 13 బీసీ సంఘాల సమావేశం ఆయా సంఘాల నేతలు అనంతయ్య, గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ ప్రతి కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే ఆ కులాల్లో నాయకత్వం, సమాజంలో గుర్తింపు గౌరవం పెరుగుతాయని తెలిపారు. తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలిగా కోటేశ్వరిని నియమిస్తూ కృష్ణయ్య నియామక పత్రాన్ని అందజేశారు.

'అరుణోదయ' నిషేధిత సంస్థ కాదు

ఏసీఎఫ్ గౌరవ అధ్యక్షురాలు విమలక్క



సిరిసిల్ల: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య(ఏసీఎఫ్) నిషేధిత సంస్థ కాదని, ఆ సంస్థ గౌరవ అధ్యక్షురాలు విమలక్క స్పష్టం చేశారు. హైదరాబాద్ లో మంగళవారం అరుణోదయ సమాఖ్య ప్రతినిధులతో కలిసి ఆమె మాట్లాడారు. ఈ మేరకు రాజన్నసిరిసిల్ల జిల్లా మీడియా ప్రతినిధులకు సమావేశ వివరాలు పంపారు. ఏసీఎఫ్‌ను సిరిసిల్ల జిల్లా ఎస్పీ నిషేధిత సంస్థగా అభివర్ణించ డాన్ని విమలక్క ఖండించారు. పోకల సాయికుమార్ అనే న్యాయ విద్యార్థితోపాటు, పురుషోత్తమరావు అనే వ్యక్తిపై 20 23 సెప్టెంబర్‌లో తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. ఏసీఎఫ్‌ను జిల్లా ఎస్పీ నిషేధిత సంస్థగా పేర్కొనడాన్ని ప్రజలు, ప్రజాసంఘాలు ఖండించాలన్నారు.

నేడు భూ సమస్యలపై టీ-శాట్‌లో చర్చ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని భూ సమస్యల పరిష్కారానికి బుధవారం టీ-శాట్‌లో ప్రత్యేక చర్చ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని సీఈవో బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సలహాలు - సూచనల కోసం 040-23540326, 223450726 టోల్‌ఫ్రీ నంబర్ 1800425 4039లకు ఫోన్ చేయాలని మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు.

ఎస్సైగా నమ్మించి.. పెళ్లిచూపుల్లో దొరికిపోయి..

వెలుగుచూసిన నకిలీ ఆర్‌పీఎఫ్ ఎస్సై వ్యవహారం

- ఆర్‌పీఎఫ్ ఎస్సై కంటిపరీక్షల్లో మాళవిక అనర్హత
- కుటుంబసభ్యులు, గ్రామస్తులకు తెలియొద్దని ఎస్సై అవతారం
- యూనిఫామ్‌లోనే రీల్స్.. పోస్టింగ్‌లు



రైల్వేస్టేషన్ విధుల్లో ఉన్నట్టు మాళవిక దిగిన ఫొటో (ఫైల్)



సికింద్రాబాద్/నార్కట్‌పల్లి: ఎస్సై కావాలనేది చిన్ననాటి కల. కానీ కంటి పరీక్షల్లో అనర్హత కారణంగా ఎస్సై గా ఎంపిక కాలేకపోయింది. తల్లిదండ్రులు, గ్రామస్తులను నమ్మించడానికి నకిలీ ఎస్సైగా అవతారం ఎత్తింది. యూనిఫామ్‌లోనే దైవదర్శనాలకు వెళ్లేది. రీల్స్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేది. పెళ్లిచూపులకూ ఏకంగా పోలీస్ డ్రెస్‌లోనే వచ్చింది. అబ్బాయి తరఫు వారు ఆరా తీయడంతో అసలు విషయం వెలుగుచూసింది. సికింద్రాబాద్ రూరల్ డీఎస్పీ కె.శ్రీనివాస్ రావు కథనం ప్రకారం..నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన మాళవిక నిజాం కళాశాలలో డిగ్రీ పూర్తి చేసింది. 2019లో ఆర్‌పీఎఫ్ ఎస్సై రాతపరీక్షలో అర్హత సాధించింది. అయితే కంటి పరీక్షల్లో అనర్హత కారణంగా ఎస్సై పోస్టుకు ఎంపిక కాలేదు. ఈ అవమానభారాన్ని తట్టుకోలేక నకిలీ ఎస్సై అవతారం ఎత్తాలని నిర్ణయించుకుంది. దీనికి అవసరమైన డ్రెస్, నేమ్‌బోర్డు, ఐడీ కార్డు తయారు చేయించింది. నార్కట్‌పల్లి నుంచి యూనిఫామ్‌లోనే ప్రతిరోజూ వెళ్లి రాత్రికి ఇంటికి వచ్చేది. యూనిఫామ్ ధరించి రైలు ప్రయాణాలు చేస్తూ దైవ దర్శనాలకు వెళ్లేది. మధ్యమధ్యలో నిందితులను తాను అదుపులోకి తీసుకున్నట్టు, రైల్వేస్టేషన్లలో విధుల్లో ఉన్నట్టు ఫొటోలు తీసుకుంది. శంకర్‌పల్లి ఆర్‌పీఎఫ్ ఎస్సైగా పనిచేస్తున్నట్టు ఏడాది కాలంగా కుటుంబ సభ్యులతోపాటు పలువురిని నమ్మించింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టా తదితర సోషల్ మీడియా యాప్‌లలో యూనిఫామ్‌తో విధుల్లో ఉన్నట్టు పలు పోస్టులు చేసింది.

ఆరా తీస్తే.. అసలు విషయం తెలిసింది

కొద్దిరోజుల క్రితం నల్లగొండ జిల్లా నుంచే మాళవికకు ఓ పెళ్లి సంబంధం వచ్చింది. పెళ్లిచూపులకు కూడా ఆమె ఎస్సై డ్రెస్‌లోనే హాజరైంది. విధుల్లో బిజీ ఉండి నేరుగా వచ్చినట్టు అబ్బాయి తరఫు బంధువులను నమ్మించింది. అమ్మాయి నచ్చడంతో అబ్బాయి తరఫువారు ఉద్యోగం గురించి ఆరా తీశారు. సికింద్రాబాద్‌కు వచ్చి ఆర్‌పీఎఫ్ పోలీసులను వాకబు చేశారు. దీంతో అసలు విషయం వెలుగుచూసింది. జీఆర్‌పీ సికింద్రాబాద్ రూరల్ డీఎస్పీ కె.శ్రీనివాస్‌రావు నేతృత్వంలో దర్యాప్తు చేసిన సికింద్రాబాద్ లైన్ ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీనివాస్, నల్లగొండ జీఆర్‌పీ ఎస్సై సలకమ్మలు నార్కట్‌పల్లిలో మాళవికను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితురాలి నుంచి యూనిఫామ్, ఆర్‌పీఎఫ్ లోగో, స్టార్లు, బెల్టు, నేమ్‌ప్లేట్, షోల్డర్ బ్యాడ్జీలు, నకిలీ ఐడీ కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

'వందేభారత్' వేళలు మార్చండి

సికింద్రాబాద్ టు విశాఖకు ఉదయం 5:05 గంటలకు రైలు ప్రారంభం

- ఆటోలు, క్యాబ్‌లు దొరక్క ప్రయాణికుల ఇబ్బందులు
- టైమింగ్స్ మార్చాలన్నా మూడోలైన్ పూర్తి కాక రూట్ ఖాళీ లేని పరిస్థితి



సాక్షి, హైదరాబాద్: 'సికింద్రాబాద్ - విశాఖ' వందేభారత్ రైలు టైమింగ్ మార్చాలనే డిమాండ్ రైల్వే ప్రయాణికుల నుంచి వినిపిస్తోంది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ఉదయం 5:05 గంటలకే బయలుదేరుతుండటంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. నగరానికి నలువైపులా ఉన్నవారు తెల్లవారుజామునే స్టేషన్‌కు చేరుకోవాలి. అయితే ఆ సమయానికి క్యాబ్‌లు, ఆటోలు బుక్ కావడం లేదు. ఒకవేళ బుక్ అయినా ఎక్కువ చార్జీ వసూలు చేస్తున్నారు. దీంతో ఆ రైలు టైమింగ్ మార్చాలనే డిమాండ్ వినిపిస్తోంది. సికింద్రాబాద్-విశాఖ మధ్య ఈ నెల 12న రెండో వందేభారత్ రైలుకు ప్రారంభించిన విషయం తెలిసిందే. నిజానికి ఈ రైలు ఉదయం 6 గంటల సమయంలో సికింద్రాబాద్ నుంచి బయలు దేరాల్సి ఉంది. కానీ, ఆ సమయంలో ఇతర రైళ్లు నడుస్తుండటంతో ఈ రైలును నడపలేని దుస్థితి నెలకొంది. మరో గంట తర్వాత కాస్త నిడివి ఉంది. కానీ, ఉదయం ఏడున్నరకు లింగంపల్లి-విశాఖ మధ్య నడిచే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఉదయం 7.10కి సికింద్రాబాద్‌లో బయలుదేరుతుంది. అది కూడా వందేభారత్ తరహాలో చైర్‌కార్ ఎక్స్‌ప్రెస్ రైలు. దీంతో విశాఖపట్నానికి రెండు చైర్‌కార్ ఎక్స్‌ప్రెస్‌లు ఒకేసారి బయలుదేరాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. దీంతో గత్యంతరం లేని పరిస్థితిలో వందేభారత్ రైలును ఉదయం 5.05 సమయాన్ని ఖరారు చేశారు. అయితే ఆ సమయం ప్రయాణికులకు అసౌకర్యంగా మారింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు ఉదయం ఐదింటిలోపు చేరుకోవాలంటే, దూరప్రాంతాల నుంచి వచ్చే వారు ఉదయం నాలుగింటికల్లా ఇళ్లలో బయలుదేరాలి. ఆ సమయాల్లో ఆటోలు, క్యాబ్‌లు తక్కువగా ఉండటంతో వాటి బుకింగ్ ఇబ్బందిగా మారింది.

మూడోలైన్ పూర్తయితేనే...

విశాఖకు నడుస్తున్న రెండు వందేభారత్ రైళ్లు వరంగల్ మీదుగా తిరుగుతున్నాయి. ఆ మార్గంలో మూడో లైన్ అందుబాటులో లేదు. ఉన్న రెండు లైన్లమీదుగా వందల సంఖ్యలో రైళ్లు పరుగుపెడుతున్నాయి. ప్రయాణికుల రైళ్లు, సరుకు రవాణా రైళ్లు ఆ రెండు లైన్లమీదుగానే నడపాల్సి వస్తోంది. ఈమార్గంలో మూడోలైన్ పనులు 2017 నుంచి నడుస్తున్నా..తీవ్ర జాప్యం జరుగుతోంది. మూడోలైన్ పూర్తయితే, మరిన్ని రైళ్లు నడిపేందుకు వీలవుతుంది. ప్రయాణికులకు అనువైన వేళల్లో నడిపేందుకూ అవకాశం కలుగుతుంది.

ఆ రూట్లో నడపలేక..

విశాఖపట్నం మొదటి వందేభారత్ రైలును వరంగల్ రూట్‌లో నడుపుతున్నందున, రెండో వందేభారత్‌ను నల్లగొండ-నడికుడి- గుంటూరు మార్గంలో తిప్పాలని తొలుత భావించారు. కానీ, ఆ మార్గం ప్రస్తుతం సింగిల్ లైన్‌తో ఉంది. ఎదురుగా ఓ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వస్తే, మిగతా వాటిని ఆయా ప్రాంతాల్లోని స్టేషన్‌లలో నిలపాలి. ఈ మార్గంలో తిరుపతి వందేభారత్ రైలు నడుస్తోంది. ఆ సింగిల్‌లైన్‌ను దాటే సమయంలో చాలా రైళ్లు క్రాసింగ్ సమయంలో నిలిచిపోవాల్సి వస్తోంది. దీంతో ఆ రూట్‌లో ఇబ్బందులు ఉన్నాయని, వరంగల్‌రూట్‌కు మార్చారు.

అయినా వెయిటింగ్ జాబితానే..

విశాఖకు నడిచే మొదటి వందేభారత్ రైలు సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరుతుంది. దానికి దాదాపు 114 శాతం ఆక్యుపెన్సీ రేషియో నమోదవుతోంది. కనీసం ఐదారు రోజుల వెయిటింగ్ లిస్టు ఉంటోంది. దీనికి ఆదరణ బాగుందనే రెండో వందేభారత్ రైలు ప్రారంభించారు. ఇది కూడా వందశాతం ఆక్యుపెన్సీ రేషియో దాటి నడుస్తోంది. నాలుగు రోజుల వెయిటింగ్ లిస్టు ఉంటోంది.

'రియల్' మోసాలు రూ.10 వేల కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

రాకపోయినా, భూ యజమానితో వివాదం తలెత్తినా ప్రాజెక్ట్ ఆగిపోయి ప్రీలాంచ్‌లో బుక్ చేసుకున్నవారు రోడ్డున పడుతున్నారు.

మోసాల విలువ రూ.10 వేల కోట్లు..

సాహితీ, భువనతేజ, జేజే ఇన్‌ఫ్రా, జేవీ బిల్డర్స్, జయ గ్రూప్ వంటి చిన్నా, పెద్దా కంపెనీలు ప్రీలాంచ్ ప్రాజెక్ట్‌లు చేపడుతున్నాయి. కోకాపేట, నానక్‌రాంగూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కొల్లూరు, నార్సింగి, నిజాంపేట, ఎల్‌బీనగర్, నార్సింగి, పుప్పాలగూడ, తెల్లాపూర్, శామీర్‌పేట, ఆదిబట్ల ఇలా హైదరాబాద్ నలువైపులా ఈ తరహా ప్రాజెక్ట్‌లు ఉన్నాయి. ఇలాంటి వెంచర్లు కనీసం వంద వరకు ఉంటాయని, నగరంలోని మూడు కమిషనరేట్ల పరిధిలోనే రియల్ మోసాల విలువ దాదాపు రూ.10 వేల కోట్లు ఉంటుందని పరిశ్రమవర్గాల అంచనా. రియల్ మోసాలకు గురైన వారంతా పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల కాలంలో ఇలాంటి ఫిర్యాదులు ఎక్కువయ్యాయి. దీంతో రియల్‌ఎస్టేట్ మోసాలపై పోలీసులు దృష్టి సారించారు. నిందితులపై డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ (టీపీడీఎఫ్ఈఏ) చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నారు.

కొనే ముందు జాగ్రత్తలు తప్పనిసరి



ప్రాపర్టీ కొనుగోలు చేసే ముందు సంబంధిత బిల్డర్, కంపెనీ పూర్వాపరాలు పరిశీలించాలి. ప్రాజెక్ట్‌ను పూర్తి చేసే ఆర్థిక స్తోమత ఆ సంస్థకు ఉందా? లేదా? అని ఆరా తీయాలి. దీనికి జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ విభాగాల నుంచి అను మతులు ఉన్నాయా.. లేదా, రెరాలో నమోదైందా లేదా తనిఖీ చేయాలి. ఏజెంట్ చెప్పినవన్నీ నమ్మకుండా, క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులను పరి శీలించాకే తుది నిర్ణయం తీసుకో వాలి. నగదు రూపంలో కాకుండా చెక్ రూపంలో లావాదేవీలు జరిపి తేనే ఉత్తమం.

– నరేంద్రకుమార్, ప్రణీత్ గ్రూప్ ఎండీ

తాగునీటి సమస్యపై యుద్ధప్రాతిపదికన చర్యలు

సచివాలయంలో సీఎస్ ఉన్నతస్థాయి సమీక్ష

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మంచినీటి సమస్య ఎదురైతే యుద్ధ ప్రతిపాదికన చర్యలు తీసుకుంటామని సీఎస్ శాంతికుమారి స్పష్టం చేశారు. అవసరమైన చోట ట్యాంకర్లతో కూడా నీటిసరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. మంగళవారం సచివాలయంలో తాగునీటి పరిస్థితులపై సీఎస్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రిజర్వాయర్లలో సరిపడా నీరు ఉన్నందున వేసవికాలంలో ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్‌లోనూ సరిపడా నీటిని అందిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లలో నీటి లభ్యత, వేసవి కాలంలో తాగునీటి సరఫరాకు తీసుకున్న చర్యలపై సంబంధిత శాఖల కార్యదర్శులతో సమీక్షించారు.

టెన్త్ పరీక్షలపై దృష్టిపెట్టాలి...

ఇటీవల ఇంటర్ పరీక్షలను నిర్వహించిన స్ఫూర్తితో ప్రస్తుతం జరుగుతున్న పదవ తరగతి పరీక్షలను కూడా విజయవంతంగా నిర్వహించాలని సీఎస్ సూచించారు. మంగళవారం టెన్త్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో ఆమె టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పరీక్షలను ఏ విధమైన ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని, పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లో ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు అనుమతించవద్దని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతోపాటు ప్రతి కేంద్రం వద్ద కానిస్టేబుల్ లేదా హోంగార్డును నియమించినట్టు తెలిపారు. పరీక్ష పేపర్లను తేవడం, తిరిగి పోస్టాఫీసులకు తీసుకెళ్లేటప్పుడు నిర్లక్ష్యం కూడదని, తగిన బందోబస్తు ఉండాలని సూచించారు.

మోదీ కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేస్తాం

టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్

సాక్షి, హైదరాబాద్: జగిత్యాల సభలో ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ మతపరమైన అంశాలు మాట్లాడారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఆరోపించారు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఆయన మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ మతపరమైన ఆరోపణలు చేయొద్దని హితవు పలికారు. హిందూమతంలో శక్తి అనే పదం ఉందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను మోదీ వక్రీకరించారని నిరంజన్ ఆరోపించారు.

కలుషిత నీటితో కాయగూరలా?

- అలాంటివి అమ్మకుండా చర్యలు చేపట్టండి... జీహెచ్‌ఎంసీ, ఇతర అధికారులకు హైకోర్టు ఆదేశం
- చెరువుల రక్షణకు కమిటీ ఇచ్చిన నివేదికపై విచారణ

సాక్షి, హైదరాబాద్: ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే కలుషిత నీటితో కాయగూరలు పండించడం, వాటి ని విక్రయించడంపై హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. పండించే వాళ్లు ఎవరైనా.. ఇది ఎంతమాత్రం సమర్థనీయం కాదని ఆక్షేపించింది. అలాంటి కాయగూరలు విక్రయించకుండా జీహెచ్‌ఎంసీ, సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించింది. అలాగే ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 13 చెరువుల రక్షణకు డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) గాడి ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ జీపీ శ్రీకాంత్‌రెడ్డి కమిటీ/అడ్వొకేట్ కమిషనర్లు అందించిన నివేదికపై చర్యలు తీసుకోవాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి ధర్మాసనం సూచించింది. ఆరు వారాలు సమయం ఇస్తున్నామని.. తదుపరి విచారణలోగా ఏం చర్యలు చేపట్టారన్న దానిపై కార్యాచరణ నివేదికను సమర్పించాలని చెప్పింది. విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. హైదరాబాద్ పరిధిలోని చెరువులు, కుంటలు ఆక్రమణకు గురవుతున్నాయని, శిఖంను ఆక్రమించుకు ని నిర్మాణాలు చేపడుతున్నారని.. అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ గమన సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనిల్ సి.దయాకర్ 2007లో హైకోర్టుకు లేఖ రాశారు. దుర్గం చెరువు, సున్నం చెరువు, పెద్ద చెరువు, ఫీర్జాదిగూడ, దామర చెరు వు, దుండిగల్, చినరాయుని చెరువు, గంగారం పెద్ద చెరువు, మేడికుంట చెరువు, హస్మత్‌పేట, బావురుడ చెరువు ఆక్రమణలకు గురై పూర్తిగా కుంచించుకుపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ లేఖను న్యాయస్థానం రిట్ పిటిషన్‌గా విచారణ స్వీకరించింది. గత విచారణ సందర్భంగా కమిటీని ఏర్పాటు చేసి.. 13 చెరువుల పరిస్థితిపై నివేదికను అందజేయాలని డీఎస్‌జీ, జీపీ కమిటీని ఆదేశించింది. ఈ పిటిషన్లపై ధర్మాసనం మరోసారి మంగళవారం విచారణ చేపట్టింది. కమిటీ నివేదికను పరిశీలించిన ధర్మాసనం.. ఆక్రమణలు సహా ఇతర వివాదాల పరిష్కారానికి ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేయాలని, ఎఫ్‌టీఎల్/బఫర్ నిర్ధారణ శాస్త్రీయంగా నిర్ణ యించాలని, శిథిలాలు, వ్యర్థాలు వేస్తే జరి మానా విధించే వ్యవస్థ ఉండాలని చెప్పింది.

ఎకరాకు రూ.10 వేలు

పంటనష్టపరిహారంపై రాష్ట్ర ప్రభుత్వ సూత్రప్రాయ నిర్ణయం

- 50 వేల ఎకరాల్లో నష్టం... ఇంకా నష్టం అంచనా వేస్తున్న అధికారులు
- ఎన్నికల కమిషన్ అనుమతితో పరిహారం ప్రకటించే అవకాశం



సాక్షి, హైదరాబాద్: అకాల వర్షాలు, వడగళ్ల కారణంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఎకరాకు రూ.10 వేలు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు పంటనష్టం అంచనా వేయాలని వ్యవసాయశాఖను ఆదేశించింది. వచ్చే రెండుమూడు రోజులు కూడా వర్షాలు పడే అవకాశమున్న నేపథ్యంలో అప్పటివరకు జరిగే మొత్తం నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారం ఇస్తామని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గతేడాది ఒకసారి తీవ్రమైన వర్షాలతో పంటలకు నష్టం జరిగినప్పుడు ఎకరాకు రూ.10 వేలు పరిహారం ఇచ్చిన సంగతి తెలిసిందే. అదే తరహాలో ఇప్పుడు కూడా పరిహారం ఇచ్చే అవకాశముందని అధికారులు తెలిపారు. అయితే ఎన్నికల కోడ్ ఉన్నందున ఈసీ అనుమతి తీసుకొని పరిహారం ప్రకటించొచ్చని అంటున్నారు.

50 వేల ఎకరాల్లో పంటల నష్టం

అకాల వర్షాలు, వడగళ్లు, ఈదురుగాలులకు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 50 వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. వరి, మొక్కజొన్న, జొన్న, పొగాకు, వేరుశనగ, మిర్చి, కూరగాయలు, బొప్పాయి, ఉల్లి పంటలు దెబ్బతిన్నాయి. వరి పొలాలకు నీరు లేక ఎండిపోయి దెబ్బతినటంతోపాటు ఈ వర్షాల వల్ల ఉన్న కాస్త ధాన్యం రాలిపోయింది. నిజామాబాద్, నిర్మల్, సిరిసిల్ల, సంగారెడ్డి, ఆదిలాబాద్, సిద్దిపేట జిల్లాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్టు వ్యవసాయశాఖ నిర్ధారించింది. మిగిలిన జిల్లాల్లోనూ పంటలకు ఏమైనా నష్టం జరిగిందా లేదా అన్న వివరాలు పంపించాలని జిల్లా వ్యవసాయ అధికారులను ఆదేశించింది. ఎక్కడికక్కడ పంట నష్టం అంచనాలు వేయడంపై దృష్టి సారించినట్టు అధికారులు తెలిపారు. అయితే తీవ్రమైన ఎండల వల్ల ఇటీవల పలు జిల్లాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వాటి విషయంలో మాత్రం తాము నష్టాలను అంచనా వేయడం లేదని అధికారులు తెలిపారు.

ఎకరాకు రూ. 25 వేలు ఇవ్వాలి: పశ్య పద్మ

దెబ్బతిన్న పంటలన్నింటినీ సర్వే చేసి నష్టం అంచనా వేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ ప్రభుత్వాన్ని కోరారు. నష్టం జరిగిన పంటలకు ఎకరాకు రూ.25 వేలు రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. సిరిసిల్ల జిల్లాలో విద్యుత్ స్తంభం, చెట్టు విరిగిపడి రైతు మరణించారని, చనిపోయిన రైతు కుటుంబాన్ని ఆదుకోవడానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం చేయాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి: మంత్రి తుమ్మల

రాష్ట్రంలో రెండు మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో అక్కడక్కడా కొన్ని ప్రాంతాల్లో పంట నష్టం సంభవించినట్టు తెలుస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మరో రెండు మూడు రోజులు కూడా అకాల వర్షాలు సంభవించే అవకాశముందన్నారు. రైతులంతా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి తగు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. మార్కెట్‌కు తీసుకొచ్చిన ధాన్యం, మిర్చి సహా ఇతర పంటలు దెబ్బతినకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. కల్లాల్లోగానీ, ఇతర ప్రాంతాల్లో ఆరబోసిన ధాన్యంగానీ దెబ్బతినకుండా రైతులకు తగు సూచనలు ఇవ్వాలన్నారు.



పెద్ద సంతోషం అనేది ఒకటి ఉందని మీరు కనుక్కున్నప్పుడు, దానికోసం చిన్న చిన్న సంతోషాలను త్యాగం చేయగలుగుతారు.
– థానిస్సరో భిక్షు (బౌద్ధ ధర్మం)

సాక్షి
బుధవారం, 20 మార్చి 2024

ఎన్నిక అపహాస్యమే అయినా...

అనుకున్నదే అయింది. ఫలితం ముందే నిర్ణయమై, అపహాస్యంగా మారిన రష్యా ఎన్నికల్లో అందరూ ఊహించినట్టే వ్లాదిమిర్ పుతిన్ అయిదో పర్యాయం అధ్యక్షుడయ్యారు. కంటితుడుపుగా సాగిన రిగ్గింగ్ ఎన్నికలన్న విమర్శకుల ఆరోపణలకు తగ్గట్టే ఆయన మునుపెన్నడూ, ఎవరికీ రానన్ని ఓట్లతో అఖండ విజయం సాధించారు. పుతిన్ గెలుపు ముందే నిశ్చయమైనా, సోమవారం అధికారిక వెల్లడింపుతో ఒక తంతు పూర్తయింది. అధికారంలోకి వచ్చిన తొలినాళ్ళలో భిన్నాభిప్రాయాలకూ, రాజకీయ పోటీకీ కాసింత అవకాశమైనా ఇచ్చిన 71 ఏళ్ళ ఈ మాజీ గూఢచారి ఇప్పుడు అందుకు ఏ మాత్రం సిద్ధంగా లేరని తేలిపోయింది. వెరసి, పుతిన్ హయాంలో రష్యాలో పాలన నిరంకుశత్వం నుంచి ఏకఛత్రాధిపత్యం, ఏకవ్యక్తి పాలన దిశగా వెళుతున్నట్టు ప్రపంచానికి ఖరారైంది.

సోవియట్ పతనానంతర కాలంలో ఎన్నడూ లేనట్టు రష్యా ఎన్నికల్లో పుతిన్ అత్యధికంగా 88 శాతం దాకా ఓట్లు సాధించడం స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. ప్రధానిగా అయితేనేం, అధ్యక్షుడిగా అయితేనేం పాతికేళ్ళుగా పీఠంపై ఉన్న పుతిన్ ఇప్పుడిక రష్యాపై పూర్తిగా పట్టు బిగించారన్న మాట. అధ్యక్షుడిగా కొనసాగేందుకు వీలుగా ఇప్పటికే ఆయన రాజ్యాంగాన్ని మార్చేశారు. తాజా విజయంతో మరో ఆరేళ్ళు ఆ పదవి ఆయనదే. ఇలాగే, వచ్చే 2030లో సైతం పుతిన్ విజయం సాధిస్తే, కొత్త చరిత్ర ఆవిష్కృతమవుతుంది. అదే జరిగితే, 31 ఏళ్ళ పాటు అధికారం చలాయించిన స్టాలిన్ రికార్డును పుతిన్ తిరగరాసినట్టవుతుంది. పైపెచ్చు, పుతిన్ ఈసారి విజయం సాధిస్తూనే... అమెరికా సారథ్యంలోని 'నాటో' కూటమి గనక ఉక్రెయిన్‌లో బలగాలను మోహరిస్తే సహించబోమన్నారు. అదే గనక జరిగితే 'పూర్తిస్థాయిలో మూడో ప్రపంచ యుద్ధమే' అని హెచ్చరించడం గమనార్హం.

నిజానికి, మార్చి 15 – 17 మధ్య జరిగిన తాజా ఎన్నికలు పెద్ద ప్రహసనం. అభ్యర్థులుగా అధికారిక ఆమోదం పొందిన ప్రత్యర్థులు పేరుకు రంగంలో ఉన్నారు. కానీ, బరిలో నిలిచేందుకూ, పోటీలో గెలిచేందుకూ వారు ఇసుమంతైనా ప్రయత్నించలేదు. ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్న మరో ఇద్దరు పాపులర్ వ్యక్తులు సైతం మొదట బరిలో ఉన్నారు. తీరా పుతిన్ విజయంపై ఎంతో కొంత ప్రభావం చూపగల వారి అభ్యర్థిత్వాన్ని సాంకేతిక కారణాలతో తోసిపుచ్చారు. ఇక గత 2018 ఎన్నికల వేళ పుతిన్‌కు కంటిలో నలుసైన జనాకర్షక ప్రతిపక్ష నాయకుడు అలెక్సీ నావల్నీ గత నెల ఓ ఆర్కిటిక్ జైలులో అంతుచిక్కని రీతిలో మరణించారు. మాస్కో యుద్ధం సందర్భంగా రష్యా కలిపేసుకున్న నాలుగు ఉక్రెయిన్ ప్రావిన్సుల్లోనూ ఓటింగ్ జరిగింది. అయితే, సాయుధ బలగాల కనుసన్నల్లో బలవంతపు ఓటింగ్ వల్ల ఫలితం ఏమిటన్నది అర్థమై పోయింది. ఒకపక్క ఎన్నికలు జరుగుతుండగానే రష్యా భూభాగంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులు కొనసాగాయి. కీవ్, దాని పాశ్చాత్య భాగస్వామ్య పక్షాల నుంచి మాస్కోకు ముప్పు తప్పదని తేల్చాయి.

పుతిన్ అయిదోసారి గెలిచినా, ప్రజాక్షేత్రంలో అసమ్మతి పుష్కలం. ఫక్తు ఫార్సుగా మారిన ఎన్నికల్ని నిరసిస్తూ, కొందరు ఓటర్లు బ్యాలెట్ బాక్సుల్లో రంగు పోశారు. అలాగే, నావల్నీ నివాళికి వేలాది రష్యన్లు హాజరవడం గమనార్హం. అయితే, దేశాన్ని పూర్తిస్థాయి ఏకవ్యక్తి పాలనగా మార్చేసేందుకు పుతిన్‌కు దక్కిన వరం – ఉక్రెయిన్‌తో యుద్ధం. 'ప్రత్యేక సైనిక చర్య'గా స్వల్పకాలిక దాడితో ఉక్రెయిన్‌పై పైచేయి సాధించాలని ఆయన మొదట భావించారు. తీరా అది దీర్ఘకాలిక పోరై, నష్టాలకు దారి తీసింది. అయినా, అణచివేత కొనసాగిస్తూ, పాశ్చాత్య ప్రపంచంతో సుదీర్ఘ యుద్ధంలో అంతిమ విజయం మనదేనంటూ రష్యన్లతో పుతిన్ నమ్మబలికారు. సలహాదారుల మాట పెడచెవిన పెట్టి, యుద్ధాన్ని ప్రచారంలో ప్రధానాంశం చేశారు. యుద్ధంపై నిరసన నేరమంటూ, నిరసించే పౌరులంతా 'విదేశీ ఏజెంట్లే' అంటూ చట్టమే చేశారు. ఎవరేమనుకున్నా మళ్ళీ అధ్యక్షుడయ్యారు.

దేశమంతా తన వెంటే ఉందని చాటేందుకు పుతిన్ ఈ ఎన్నికను అవకాశంగా వాడుకున్నారు. అణచివేత మాట అటుంచితే, రష్యాలో ఇప్పటికీ పాపులర్ నేతనని నిరూపించుకున్నారు. ఉక్రెయిన్‌తో పోరులోనూ మొదట కొద్దినెలలు గట్టి ఎదురుదెబ్బలు తగిలినా, అనూహ్యంగా ఇప్పటికీ పట్టు నిలుపుకొన్నారు. కఠినమైన ఆర్థిక ఆంక్షలు ఎదురైనా, దేశ ఆర్థిక వ్యవస్థను అంచనాలను మించేలా నిలబెట్టగలిగారు. పాశ్చాత్య బ్రాండ్లు దేశం విడిచివెళ్ళినా, అదే విధమైన స్థానిక ఉత్పత్తులతో సామాన్యులపై ప్రభావం పడకుండా చూసుకున్నారు. ముడి చమురు కొనుగోళ్ళకు యూరప్ అడ్డం తిరిగినా, భారత్, చైనా, టర్కీలతో ఆదాయం పుష్కలంగా కొనసాగేలా చూసుకున్నారు. రష్యాకు రాజకీయ, ఆర్థిక సుస్థిరత సమకూర్చినప్పటికీ, దేశాన్ని నిరంకుశ పాలనలోకి దింపడమే పెద్ద చిక్కు.

అయితే, ఇష్టమున్నా, కష్టమైనా కనీసం మరో ఆరేళ్ళ పాటు రష్యా సారథి పుతినే. అమెరికా, దాని మిత్రపక్షాలు సహా అందరూ ఆ వాస్తవాన్ని గుర్తించాలి. ఎలాగోలా పుతిన్‌కు నచ్చజెబితే తప్ప ఉక్రెయిన్ యుద్ధానికి ఇప్పుడప్పుడే తెర పడే పరిస్థితి లేదని గమనించాలి. పుతిన్‌తో వైరం పెరిగినకొద్దీ అది తూర్పు ఐరోపాకే కాక మొత్తం ప్రపంచానికే తలనొప్పి అని గ్రహించాలి. పాశ్చాత్యప్రపంచం సైతం తన వైఖరిలోని తప్పులను ఆత్మపరిశీలన చేసుకోవాలి. రష్యాకు మిత్రదేశాలైన భారత్, చైనా లాంటివి ఈ శత్రుత్వ ధోరణి సద్దుమణిగేలా ప్రయత్నించాలి. 2022లో ఉక్రెయిన్‌పై పుతిన్ జరపదలచిన అణ్వస్త్రదాడిని ఆపింది భారత ప్రధాని, ఇతర నేతలేనంటూ వస్తున్న తాజా కథనాలు విస్మరించలేనివి. అమెరికా, రష్యాలు రెంటితోనూ బలమైన బంధమున్న భారత్ శాంతియుత పరిష్కారానికై కృషి చేయాలి. ఎందుకంటే, ఉక్రెయిన్ యుద్ధం మరింత కాలం కొనసాగడం మానవాళికి ఏమాత్రం మేలు కాదు!

ప్రజాస్వామ్యంలో ఏఐ పాత్ర


అభిప్రాయం



జస్‌ప్రీత్ బింద్రా

ప్రపంచంలోని చాలా దేశాల్లో ఈ ఏడాది ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) తన మొదటి ప్రధాన నైతిక పరీక్షను ఎదుర్కొనే సంవత్సరంగా ఈ 2024 ఉండబోతోంది. ఈ సంవత్సర ప్రారంభంలో బంగ్లాదేశ్, స్లొవేకియాల్లో జరిగిన ఎన్నికల్లో ప్రధాన అభ్యర్థులను దెబ్బగొట్టడానికి 'డీప్ ఫేక్'ను వాడుకున్నారు. అదే సమయంలో, జైలు నుంచే ఇమ్రాన్ ఖాన్ తన ఓటర్లకు పిలుపునివ్వడంలో కూడా జెనరేటివ్ ఏఐ సాయపడింది. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసే పాత్రకు భిన్నంగా కృత్రిమ మేధను ఎలా ఉపయోగించుకోవచ్చో పాకిస్తాన్ చేసి చూపించింది. ప్రజాస్వామ్యానికి మూల స్తంభమైన ఎన్నికల ప్రక్రియను మెరుగుపరచడానికి కృత్రిమ మేధ చాలా సాయపడగలదు. తక్కువ ఖర్చుతో, అధిక సామర్థ్యంతో అభ్యర్థులు తమ ప్రచారాన్ని నిర్వహించుకోవడంలోనూ ఇది ఎంతగానో ఉపయోగపడగలదు.

గత రెండేళ్లుగా, కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్–ఏఐ)... దాని ద్వారా ఉత్పన్నమైన ఉత్సాహం, అది కలిగించిన అంతరాయాలపై సాంకేతిక కథనాలు ఆధిపత్యం చలాయించాయి. కాపీరైట్, పక్షపాతం, గోప్యత, డీప్‌ఫేక్ (వ్యక్తుల వాస్తవ చిత్రాన్ని మార్చి అప్రతిష్ఠకు పాల్పడటం) వంటి నైతిక సమస్యలు ఎదురు కావడంతో, 2023 చివరి భాగంలో ఈ కథనాలు కొద్దిగా పసలేనివిగా మారిపోయాయి. ఇప్పుడు, చాలా దేశాల్లో ఎన్నికలు ముంచుకొస్తు న్నాయి. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్యానికి సహాయపడినా లేదా దానిని నాశనం చేసినా... కృత్రిమ మేధస్సు తన మొదటి ప్రధాన నైతిక పరీక్షను ఎదుర్కొనే సంవత్సరంగా 2024 ఉండబోతోంది. భారత్, అమెరికా, బ్రిటన్, ఇండోనేషియా, ఇతర ప్రధాన ప్రజాస్వామ్య దేశాలు ఈ సంవత్సరం కీలకమైన ఎన్నికలకు వెళుతున్నాయి. జనరేటివ్ ఏఐ కంటే ముందే డీప్‌ఫేక్‌లు ఉనికిలో ఉన్నప్పటికీ – 'సోరా', 'స్టేబుల్ డిఫ్యూజన్' వంటివి వాటి ఉత్పత్తిని ప్రజాస్వామీకరించాయి. వాటిని సులభంగా, వేగంగా, చౌకగా మార్చేశాయి.



వాట్సాప్, టిక్ టోక్ మొదలైనవి అంతర్జాతీయ పంపిణీని అత్యంత సులభంగా మార్చేయడంతో సోషల్ మీడియాకు సంబంధించి శిఖరస్థాయి దశలో ఉన్నాం. బంగ్లాదేశ్, స్లొవేకియా ఈ సంవత్సరం ప్రారంభంలో ఎన్నికలకు వెళ్లాయి. ఈ సందర్భంగా చాలా డీప్‌ఫేక్‌లు వచ్చాయి. బంగ్లాదేశ్ ప్రతిపక్ష నాయకుడు పాలస్తీనియన్లకు తన మద్దతు విషయంలో సందిగ్ధంగా ఉన్నట్లు చూపటం జరిగింది. ఇది ఆ దేశంలో ఒక వినాశకరమైన వైఖరి. స్లొవేకియా ఎన్నికలలో, ఒక ప్రధాన పోటీదారు ఎన్నికల రిగ్గింగ్ గురించి, మరింత ప్రమాదకరంగా బీరు ధరను పెంచడం గురించి మాట్లాడినట్లు చూపారు. ఇది ఆయన ఓటమికి కారణమైంది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ నకిలీ వాయిస్ అమెరికా ప్రైమరీలలో ఓటు వేయవద్దని ప్రజలను కోరింది. 2016 కేంబ్రిడ్జ్ అనలిటికా(డేటా స్కాండల్) వైఫల్యానికి చెందిన జ్ఞాపకాలు ఇంకా తాజాగా ఉన్నాయి. పెద్ద ఎన్నికలు సమీపిస్తున్నందున ఇవి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

అయినప్పటికీ, నేను ఇక్కడ భిన్న వైఖరిని తీసుకుంటాను. పాకిస్తాన్ వైపు చూడండి. అక్కడ మాజీ ప్రధాని జైల్లో ఉన్న సమయంలో ఎన్నికలు జరిగాయి. ఆయన పార్టీ గుర్తులు లాక్కుని, వారి అభ్యర్థులను నిర్బంధిస్తామని బెదిరించారు. చివరికి ఇతర పార్టీలు గెలిచినట్లు ప్రకటించినప్పటికీ, భారీ రిగ్గింగ్, అవకతవకలు జరిగినప్పటికీ ఇమ్రాన్ ఖాన్ పార్టీకి కచ్చితమైన మెజారిటీ వచ్చిందని చాలా నివేదికలు పేర్కొన్నాయి. కటకటాల్లో ఉండి కూడా, దేశవ్యాప్తంగా ప్రచారం చేయడానికి జనరేటివ్ ఏఐని ఉపయోగించుకోవడం ద్వారా, ప్రజాస్వామ్యాన్ని అణచివేశానని తనపై వచ్చిన కథనాన్ని ఇమ్రాన్ ఖాన్ వమ్ముచేయగలిగారు. తన ఓటర్లను బయటకు వచ్చి తన పార్టీకి ఓటు వేయమని ఇమ్రాన్ కోరిన దృశ్యాలను రూపొందించడానికి జనరేటివ్ ఏఐని ఉపయోగించుకున్నారు. ఇది యూట్యూబ్‌తోపాటు ఇతర ఆన్‌లైన్ ఛానెళ్లలో విస్తృతంగా షేర్ అయింది. ప్రజలు ఆయన పిలుపును విని రికార్డు సంఖ్యలో బయటకు వచ్చారు. ఆయన అభ్యర్థులకు ఆశ్చర్యకరమైన విజయాలు అందించారు. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసే పాత్రకు భిన్నంగా, కృత్రిమ మేధస్సును ఎలా ఉపయోగించుకోవచ్చో పాకిస్తాన్ చేసి చూపించింది.

డీప్‌ఫేక్‌ల విధ్వంసక శక్తిని నేను తిరస్కరించడం లేదు. భారత్‌లో, ఇతర దేశాల్లోని ఎన్నికలలో చర్చను ప్రేరేపించడానికీ, కథనాలను రూపొందించడానికీ వాటిని ఉపయోగిస్తారని నేను భయపడుతున్నాను కూడా. అయినప్పటికీ, ప్రజాస్వామ్యానికి మూల స్తంభమైన ఎన్నికల ప్రక్రియను మెరుగుపరచడానికి కృత్రిమ మేధ చాలా సాయపడగలదు. పాకిస్తాన్ ఉదాహరణ దీనికి సంబంధించి ఒక సృజనాత్మక మార్గం. ఎన్నికల్లో పారదర్శకతను, సమ్మిళితత్వాన్ని, సమర్థతను పెంపొందించడానికి కూడా ఏఐని ఉపయోగించవచ్చు. దాని అధునాతన డేటా విశ్లేషణ సామర్థ్యాలు ఎన్నికల సంబంధిత డేటాను నిజ సమయంలో పర్యవేక్షించగలవు. మోసపూరిత కార్యాచరణను సూచించే ఏవైనా అవకతవకలను ఇట్టే గుర్తించగలవు. ఏఐ అల్గారిథమ్‌లు ఓటరు నమోదులు లేదా బ్యాలెట్ సమర్పణలో అక్రమాలకు సంబంధించిన నమూనాలను గుర్తించగలవు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ సిస్టమ్‌ల భద్రతను కూడా ఏఐ మెరుగుపరుస్తుంది. అదనంగా, ప్రమాదాలను కనిపెట్టే అల్గారి థమ్‌లు... సంభవించగల సైబర్ ప్రమాదాలను గుర్తించడంలో కూడా సహాయపడతాయి.

స్థానిక సమస్యలపై దృష్టి సారించే అభ్యర్థులపై, వారి మాని ఫెస్టోలపై ప్రజల స్థానిక మాండలికాలలో అత్యంత సున్నితమైన వ్యక్తిగత కంటెంట్‌ని రూపొందించడంలో జెనరేటివ్ ఏఐ సహాయ పడుతుంది. తద్వారా ఓటరు అవగాహనను నవీకరించడంలో తోడ్పడుతుంది. ముఖ్యంగా వ్యక్తిగతీకరించిన విధానం విస్తృత వర్గాల్లో రాజకీయ అవగాహనను పెంపొందించగలదు. దీన్ని అధిక సామర్థ్యంతో చాలా తక్కువ ఖర్చుతో చేయడంలో జెనరేటివ్ ఏఐ ఉపయోగపడుతుంది. తద్వారా తక్కువ డబ్బు ఉన్న అభ్యర్థులకు కూడా అధికారం లభించేలా చేస్తుంది.

కృత్రిమ మేధతో నడిచే వ్యవస్థలు వైకల్యాలున్న ఓటర్లకు ప్రాప్యతను కూడా మెరుగుపరుస్తాయి. ఉదాహరణకు, అతిశక్తిమంతమైన వాయిస్ రికగ్నిషన్ సిస్టమ్‌లు దృష్టి లోపం ఉన్న ఓటర్లకు సహాయపడతాయి. రాజకీయ సంభాషణలో సమాజంలోని అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం ఉండేలా చూసేందుకు, జన సమూహాలలో ప్రజల అభిప్రాయాన్ని అంచనా వేయడానికి కూడా కృత్రిమ మేధను అన్వయించవచ్చు. ఎన్నికల నిర్వహణ లాజిస్టిక్స్ వంటివాటిని కూడా అనుకూలపర్చవచ్చు. ఖర్చులు ఆదా చేయవచ్చు. ఇది భారతదేశం వంటి పెద్ద దేశాలకు చాలా ముఖ్యమైనది. ఓటరు నమోదును, ధ్రువీకరణను మరింత సమర్థవంతంగా చేయడంలో కృత్రిమ మేధ సహాయపడుతుంది. అర్హతను ధ్రువీకరించడానికి అవసరమైన డేటాను సరైన సమయంలో విశ్లేషించడం ద్వారా పొడవాటి క్యూలు లేకుండా చేస్తుంది.

చివరగా, కృత్రిమ మేధ అనేది ద్వంద్వ వినియోగ సాంకేతికతను కలిగివున్నది. అపారమైన విధ్వంసక శక్తితో పాటు భారీ ప్రయోజనాలను ఇది కలిగి ఉంది. ఎన్నికలపై దాని ప్రతికూల ప్రభావాన్ని డీప్‌ఫేక్‌ల రూపంలో మనం చూడటానికి ప్రయత్నిస్తున్నప్పుడు, మన ప్రజాస్వామ్యాలను అది ఎలా మెరుగుపరుస్తుందో కూడా చూడాలి. పర్ఫెక్టుగా లేకపోయినా, ఇమ్రాన్ ఖాన్ పార్టీ ఈ సామర్థ్యాన్ని ప్రపంచానికి చూపడంలో విజయం సాధించింది.

వ్యాసకర్త సాంకేతికాంశాల మేధావి
('ది మింట్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సేవ్ లద్దాఖ్



నా వాతావరణ నిరశన దీక్ష 14వ రోజు: లద్దాఖ్ నేల, పర్యావరణం, స్థానిక గిరిజన సంస్కృతుల పరిరక్షణ కోసం మైనస్ 12 డిగ్రీల సెంటీగ్రేడ్ చలిలో 250 మంది ఆకలితో పడుకున్నారు. దక్షిణాన భారీ పరిశ్రమల వల్లా, ఉత్తరాన చైనా ఆక్రమణల వల్ల దిమ్మరులు తమ ప్రధాన పచ్చికబీళ్లను కోల్పోతున్నారు. క్షేత్రస్థాయి వాస్తవాలను చూపడం కోసం పది వేల మంది లద్దాఖీ గొర్రెల కాపరులు, రైతులతో సరిహద్దు మార్చ్ నిర్వహించబోతున్నాం. (సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ దీక్ష చేస్తున్నారు.)
– సోనమ్ వాంగ్‌చుక్, యాక్టివిస్ట్

వాడుకో!



ఎన్నికల ప్రచారం కోసం ఎయిర్ ఫోర్స్ విమానాలను ప్రధాని వాడటం అవినీతికర చర్య. ఈ కారణంగానే 1975 నాటి చారిత్రక అలహాబాద్ హైకోర్టు తీర్పు వల్ల ఇందిరాగాంధీ అనర్హతకు గురయ్యారు. కానీ అదొక భిన్నమైన కాలం. ఇప్పుడు ప్రభుత్వ సొమ్ము, ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగులందరినీ మోదీ ఎన్నికల ప్రచారం కోసం వాడుకుంటున్నారు.
– ప్రశాంత్ భూషణ్, న్యాయవాది

న్యాయమా?



మీ ఆదాయం ఒక కోటి రూపాయలైతే, మీరు ఇండియాలో సుమారు 40 శాతం పన్నులు చెల్లిస్తారు. పరోక్ష పన్నులు అదనం. వచ్చే ఏడాది మాటవరుసకు మీ ఉద్యోగం పోయిందనుకుందాం. అప్పుడు మీ ఆదాయం సున్నా. మీకు అందే ప్రయోజనాలు కూడా సున్నా. ఇదే మన పన్నుల విధానంలో ఉన్న తప్పు.
– అక్షత్ శ్రీవాస్తవ, విశ్లేషకుడు

లాభం లేకపోగా...



రాహుల్ గాంధీ మాట్లాడిన ప్రతిసారీ అది మోదీకి లాభిస్తుంది. హిందూమతపు కోణంలో 'శక్తి' అంటే ఏమిటో తెలియకుండా దాని గురించి ఎందుకు మాట్లాడటం?
– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

దివ్యౌషధం



పగటిపూట చిన్న కునుకు. పడుకునే ముందు జాజికాయ, పసుపు కలిపిన పాలు; అరికాళ్లకు వెన్నతో మర్దన. మంచి నిద్రకు ప్రతిసారీ పనికొచ్చే ఔషధం ఇది.
– రుజుతా దివేకర్, పోషణ నిపుణురాలు

ఇన్ బాక్స్

బహుముఖ ప్రజ్ఞాశాలి

ప్రముఖ ఇంగ్లీషు నవలా రచయిత, జర్నలిస్టు ఖుశ్వంత్ సింగ్ అవిభక్త భారత్‌లోని లాహోర్ హైకోర్టులో 1939లో న్యాయవాదిగా తన ప్రస్థానం మొదలెట్టారు. దేశ విభజన తర్వాత కొత్త ఢిల్లీ చేరుకున్నారు. 1969లో ఖుశ్వంత్‌ను జర్నలిజం తన వైపు లాక్కుంది. 'టైమ్స్ ఆఫ్ ఇండియా' గ్రూప్ వారి 'ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ' ఎడిటర్‌గా చేరి, 65,000 వేల సర్క్యులేషన్‌తో ఉన్న పత్రికను ఆరు లక్షల వరకు తీసుకెళ్ళారు. ఇందిరా గాంధీ కుటుంబానికి అభిమాని కావటంతో 1977లో జనతా ప్రభుత్వం రావటంతో, ఆ పత్రికను వదలాల్సొచ్చింది. తర్వాత న్యూఢిల్లీ మాస పత్రిక, తర్వాత 'హిందుస్థాన్ టైమ్స్', 'నేషనల్ హెరాల్డ్' దిన పత్రికలకు సంపాదకుడిగా పనిచేశారు. భారతీయ భాషల పత్రికల్లోనే కాకుండా 'న్యూయార్క్ టైమ్స్' లాంటి పేరొందిన విదేశీ పత్రికల్లో కూడా ఈయన ఆర్టికల్స్ వెలువడేవి.



ఖుశ్వంత్ సింగ్

దేశ విభజన కాలంలో చెలరేగిన దమన కాండను చూసిన ఆయన... మతానికి అతీతంగా ముస్లిం ప్రేమిక (నూరన్) కోసం, ప్రాణాలు సైతం తెగించి ఆమె ప్రాణాలు కాపాడి సరిహద్దుకు ఆవల వైపు (పాకిస్థాన్)కు పంపించిన సిక్కు యువకుని(జగత్ సింగ్) ప్రేమాయణంను వర్ణిస్తూ రాసిన మొదటి ఫిక్షన్ నవల, 'ట్రైన్ టు పాకిస్తాన్' (1956) అప్పట్లో ఇంగ్లీష్ పాఠక లోకంలో చాలా ప్రసిద్ధి చెందింది. అది మొదలు, 44 నవలలు, వివిధ విషయాలపై వేల వ్యాసాలు రాశారు. 'హిందుస్థాన్ టైమ్స్'లో ప్రతి శనివారం వెలువడే ఆయన శీర్షికల ద్వారా మతం, రాజకీయం, సెక్స్ విషయాలపై నిర్మొహమాటంగా కామెంట్లు రాసేవారు. స్త్రీ పురుషుల లైంగిక ఆకర్షణ ఇతివృత్తంతో 84వ పడిలో రాసిన 'ది కంపెనీ ఆఫ్ విమెన్'(1999) ఆ కాలంలో అత్యధికంగా అమ్ముడుపోయింది! ఇంగ్లీషుతో పాటు పంజాబీ, ఉర్దూలో మంచి పట్టు ఉన్న ఈయన గాలిబ్ గజల్స్‌తో పాటు సిక్కు చరిత్ర విశ్లేషణలు ఇంగ్లీష్ అనువాదం చేశారు. ఆ కాలంలో పలు దేశ విదేశీ నాయకులతో ఇంటర్వ్యూలు జరిపారు. పాకిస్తాన్ ప్రెసిడెంట్ జియా ఉల్ హక్ ఆహ్వానంతో స్టేట్ గెస్ట్‌గా వెళ్లి, భారత్–పాకిస్తాన్ సంబంధాల గురించి ఇంటర్వ్యూ తీసుకున్నారు. 1984లో సిక్కుల స్వర్ణాలయంపై కేంద్రం జరిపిన సైనిక చర్యకు నిరసనగా 'పద్మభూషణ్' అవార్డును ప్రభుత్వానికి ఇచ్చేసినా, 2007లో రాష్ట్రపతి కలాం చేతుల మీదుగా 'పద్మ విభూషణ్'తో భారత ప్రభుత్వం తిరిగి ఆయనను సన్మానించింది.

ఒక చోట ఆయన ఈ సుదీర్ఘ జీవన యానంలో, భగవంతుడు తన కోరికలన్నీ తీర్చాడనీ, చివరి ఒకే ఒక కోరికగా 'రబ్' తనకు ప్రశాంత మృత్యువు ప్రసాదించాలని రాసుకున్నారు.. అలాగే జరిగింది మరి. 2014 మార్చి 20న తన కూతురు మాయా దయాళ్ ఇంట్లో (ఢిల్లీ) ఉదయం బ్రేక్ ఫాస్ట్ చేసుకుని, వాలు కుర్చీలో కూర్చుని రోజుమాదిరి, దిన పత్రికలో క్రాస్ వర్డు పూరిస్తున్న 99 ఏళ్ల ఖుశ్వంత్ సింగ్ అసువులు క్రమంగా అనంత వాయువుల్లో కలిశాయి. ఆయన కోరిక మేరకు, చితా భస్మాన్ని, తన సొంత ఊరు 'హద్దాలి' (పాకిస్తాన్)కి చేర్చారు.

– జిల్లా గోవర్ధన్; విశ్రాంత పి.ఎఫ్. కమిషనర్, ముంబై । 98190 86849
(నేడు ఖుశ్వంత్ సింగ్ వర్ధంతి)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి.
ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఇచ్చిన హామీలను అమలుచేయాలి!

తెలంగాణలో కొత్త ప్రభుత్వానికి వందరోజులు గడిచాయి. భారీ హామీలు ఇచ్చి. మార్పు తెస్తామని చెప్పిన ప్రభుత్వం మొదటగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించింది. దీంతో సరైన మార్గంలోనే వెళ్తుందనిపించింది. మహిళల అందరికీ ఉచిత ప్రయాణం కాకుండా 'ఆధార్' లంకె పెట్టింది. అది ఎందుకోసమో ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. తర్వాత 200 యూనిట్లలోపు ఉపయోగించుకునే వారికి ఉచిత విద్యుత్ అంది. దానికి తెల్ల రేషన్ కార్డ్ లింక్ పెట్టింది. గ్యాస్ పథకం ప్రకటించింది గానీ అది పూర్తిగా అమలు కాలేదు. పాత ప్రభుత్వం ప్రవేశపెట్టిన వడ్డీ లేని రుణాల పథకాన్ని మళ్లీ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. రైతు బీమా జాడ లేదు. రుణ మాఫీ ఊసు లేదు. తెల్లకార్డు ప్రామాణికం అంటూ ప్రతీదానికి ఆంక్షలు పెడితే ఆ పథకాలకు సార్థకత ఎలా ఉంటుంది?

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రతిపక్షంపై తిట్లదండకం అందుకున్నారు. ప్రతీ మీటింగులోనూ పాత ప్రభుత్వాన్నీ, మాజీ సీఎం కేసీఆర్‌నూ, ఆయన కుటుంబాన్నీ దుమ్మెత్తిపోస్తున్నారు. సీఎం హోదాలో ఉన్నప్పుడు రాష్ట్ర ప్రజలు ఆయన ఏం మాట్లాడుతున్నారా అని ఆసక్తి కనబరుస్తారు. వరాలు ఇస్తారా? నిర్ణయాలు ప్రకటిస్తారా? నాలుగు మంచి మాటలు చెబుతారా? ఇతర నేతలకు, అధికారులకు దిశానిర్దేశం చేస్తారా? ఇంకా తమకేమైనా మేలు జరుగుతుందా అని చూస్తారు. కానీ, సీఎం వైఖరి దానికి భిన్నంగా ఉంది.

ఈ వ్యవహారశైలి వల్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతుంది తప్ప అనుకూలత రాదు. కక్ష సాధింపే ఈ ప్రభుత్వ లక్ష్యం అనిపిస్తోంది. ఎమ్మెల్యేలను భయపెట్టి తమ పార్టీలో చేర్చుకునే వ్యూహం కనిపిస్తోంది. గత ప్రభుత్వ పాలనలో జరిగిన పరిణామాలను కుంభకోణాలుగా చూపి రాజకీయ లబ్ధి పొందాలని ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు అనుకుంటున్నట్లుగా ప్రజలు భావిస్తున్నారు.

విపక్షం తమ ప్రభుత్వాన్ని కూల్చివేస్తుందనే అభద్రతా భావం కాంగ్రెస్ ప్రభుత్వంలో కనిపిస్తోంది. అందుకే అది 'ఆయారామ్, గయారామ్'



సంస్కృతికి తెరలేపింది. ఇందుకోసమే బీఆర్‌ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలను, ఎంపీలను పిలుచుకొని ఫోటోలు దిగుతూ మైండ్ గేమ్ ఆడుతున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఎవరు పార్టీ మారినా ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడడం ఖాయం. అయినా దానిని కప్పిపుచ్చి కూచికుంట్ల దామోదర్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డిలను తమ పార్టీలో చేర్చుకున్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్‌కూ కాంగ్రెస్ కండువా కప్పారు. ఒకపార్టీ తరఫున గెలిచి మరోపార్టీలో చేరిన వారిని కఠినంగా శిక్షించాలని రేవంత్ రెడ్డి ఒకప్పుడు గట్టిగా వాదించారు. ఇప్పుడు మరెందుకు ఇలా చేస్తున్నారు? దీనిని సమర్థించుకోవడం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను లాక్కోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత ప్రమాదకరం. ప్రజల తీర్పుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ఫిరాయింపుదారులపై శాసన సభాపతి వేటు వేయడానికి జాప్యం చేసినా... న్యాయ స్థానం మాత్రం ఊరుకోదు. కాంగ్రెస్ పార్టీకి సుదీర్ఘ చరిత్ర ఉంది. అన్ని రకాల అనుభవాలూ ఉన్నాయి. తెలంగాణను మరోసారి తమ దుందుడుకు ప్రయోగాలకు కేంద్రంగా మార్చడం వల్ల ఆ పార్టీకే నష్టమని నేతలూ, అధిష్ఠానం గుర్తించాలి. ప్రభుత్వానికి సరైన మార్గ నిర్దేశం చేయాలి.

ఇదే సమయంలో మీడియా పాత్రనూ ఒకసారి గుర్తుచేసుకోవాలి. కొన్ని మీడియా సంస్థలు ప్రభుత్వం కొమ్ము కాస్తూ ప్రజా సమస్యలను పట్టించుకోవడంలేదు. ఇది సరికాదు. ప్రజాస్వామ్యానికి ఈ ధోరణి మంచిది కాదు. మీడియా తమ బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తే అది రాష్ట్రానికి, ప్రజలకు మేలు చేయడమే గాక పార్టీలకు కనువిప్పు కలిగిస్తుంది.

– డాక్టర్ బి.ఎస్. రావు,
బి.ఎస్. రావు ఫౌండేషన్ అధ్యక్షులు

సంతోషమే బలం

మనిషి జీవిత అంతిమ లక్ష్యం సంతోషంగా ఉండడం. ఆనందం వల్ల సానుకూల దృక్పథం పెరిగి, సమస్యలను సులభంగా పరిష్కరించుకోగలం. సంతోషంగా ఉండేవాళ్లలో ఆత్మ విశ్వాసం అధిక స్థాయిలో ఉంటుంది; కొత్త విషయాలు నేర్చుకోవాలనే ఆసక్తి పెరుగుతుందని అనేక శాస్త్రీయ అధ్యయనాలు పేర్కొంటున్నాయి. మనిషిలో సంతోషానికి సూచిక చిరునవ్వు. ఆ నవ్వు రావాలంటే సంతోషంగా ఉండాలి. నేటి ఆధునిక యుగంలో ఇది మనిషి నుండి రోజురోజుకు దూరమైపోతోంది. దీంతో మనిషి తీవ్ర ఒత్తిడికిలోనై అనేక ఆరోగ్య సమస్యలను కొని తెచ్చుకొంటున్నాడు. ఈ క్రమంలో సంతోషం ప్రాముఖ్యతను గుర్తించిన మొదటి దేశం భూటాన్. 1970 నుంచే 'సంతోష సూచీ'యే నిజమైన ఆరోగ్య సూచి అని ప్రపంచానికి చాటింది . ఇక్కడ 'జాతీయ ఆదాయం' కన్నా 'జాతీయ సంతోషానికి' అధిక ప్రాధాన్యం ఇస్తారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని 2013 నుంచి ఐక్యరాజ్య సమితి సంతోష ప్రాముఖ్యాన్ని ప్రపంచవ్యాప్తంగా తెలియజేస్తూ, ప్రజల జీవన విధానంలో మార్పు తేవడానికి ప్రతియేటా మార్చి 20వ తేదీన 'అంతర్జాతీయ సంతోష దినోత్సవాన్ని' నిర్వహిస్తోంది. ఈ ఏడాది 'ఆనందం కోసం పునర్నిర్మాణం కావడం, దానికనుగుణమైన సమాజాలను నిర్మించడం' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు.

దేశ ఆర్థికాభివృద్ధితో పాటు అనేక ఇతర అంశాలు ప్రజల సంతోషంపై ప్రభావం చూపుతాయని ఆర్థికవేత్తలు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ స్థాయిలో 'ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి సొల్యూషన్ నెట్ వర్క్' ఆధ్వర్యంలో 'స్థూల జాతీయ ఆనందం' ఆధారంగా 'ప్రపంచ సంతోష సూచి'ని కూడా ప్రతియేటా గణించడం జరుగుతుంది. దీనిలో ఆదాయం, ప్రజల ఆరోగ్య జీవనం, సామాజిక మద్దతు, స్వేచ్ఛ, నమ్మకం, ఔదార్యం, తక్కువ అవినీతి తదితర అంశాలను ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటారు. ప్రపంచ వ్యాప్తంగా 146 దేశాలలో సంతోష సూచిలో ఫిన్లాండ్ మొదటి స్థానంలో నిలిచింది. భారతదేశం 126వ స్థానంతో అతి తక్కువ సంతోషకరమైన దేశాలలో ఒకటిగా ఉంది.

ఈ నేపథ్యంలో ప్రజల ఆర్థిక, సామాజిక జీవితంలో మార్పు తీసుకొస్తూ, ఆనందాన్ని నింపాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన ఉంది. ప్రజలు సైతం ఆరోగ్యం పట్ల స్పృహతో ప్రకృతికి దగ్గరగా జీవిస్తూ ఆనందమైన జీవితాన్ని గడపాలి.

– సంపతి రమేష్ మహారాజ్, జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి (నేడు అంతర్జాతీయ సంతోష దినోత్సవం)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శు.ఏకాదశి రా.3.57 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: పుష్యమి రా.12.33 వరకు, తదుపరి ఆశ్లేష, వర్జ్యం: ఉ.7.20 నుండి 9.01 వరకు, దుర్ముహూర్తం: ఉ.11.43 నుండి 12.31 వరకు, అమృత ఘడియలు: సా.4.40 నుండి 7.22 వరకు ; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 6.09, సూర్యాస్తమయం: 6.06.

క్లుప్తంగా...

ప్రణాళిక శాఖ కొత్త ఒరవడితో పనిచేయాలి: చిన్నారెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించే క్రమంలో అర్థ గణాంక, ప్రణాళిక శాఖల అధికారులు నూతన ఒరవడితో పనిచేయాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ జి.చిన్నారెడ్డి సూచించారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రణాళిక శాఖ ఇచ్చే సమాచారమే కీలకపాత్ర పోషిస్తుందని, గణాంకాలు, సర్వే వివరాలను సమగ్రంగా ఇవ్వడం ద్వారా అభివృద్ధిలో తనదైన పాత్ర పోషించాలని ఆయన కోరారు. మంగళవారం ఖైరతాబాద్‌లోని అర్థగణాంక, ప్రణాళిక అభివృద్ధి సొసైటీ కార్యాలయాలను సందర్శించి పనితీరును అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రణాళిక శాఖ డైరెక్టర్ దయానంద్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చిన్నారెడ్డికి తమ పనితీరు గురించి వివరించారు.

కవిత అరెస్టు వెనుక రాజకీయ కుట్ర

మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎమ్మెల్సీ కవితను నిందితురాలిగా మార్చడం రాజకీయ కుట్రలో భాగమేనని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. తెలంగాణలో కేసీఆర్, ఢిల్లీలో కేజ్రీవాల్‌ను రాజకీయంగా దెబ్బతీసేందుకు బీజేపీ కుట్ర పన్నిందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, హరిప్రియ నాయక్‌తో కలిసి మంగళవారం తెలంగాణ భవన్‌లో సత్యవతి రాథోడ్ మీడియాతో మాట్లాడారు. మద్యం పాలసీ కేసులో ఆధారాలు లేకున్నా పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే బీజేపీ ఈడీని అడ్డుపెట్టుకుని అరెస్టు చేసిందని ఆరోపించారు. ఈడీ పెట్టిన అక్రమ కేసులో కవిత నిందితురాలు కాదని, బాధితురాలు మాత్రమేనన్నారు. కవితపై పెట్టిన అక్రమ కేసులో ప్రధాని మోదీ దర్శకత్వం వహిస్తున్నారని విమర్శించారు. ఈడీ పెట్టిన అక్రమ కేసుల నుంచి కవిత కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ధీమా వ్యక్తంచేశారు.

సమ్మె నోటీసు వాయిదా వేస్తున్నాం: మర్రి రాఘవయ్య



అడ్డగుట్ట(హైదరాబాద్): నూతన పెన్షన్ స్కీమ్ రద్దుకు ఎన్‌ఎఫ్‌ఐఆర్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరవధిక సమ్మెకు సంబంధించి అధికారులకు ఇవ్వాల్సిన సమ్మె నోటీసును వాయిదా వేస్తున్నట్టు ఆ సంఘ్ ప్రధానకార్యదర్శి మర్రి రాఘవయ్య తెలిపారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం రద్దు డిమాండ్‌పై కేంద్రం నుంచి ఏ స్పందన రాకపోవడంతో, మార్చి 19న మేనేజ్‌మెంట్‌లకు సమ్మె నోటీసులు ఇవ్వాలని అనుకున్నామని చెప్పారు. ఈ నెల 14న ఢిల్లీలో జరిగిన జేసీఎం నాయకుల సమావేశంలో కేంద్రప్రభుత్వం పెన్షన్ సమస్యను పరిష్కరించేందుకు సమయం కోరిందని, అందులో భాగంగా భారత ప్రభుత్వ ఆర్థిక కార్యదర్శి అధ్యక్షతన 'పెన్షన్ రివ్యూ కమిటీ'ఏర్పాటు చేసిందన్నారు. అందువల్ల ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకొని మంగళవారం రైల్వే యాజమాన్యానికి ఇవ్వాల్సిన సమ్మె నోటీసును వాయిదా వేస్తున్నట్టు వెల్లడించారు.

హెచ్‌ఆర్‌ఏ సవరణపై 2020లోనే ప్రభుత్వ ఆదేశం

ఇప్పుడు అమలు చేస్తున్నాం: సజ్జనార్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల తోపాటు ఆర్టీసీ ఉద్యోగులకు ఇంటి అద్దె భత్యం (హెచ్‌ఆర్‌ఏ) సవరించాల్సి ఉంటుందని 2020లోనే రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినందున.. ఇప్పుడు తాము ఆ భత్యాన్ని సవరించాల్సి వచ్చిందని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఒక ప్రకటనలో తెలిపారు. అప్పుడు ప్రభుత్వ ఉద్యోగుల హెచ్‌ఆర్‌ఏను మాత్రమే ప్రభుత్వం సవరించిందని, ఆర్టీసీలో వేతన సవరణ జరగనందున అప్పుడు తాము సవరించలేదని పేర్కొన్నారు. ఇప్పుడు 2017 నాటి వేతన సవరణ చేస్తున్నందున, అప్పట్లో జారీ చేసిన జీఓ 53 ప్రకారం హెచ్‌ఆర్‌ఏను సవరిస్తున్నట్లు సజ్జనార్ చెప్పారు. ఇదే విషయాన్ని వివరిస్తూ మంగళవారం సాక్షి కథనాన్ని ప్రచురించింది. ప్రభుత్వ ఆదేశంతో ఆర్టీసీలో హెచ్‌ఆర్‌ఏ సవరణ చేయాల్సిన పరిస్థితిని వివరించింది.

ఒత్తిడి తగ్గాలి.. నైపుణ్యం పెరగాలి



- క్లాసులు మొదలయ్యే ముందే విద్యార్థులకు కౌన్సెలింగ్
- ప్రతి కాలేజీలో కౌన్సెలింగ్ నిపుణుల నియామకం
- ఇంటర్ విద్యకు భిన్నంగా ఇంజనీరింగ్ ప్రాక్టికల్ నాలెడ్జ్‌పై పరిజ్ఞానం అవసరం
- ఏర్పాట్లు చేయాలని వర్సిటీలకు ఏఐసీటీఈ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ క్లాసులు మొదలయ్యే ముందే విద్యార్థులను మానసికంగా సిద్ధం చేయాలని దేశంలోని అన్ని ఇంజనీరింగ్ కాలేజీలను అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) ఆదేశించింది. ప్రభుత్వ, ప్రైవేటు వర్సిటీలు దీని కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను విశ్వవిద్యాలయాలకు విడుదల చేసింది. దేశంలోని ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, గుర్తింపు పొందిన ఇంజనీరింగ్ కాలేజీలు దీన్ని పాటించాలంది. మారిన బోధనా ప్రణాళికను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఏఐసీటీఈ రెండేళ్లుగా జరిపిన అధ్యయనంలో వెల్లడైంది. ఐఐటీల్లో విద్యార్థుల ఆత్మహత్యలను కూడా కౌన్సిల్ పరిగణనలోనికి తీసుకుంది. జాతీయ విద్యావిధానంలో వస్తున్న మార్పులపై విద్యార్థులకు తొలి దశలోనే అవగాహన కల్పించకపోవడమే మానసిక ఒత్తిడికి కారణమని భావిస్తోంది. ప్రాక్టికల్ నాలెడ్జ్‌తో కూడిన విధానం అందుబాటులోకి తెచ్చేందుకు అన్ని విశ్వవిద్యాలయాలు ముందుకొచ్చాయి. ఇంజనీరింగ్ రెండో ఏడాది నుంచే పారిశ్రామిక సంస్థల భాగస్వామ్యంతో పాఠ్య ప్రణాళికలో మార్పు చేశారు. ఇంజనీరింగ్ విద్యార్థులు ఒక్కసారిగా మూస విధానం నుంచి స్వతహాగా ఆలోచించే విద్యావిధానంలో అడుగు పెడుతున్నారు. ఇది కూడా మానసిక ఒత్తిడికి కారణమవుతోందని ఏఐసీటీఈ అధ్యయనంలో తేలింది.

బ్యాక్‌లాగ్స్‌తో పెరుగుతున్న ఒత్తిడి...

అఖిల భారత సాంకేతిక విద్యా మండలి నిబంధనల ప్రకారం ప్రతి ఇంజనీరింగ్ కాలేజీలో మానసిక నిపుణులను నియమించాలి. ఇంటర్మీడియట్ విద్య వరకూ విద్యార్థులు బట్టీ పద్ధతిలో చదువుతున్నారు. ఇంజనీరింగ్ విద్య ఇందుకు భిన్నంగా ఉంటోంది. ఏదో ఒక ప్రశ్నకు సమాధానం రాబట్టే పద్ధతి ఉండదు. కంప్యూటర్ సైన్స్‌లో గణితం భాష ఒక్కసారిగా మారిపోతోంది. రెండో ఏడాదికి వచ్చేసరికి అనేక కంప్యూటర్ లాంగ్వేజ్‌లను విద్యార్థి నేర్చుకోవడమే కాకుండా, దాని ఆధారంగా ప్రయోగాత్మకంగా ఫలితాలు సాధించాల్సి ఉంటుంది. సివిల్, మెకానికల్‌లోనూ బేసిక్ ఇంటర్ విద్య స్థానంలో ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంటుంది. విద్యార్థి వ్యక్తిగతంగా స్కిల్ పెంచుకుంటే తప్ప ఈ పరిస్థితుల్లో ముందుకెళ్లడం కష్టం. ఈ కారణంగా ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో విద్యార్థులకు బ్యాక్‌లాగ్స్ ఎక్కువగా ఉంటున్నాయి. ఇదే విద్యార్థి మానసిక ఒత్తిడికి కారణమవుతోంది. నిపుణులు విద్యార్థి మానసిక స్థితిని కౌన్సెలింగ్ ద్వారా మెరుగుపరచాలని మండలి సూచిస్తోంది.

నైపుణ్య కొరత కూడా కారణమే..

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి కొత్త కంప్యూటర్ కోర్సుల్లో విద్యార్థులు ఎక్కువ శాతం ప్రతిభ కనబర్చడం లేదని మండలి భావిస్తోంది. ప్రతి ఏటా మార్కెట్లోకి వస్తున్న విద్యార్థుల్లో కేవలం 8 శాతం మాత్రమే అవసరమైన నైపుణ్యం కలిగిఉంటున్నారని పారిశ్రామిక వర్గాలు అంటున్నాయి. ఈ అంతరాన్ని పూడ్చడానికి రెండో ఏడాది నుంచే సంబంధిత రంగాల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్ వచ్చేలా ప్రాజెక్టులు పూర్తి చేయాలనే నిబంధన విధించారు. ఇది కూడా నామమాత్రంగా జరగడం వల్ల విద్యార్థులు ఉపాధి పొందే విషయంలో, ఉద్యోగంలో రాణించే విషయంలో మానసిక ఒత్తిడికి గురవుతున్నారని నిపుణులు అంటున్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఆరు నెలలకోసారి విద్యార్థి మానసిక ధోరణిని పరిశీలించాలని ఏఐసీటీఈ సూచించింది.

నైన్ ఆల్ ఫైన్



ఒకే కాన్పులో తొమ్మిది మంది పుట్టడం.. అదీ బతికి బట్టకట్టడం ఎప్పుడైనా చూశారా? లేదా.. ఇప్పుడు చూసేయండి. చూశారుగా.. అందరూ ఎంత చలాకీగా ఉన్నారో.. ఒకే కాన్పులో పుట్టి జీవించి ఉన్న తొలి 9 మంది కవలలు (నోనుప్‌లెట్స్) వీరు!! మొత్తం ఐదుగురు అక్కచెల్లెళ్లు, నలుగురు అన్నదమ్ములు! దీనికి సంబంధించి గిన్నిస్ రికార్డు కూడా సాధించారు. ఈ నవ సోదరసోదరీమణులకు ఓ ఆరేళ్ల అక్క కూడా ఉందండోయ్! అంటే మొత్తం సంతానం టోటల్ టెన్ అన్నమాట. మాలి దేశానికి చెందిన హలీమా సిస్సే, అబ్దెల్‌కాదెర్ ఆర్బీ అనే దంపతులకు 2021 మే 4న ఈ తొమ్మిది మంది మొరాకోలో జన్మించారు. అత్యంత అరుదైన కేసు కావడంతో డెలివరీ నిమిత్తం హలీమాను మాలి ప్రభుత్వం ప్రత్యేక వైద్య సదుపాయాలున్న మొరాకోలోని ఓ ఆస్పత్రికి పంపింది. కొన్ని ఆరోగ్యపరమైన సమస్యల వల్ల తల్లికి ముందుగానే.. 30 వారాల గర్భం సమయంలోనే వైద్యులు సిజేరియన్ చేశారు. ప్రీ డెలివరీ కావడంతో ఒక్కొక్కరి బరువు కేవలం అర కిలో నుంచి కిలో మధ్యే ఉంది. దీంతో పిల్లలు 19 నెలలపాటు ఇంక్యుబేటర్లు, ప్రత్యేక వసతులున్న కేంద్రంలో గడపాల్సి వచ్చింది. మరో రెండు నెలల్లో మూడో పుట్టినరోజు జరుపుకోనున్న వీరంతా ఇప్పుడు తమ ఇంటి గడపదాటి.. గిన్నిస్ చానల్ కార్యక్రమంలో సందడి చేసేందుకు తొలిసారి ఇటలీ పర్యటనకు వచ్చారు. ఈ నేపథ్యంలో వీరి ఫొటోలను గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ నిర్వాహకులు విడుదల చేశారు.

సాక్షి, సెంట్రల్‌డెస్క్

అన్ని వేళ్లూ నల్లగొండ వైపే!

▶ మొదటి పేజీ తరువాయి

పని చేసిన అనేక మంది అధికారులు ఆయన హయాంలో నల్లగొండ జిల్లాలో పని చేసిన వాళ్లే అని పోలీసులు చెబుతున్నారు. అలా తనకు నమ్మకస్తులుగా మారిన కొందరిని ప్రభాకర్‌రావు ఎస్ఐబీ చీఫ్‌గా మారిన తర్వాత ఆ విభాగంలోకి తెచ్చుకున్నారు. వీళ్లందరూ అక్రమ ట్యాపింగ్‌లో కీలక పాత్ర పోషించారని సమాచారం. ఇలాంటి అధికారుల్లో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ప్రస్తుతం వరంగల్ పరిధిలో పని చేస్తున్నారు.

విదేశాల నుంచి సాఫ్ట్‌వేర్లు: ప్రభాకర్‌రావుతో పాటు ఓ కీలక రాజకీయ నేత ఆదేశాల మేరకు ప్రణీత్‌రావు అండ్ టీమ్ సర్వీస్ ప్రొవైడర్లతో సంబంధం లేకుండానే అక్రమంగా ట్యాపింగ్ చేసి ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు. దీనికోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్లను విదేశాల నుంచి ఖరీదు చేసి ఉంటారని భావిస్తున్నారు. ఎస్ఐబీ కార్యాలయంలో ప్రణీత్ ఏర్పాటు చేసుకున్న 17 కంప్యూటర్లలో ఈ సాఫ్ట్‌వేర్లు ఉండొచ్చని, ఆ విషయం బయటకు రాకూడదని సంబంధిత హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేసి నగర శివార్లలోని అటవీ ప్రాంతంలో పారేసినట్లు సిట్ అధికారులు అనుమానిస్తున్నారు. ప్రణీత్‌కు ఇన్‌ఫార్మర్‌గా పని చేసి, అతడితో కలిసి బెదిరింపు వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ మీడియా సంస్థ యజమాని ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ప్రణీత్ ఎస్ఐబీ కార్యాలయంలోపాటు సదరు మీడియా సంస్థ ఆఫీస్, వరంగల్, సిరిసిల్లలోనూ కొన్ని కంప్యూటర్లు, సర్వర్లు ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఓ కీలక రాజకీయ నేతఆదేశాల మేరకు మరో నేత సహకారంతో ఇవి ఏర్పాటు చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఇవి ఆయా ప్రాంతాల్లో ఎందుకు పెట్టాల్సి వచ్చింది? అక్కడ ఉంచి ఏం చేశారు? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

ఫోన్ ట్యాపింగ్‌కు నాకు సంబంధం లేదు

ప్రణీత్‌రావు ఎవరో తెలియదు : మాజీమంత్రి ఎర్రబెల్లి



హనుమకొండ: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌కు తనకు సంబంధం లేదని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం హనుమకొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తన స్వగ్రామమైన వరంగల్ జిల్లా పర్వతగిరిలో వార్‌రూం ఏర్పాటు చేసిన విషయం కూడా తనకు తెలియదన్నారు. ఫోన్‌ట్యాపింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రణీత్‌రావుకు తనకు ఎలాంటి బంధుత్వం లేదని చెప్పారు. పర్వతగిరిలో తనకు చుట్టాలు లేరని, తన సామాజికవర్గం వారు మాత్రమే ఉన్నారన్నారు. డీఎస్పీ ప్రణీత్‌రావు అమ్మమ్మ వారి గ్రామం అని తెలిసిందన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో తన పేరు కావాలని ఇరికించాలని చూస్తున్నారని, ఇది ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తాను బీజేపీలో చేరుతున్నట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ పార్టీ నుంచి ఒక్క నాయకుడు మాత్రమే వెళుతున్నాడని, కేడర్ అంతా పార్టీలోనే ఉంటుందని, దీనికి వర్ధన్నపేట నియోజకవర్గమే నిదర్శనమన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.

మీ వివరణేంటో చెప్పండి

ప్రణీత్‌రావు పిటిషన్‌పై పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఒక విధానమంటూ లేకుండా ఇష్టం వచ్చినట్లు తనను విచారిస్తున్నారంటూ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై వివరాలు తెలుసుకుని చెప్పాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావును హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ట్రయల్ కోర్టులో విచారణ తర్వాత కస్టడీకి అప్పగించే సమయంలో ఎలాంటి సూచనలు ఇవ్వలేదని, దీంతో పోలీసులు ఇష్టం వచ్చినట్లు దర్యాప్తు చేస్తున్నారని.. హైకోర్టులో ప్రణీత్‌రావు పిటిషన్ దాఖలు చేశారు. రోజుకో పోలీస్‌స్టేషన్ తిప్పుతున్నారని, రాత్రి 8 గంటల తర్వాత కూడా విచారణ చేస్తున్నారని, తనపై ఫిర్యాదు చేసిన అధికారి కూడా అందులో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ అభ్యంతరాలపై వివరాలు తెలుసుకుని చెప్పాలని పీపీని ఆదేశించారు. విధుల దుర్వినియోగం, అనధికారిక ట్యాపింగ్, కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌ల ధ్వంసం కేసులో ప్రణీత్‌ను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

ఈడీ చర్యలు రాజ్యాంగ విరుద్ధం

▶ మొదటి పేజీ తరువాయి

కోరానన్నారు. అదే సమయంలో నిందితుల్లో ఒకరైన అరుణ్ రామచంద్ర పిళ్లై తొలుత తాను చేసిన ప్రకటనలను ఉపసంహరించుకున్నట్లు పేర్కొన్నారని పిటిషన్‌లో తెలిపారు. కాగా, ఈ పిటిషన్‌పై త్వరగా విచారణ చేపట్టాలని కవిత తరఫు న్యాయవాదులు మంగళవారం సీజేఐ ధర్మాసనం ముందు లెటర్ రూపంలో విజ్ఞప్తి చేశారు. బుధవారం సీజేఐ ధర్మాసనం ముందు ఈ అంశాన్ని ప్రస్తావించే అవకాశం ఉంది.

కవిత పిటిషన్‌లో ముఖ్యాంశాలు...

'ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఎఫ్ఐఆర్ నమోదు తర్వాత తెలంగాణలో, ఇతరత్రా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి చెందిన నేతలు దాడి ముమ్మరం చేయడం ప్రారంభించారు. తెలంగాణ బీజేపీ నేతలు బండి సంజయ్, ధర్మపురి అర్వింద్ తదితరులు కవిత అరెస్టు తథ్యం అంటూ బహిరంగ ప్రకటనలు చేశారు. ఢిల్లీ మద్యం విధానంలో నా ప్రమేయం ఉందంటూ తప్పుడు ఆరోపణలు చేశారు. 21.8.22న బీజేపీ నేతలు కుంభకోణంలో నన్ను మధ్యవర్తి అంటూ ఆరోపించారు. నా తండ్రి, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌ను కించపరిచే ఏకైక ఉద్దేశంతోనే నన్ను ఈ కేసులో ఇరికించినట్లు కనిపిస్తోంది. నా ప్రతిష్టకు ఎంతో భంగం కలిగించారు. గత పిటిషన్ విచారణ సమయంలో తదుపరి విచారణ వరకూ నన్ను అరెస్టు చేయబోమని దర్యాప్తు సంస్థ తరఫు అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు పేర్కొన్నారు. ఇదే విషయాన్ని తదుపరి విచారణ సమయంలోనూ స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ను ఉల్లంఘించి ఈడీ అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారు. పీఎంఎల్ఏ సెక్షన్ 19 ప్రకారం మహిళల విషయంలో పాటించాల్సిన నిబంధనలు ఉల్లంఘించారు. ఈడీ రిమాండు రద్దు చేస్తూ కస్టడీ నుంచి విడుదల చేయాలి' అని కవిత తాజా పిటిషన్‌లో పేర్కొన్నారు.



ఢిల్లీలో కవితను కలిసివస్తున్న కేటీఆర్

రిట్ పిటిషన్ ఉపసంహరించుకున్న కవిత

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి ఈడీ జారీచేసిన సమన్లను సవాలు చేస్తూ గతంలో దాఖలు చేసిన క్రిమినల్ రిట్ పిటిషన్‌ను కవిత ఉపసంహరించుకున్నారు. మంగళవారం ఈ పిటిషన్ అభిషేక్ బెనర్జీ, నళిని చిదంబరం పిటిషన్లతో కలిపి జస్టిస్ బేలా ఎం. త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌లతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. అరెస్టు చేసినందున పిటిషన్ కాలపరిమితి ముగిసినట్లయిందని కవిత తరఫు సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి ధర్మాసనం దృష్టికి తెచ్చారు. అభ్యర్థనలన్నింటినీ వెనక్కి తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం పిటిషన్ ఉపసంహరణకు ధర్మాసనం అనుమతించింది. విక్రమ్ చౌదరి విజ్ఞప్తి మేరకు చట్టానికి అనుగుణంగా పరిష్కారాలు అనుసరించడానికి స్వేచ్ఛ కల్పిస్తున్నట్లు ధర్మాసనం ఆదేశాల్లో పేర్కొంది. అయితే, ఈ కేసులో ఈడీ తరఫు అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు అభిప్రాయం తెలుసుకోవాలని ధర్మాసనం యత్నించింది. ఎస్వీ రాజు, అభిషేక్‌బెనర్జీ తరఫు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వేరే కేసుల విచారణలో ఉండటంతో అభిషేక్, నళిని పిటిషన్లను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. దీంతో ఆ సమయంలో ఎస్వీ రాజు తన అభిప్రాయం వెల్లడించే అవకాశం ఉంది. కాగా, ఈడీ కార్యాలయంలో కవిత విచారణ మూడోరోజూ కొనసాగింది. పలు అంశాలపై ప్రశ్నించినట్లు తెలిసింది. అయితే, ఇతర నిందితులతో కలిపి కవిత విచారణ ఇంకా ప్రారంభించలేదు.

రౌజ్ అవెన్యూ కోర్టు అనుమతి

తన తల్లి, కుమారులను కలవడానికి అనుమతి ఇవ్వాలని కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను రౌజ్ అవెన్యూ కోర్టు జడ్జి ఎంకే నాగ్‌పాల్ మంగళవారం విచారించారు. కవిత విజ్ఞప్తిని న్యాయమూర్తి అనుమతించారు. సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకూ తల్లి, కుమారులు సహా 8 మందిని కలిసేందుకు జడ్జి అనుమతి ఇచ్చారు. కాగా, మంగళవారం సాయంత్రం కవితతో ఎమ్మెల్యే కేటీఆర్ భేటీ అయ్యారు. మంగళవారం సుప్రీంకోర్టులో జరిగిన పరిణామాలను వివరించారు. సుమారు గంటసేపు కవితతో పలు అంశాలు చర్చించినట్లు తెలిసింది.

జడ్జి నాగ్‌పాల్ బదిలీ

ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసు విచారిస్తున్న రౌజ్ అవెన్యూ కోర్టు జడ్జి ఎంకే నాగ్‌పాల్ బదిలీ అయ్యారు. తీస్‌హజారీ కోర్టుకు నాగ్‌పాల్‌ను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. నాగ్‌పాల్ స్థానంలో డిస్ట్రిక్ట్ జడ్జి (కమర్షియల్) కావేరి బవేజా రౌజ్ అవెన్యూ కోర్టుకు బదిలీ అయ్యారు. ఇకపై ఢిల్లీ మద్యం కేసును కావేరి బవేజా విచారించనున్నారు.

కవలలకు కన్నీటి 'పరీక్ష'

- తండ్రి పోయిన దుఃఖంలోనూ పరీక్షకు హాజరు
- జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లో విషాదాలు



పరీక్షకు హాజరైన రామ్, లక్ష్మణ్

పెగడపల్లి(ధర్మపురి)/నిజామాబాద్ రూరల్: ఒకవైపు పదో తరగతి పరీక్ష.. మరోవైపు కన్నతండ్రి మరణం.. పుట్టెడు దుఃఖంలోనూ కవల బిడ్డలు పదో తరగతి పరీక్షకు హాజరయ్యారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం బతికపల్లి గ్రామానికి చెందిన గాజె చంద్రయ్య–లక్ష్మి దంపతులకు మొదటి సంతానంలో కూతురు జన్మించింది. రెండో సంతానంగా ఇద్దరు కవలలు రామ్, లక్ష్మణ్ జన్మించారు. వీరు స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. వీరి తండ్రి చంద్రయ్య నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో పురుగు మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. కాగా, మృతుని కుమారులు మంగళవారం పదో తరగతి హిందీ పరీక్షకు హాజరు కావలసి ఉంది. చదువుకు ఆటంకం కలగొద్దని బంధువులు, కుటుంబ సభ్యులు నచ్చజెప్పి రామ్, లక్ష్మణ్‌లను పెగడపల్లి మండల కేంద్రంలోని పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చారు. పుట్టెడు దుఃఖంతోనే కవల సోదరులు పరీక్ష రాశాక తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

విషాదాన్ని దిగమింగి..



నిజామాబాద్ జిల్లా రూరల్ మండలం కేశాపూర్ గ్రామానికి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం బైక్ అదుపుతప్పి తాళ్ల కొత్తపేట్, మల్లారం వద్ద ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్ రెడ్డిని స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుమారుడు ధనుష్ తీవ్ర దుఃఖంతోనే మంగళవారం శివాజీనగర్‌లోని శ్రీనూతన వైశ్య ఉన్నత పాఠశాలలో హిందీ పరీక్షకు హాజరయ్యాడు. పరీక్ష అనంతరం తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నాడు.

ఆన్సర్ షీట్లకు బదులు అడిషనల్ షీట్లు?

పాల్వంచ: పదో తరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థులకు ప్రధాన సమాధాన పత్రాలు ఇవ్వకుండా.. అడిషనల్ షీట్లు ఇచ్చారు. దీంతో విద్యార్థులు వాటిపైనే సమాధానాలు రాశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కేటీపీఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి తెలుగు పరీక్ష నిర్వహించారు. 9వ నంబర్ గదిలో 24 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. వారికి ప్రశ్నపత్రంతో పాటు మెయిన్ ఆన్సర్ షీట్ మొదటే ఇవ్వాల్సి ఉండగా.. దానికి బదులు అడిషనల్ పేపర్లు ఇచ్చారు. దీంతో ఆ పేపర్‌లోనే విద్యార్థులు సమాధానాలు రాసి ముగించారు. కానీ మంగళవారం హిందీ పరీక్షకు హాజరైన విద్యార్థులకు ప్రశ్నపత్రంతో పాటు మెయిన్ ఆన్సర్ షీట్ ఇచ్చి, ఆ తర్వాత అడిషనల్ పేపర్లు ఇచ్చారు. దీంతో తొలిరోజు ఇలా ఇవ్వలేదని గ్రహించిన విద్యార్థులు సిబ్బంది దృష్టికి తీసుకెళ్లడంతో విషయం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ముందే శిక్షణ ఇచ్చినా.. ఇన్విజిలేటర్లు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. తాము సమాధానాలు రాసిన అడిషనల్ పేపర్లనే పరిగణనలోకి తీసుకుని మార్కులు వేయాలని కోరుతున్నారు. దీనిపై ఎంఈవో శ్రీరామ్మూర్తిని వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, తెలుసుకుంటానని పేర్కొన్నారు.

పెచ్చులూడిన పరీక్ష కేంద్రం..

టెన్త్ విద్యార్థినికి గాయం



జైనథ్: పైకప్పు పెచ్చులూడి పడటంతో పదో తరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థినికి గాయమైంది. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం గిమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామానికి చెందిన అక్షయ పిప్పర్‌వాడలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. మంగళవారం 5వ నంబర్ గదిలో హిందీ పరీక్ష రాసి ఇన్విజిలేటర్ పురుషోత్తంకు జవాబు పత్రాలు అందించేందుకు సిద్ధమైంది. ఇంతలో వీచిన గాలి దుమారానికి పైకప్పు పెచ్చులూడి అక్షయ తలపై పడగా ఆమెకు గాయమైంది. అక్కడే ఉన్న వైద్య సిబ్బంది వెంటనే విద్యార్థినిని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు ఆమె తలకు మూడు కుట్లు వేశారు. విద్యార్థిని ఆరోగ్యం నిలకడగానే ఉండటంతో ఇంటికి తరలించారు. ఇన్విజిలేటర్ పురుషోత్తంకు సైతం స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. కాగా, శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనంలో పదో తరగతి పరీక్ష కేంద్రం నిర్వహించడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

..రూ.28 వేల కోట్ల రాబడి

▶ మొదటి పేజీ తరువాయి

సమకూరాయి. కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ల రూపంలో రూ.1,300 కోట్లకు పైగా ఇవ్వగా, అప్పుల కింద రూ.2,700 కోట్లను ప్రభుత్వం సమకూర్చుకుంది. ఇక పన్నేతర ఆదాయం కింద రూ.1,048 కోట్లు వచ్చాయి. మొత్తం మీద 2023 నవంబర్ చివరి నాటికి రాష్ట్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్ పద్దు రూ. 1,49,316.41 కోట్లు ఉండగా 2024 జనవరి నాటికి రూ. 1,77,742.13 కోట్లకు చేరింది.

2 నెలల్లో రాబడుల వివరాలు (రూ.కోట్లలో)

రాబడి	వచ్చిన మొత్తం
పన్ను ఆదాయం	23,358.33
పన్నేతర ఆదాయం	1,048.10
అప్పులు	2,701.50
గ్రాంట్ ఇన్ ఎయిడ్	1,311.89
మొత్తం	28,419.82
ఇతర చిన్న పద్దులతో కలిపి మొత్తం	28,425.72

కన్న కూతురినే కడతేర్చిన తల్లి



భార్గవి

ప్రేమ వ్యవహారమే కారణం

ఇబ్రహీంపట్నం: ప్రేమ వ్యవహారం ఇష్టం లేని ఓ తల్లి తన కూతురినే కడతేర్చింది. పోలీసుల కథనం ప్రకారం..రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామానికి చెందిన మోటె ఐలయ్య – జంగమ్మ దంపతులకు ఇద్దరు కొడుకులు, కూతురు భార్గవి ఉన్నారు. భార్గవి(19) నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ఫస్టియర్ చదువుతోంది. గ్రామానికి చెందిన శశితో ప్రేమలో ఉంది. విషయం తల్లిదండ్రులకు తెలియడంతో భార్గవిని కాలేజీకి పంపడం లేదు. భార్గవికి బంధువుల అబ్బాయితో పెళ్లి చేయాలని కుటుంబసభ్యులు అనుకున్నారు. కుటుంబసభ్యులంతా సోమవారం పొలం పనులకు వెళ్లగా భార్గవి, శశి ఇంట్లో ఏకాంతంగా ఉన్నారు. సాయంత్రం భార్గవి తల్లి ఇంటికి వచ్చి ఇద్దరినీ చూసి ఆవేశానికి లోనైంది. వెంటనే శశి అక్కడి నుంచి బయటకు వెళ్లగా, తల్లి కూతురును మందలించింది. తల్లి ఆవేశంతో బెదిరించే క్రమంలో కూతురు మెడకు కొంగు గట్టిగా బిగించడంతో భార్గవి చనిపోయింది. దీంతో తల్లి జంగమ్మ స్పృహ కోల్పోయింది. పోలీసులు భార్గవి తండ్రి, సోదరుడిని విచారిస్తున్నారు. తల్లే కూతురిని హత్య చేసినట్టు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక రాగానే అన్ని వివరాలు వెల్లడిస్తామని సీఐ సత్యనారాయణ తెలిపారు. పోలీసులు శశిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. భార్గవిని జంగమ్మ చంపలేదని, వేరే వారు చంపారని ఐలయ్య ఆరోపిస్తున్నారు. కాగా, భార్గవి, శశిలది ఒకే సామాజికవర్గం.

కవితక్కా.. తీహార్ క్లబ్‌కు స్వాగతం

సాక్షి, న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో జైలులో ఉన్న సుకేశ్ చంద్రశేఖర్ మరోసారి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు లేఖ రాశారు. గతంలో తాను చేసిన ఆరోపణలకు ఇప్పుడు బలం చేకూరుతోందని స్పష్టం చేశారు. ఢిల్లీ మద్యం స్కాంలో కింగ్‌పిన్ అయిన సీఎం కేజ్రీవాల్‌ను రక్షించడానికి ప్రయత్నించడం వల్ల ఉపయోగం ఉండదని..నిజాలు వెల్లడించాలని కవితకు సూచించారు. ఈ లేఖను మంగళవారం సుకేశ్ తరఫు న్యాయవాది మీడియాకు విడుదల చేశారు. 'నిజం గెలిచింది..కర్మఫలం అనుభవించే సమయం వచ్చింది. అక్కా ఇన్నాళ్లూ ఎవరూ ఏమీ చేయలేరని భావించారు. కానీ ఇప్పుడు సత్యాన్ని ఎదుర్కొనే సమయం వచ్చింది. బీఆర్ఎస్ అధికారం కోల్పోతుంది. మద్యం కేసులో అరెస్టు, తీహార్ జైలుకు రాక తప్పదు అంటూ గతంలో నేను విడుదల చేసిన ప్రకటనలు గుర్తున్నాయా? ప్రస్తుత పరిస్థితులు చూస్తే రెండూ జరిగినట్టేగా.. కౌంట్‌డౌన్ స్టార్ట్ అయ్యింది. కవిత అరెస్టు ద్వారా కేజ్రీవాల్ సహా అవినీతి సహచరులందరూ బయటకొచ్చే సమయం ఆసన్నమైంది. అక్కా మీరు, మీ పార్టీ దోచుకొని దాచుకున్న రూ.వేల కోట్లు ఇప్పుడు బయటపడతాయి. సంబంధిత సహచరులందరికీ ఇది అర్థమైందని భావిస్తున్నా. ఈడీ ఫేస్ టు ఫేస్ విచారణకు సంబంధించి త్వరలోనే కలుస్తా. తీహార్ క్లబ్‌కు స్వాగతం. తీహార్ క్లబ్‌లో ఎక్కువ కాలం ఉండేందుకు మీ సోదరుడు కేజ్రీవాల్ తగిన విలాసాలు ఏర్పాటు చేసే ఉంటారని అనుకుంటున్నా' అని సుకేశ్ లేఖలో పేర్కొన్నారు.

రోబో తోటమాలి!

తెగుళ్లు సోకిన మొక్కల ఏరివేత ● నెదర్లాండ్స్‌లో విస్తరిస్తున్న వాడకం

తులిప్ తోటల్లో చీడ పీడలను గుర్తిస్తున్న ఏఐ రోబో



కృత్రిమ మేధ ఇందుగలదు, అందులేదనే సందేహానికి తావులేకుండా విస్తరిస్తోంది. అన్ని రంగాల్లోనూ ఏఐ వాడకం ఇంతింతై... అన్నట్టుగా క్రమంగా పెరిగిపోతోంది. వ్యవసాయంలో కూడా ఇప్పటికే కృత్రిమ మేధను పలు రకాలుగా ఉపయోగిస్తున్నారు. నెదర్లాండ్స్‌లో తులిప్స్ రైతులు ఈ విషయంలో ఇంకో అడుగు ముందుకేశారు. తెగుళ్ల బారిన పడ్డ పూల ఏరివేతకు హైటెక్ బాట పట్టారు. వాటిని ఎప్పటికప్పుడు గుర్తించి ఏరేసేందుకు ఏఐ సాయంతో రూపొందిన రోబోను ఉపయోగిస్తున్నారు. ఖరీదు చాలా ఎక్కువే అయినా ఈ రోబో మనుషులకు ఏమాత్రంతీసిపోకుండా పని పూర్తి చేస్తూ మన్ననలు అందుకుంటోంది. దాంతో నెదర్లాండ్స్ అంతటా తులిప్ తోటల్లో ఈ రోబోల వాడకం నానాటికీ పెరిగిపోతోంది.

అందాల తులిప్ పూలకు నెదర్లాండ్స్ పెట్టింది పేరు. అంతేగాక ప్రపంచంలోకెల్లా అతి పెద్ద తులిప్స్ ఉత్పత్తిదారు కూడా. సీజన్లో విరగబూసి అందాలు వెదజల్లే అక్కడి తులిప్ తోటలను చూసేందుకు ప్రపంచం నలుమూలల నుంచీ పర్యాటకులు బారులు తీరతారు. ఇలా తులిప్స్ సాగు ఉత్పత్తిపరంగానే గాక పర్యాటకంగా కూడా నెదర్లాండ్స్ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. అయితే వాటి సాగు ఖరీదైన వ్యవహారం. పూలను, మొక్కలను కంటికి రెప్పలా కాపాడుకోవాలి. చీడపీడల బారిన పడకుండా నిరంతరం పర్యవేక్షిస్తుండాలి. వైరస్‌లు, తెగుళ్ల బారిన పడ్డ పూలు, మొక్కలను ఎప్పటికప్పుడు కనిపెట్టి ఏరివేయడం చాలా కీలకం. లేదంటే మొక్కలు బలహీనపడిపోతాయి. పూలు కూడా చిన్నగా, బలహీనంగా పూస్తాయి. పైగా వైరస్ తోటంతా విస్తరించి మొత్తానికే చేటు తప్పదు. ఇప్పటిదాకా మనుషులే రాత్రింబవళ్లు తోటల్లో కలియదిరుగుతూ ఒక్కో మొక్కనూ, పువ్వునూ పట్టి చూస్తూ పాడైన వాటిని గుర్తించి ఏరేసేవారు. ఇందుకు ప్రత్యేక నైపుణ్యం అవసరం. వారిని సిక్‌నెస్ స్పాటర్స్‌గా పిలిచేవారు. కానీ ఏఐ సాయంతో తయారు చేసిన రోబో ఇప్పుడు వారికి దీటుగా ఈ పని చేసి పెడుతోంది. తులిప్ తోటలను తెగుళ్ల బారినుంచి కాపాడే హైటెక్ ఆయుధంగా మారుతోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 45కు పైగా ఏఐ రోబోలు తులిప్ తోటలను కాపు కాస్తున్నాయి. చీడపీడలు, రోగాల బారినుంచి వాటిని కాపాడే పనిలో తలమునకలుగా ఉన్నాయి.

ఇలా పని చేస్తుంది...

- ఏఐ రోబో తులిప్ తోటల్లో ఒక్కో సాలు గుండా గంటకు కిలోమీటర్ వేగంతో నింపాదిగా కదులుతుంది.
- ఒక్కో మొక్కనూ, ఒక్కో పూవునూ, దాని తాలూకు రెమ్మలను అణువణువూ పరీక్షిస్తుంది. ఫ్రంట్ కెమెరాతో వేలాది పాటోలు తీస్తుంది.
- తనలో స్టోరై ఉన్న సమాచారం సాయంతో ఆ ఫొటోలను కూలంకషంగా విశ్లేషిస్తుంది. తద్వారా సదరు మొక్క, పూవు పాడైందీ, బాగున్నదీ నిర్ణయిస్తుంది.
- పాడైనవాటిని ఎప్పటికప్పుడు ఏరేస్తూ ముందుకు సాగుతుంది.
- ఈ రోబోలను తయారు చేసింది హెచ్2ఎల్ రోబోటిక్స్ లిమిటెడ్‌కు చెందిన ఎరిక్ డీ జోంగ్ కంపెనీ.
- తెగుళ్ల బారిన పడ్డ మొక్కలు, పూలను పక్కాగా గుర్తించేందుకు కావాల్సిన సమాచారమంతటినీ రోబోకు ఫీడ్ చేసినట్టు కంపెనీ వివరించింది.
- ఈ సమాచారాన్ని తులిప్స్ సాగు చేసే రైతులు, సిక్‌నెస్ స్పాటర్ల నుంచి కంపెనీ సేకరించింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

కచ్చితత్వంతో కూడిన సాగు...

అలెన్ విసర్ అనే ఆసామి తన తులిప్ తోటలో రెండేళ్లగా ఏఐ రోబోను వాడుతున్నాడు. ఆయన కుటుంబం మూడు తరాలుగా తులిప్స్‌సాగు చేస్తోంది. ''ఈ రోబో ఖరీదు 2 లక్షల డాలర్లు! అంత డబ్బుతో ఓ ఖరీదైన స్పోర్ట్స్ కారే కొనుక్కోవచ్చు'' అన్నాడాయన. అయితే, 'స్పోర్ట్స్ కారు పాడైన తులిప్‌లను ఏరిపడేయదు కదా!' అంటూ చమత్కరించాడు. ''ఈ రోబో ఖరీదైనదే. కానీ నిపుణులైన సిక్‌నెస్ స్పాటర్లు నానాటికీ తగ్గిపోతున్న సమయంలో సరిగ్గా చేతికి అందివచ్చింది'' అని చెప్పాడు. దీన్ని 'కచ్చితత్వంతో కూడిన సాగు'గా అభివర్ణించాడు!

కొసమెరుపు

నెదర్లాండ్స్ ఉత్తర కోస్తా తీరంలో ప్రఖ్యాత డబ్ల్యూఏఎం పెన్నింగ్స్ తులిప్ తోటలోని ఏఐ రోబోకు అక్కడే జీవితాంతం సిక్‌నెస్ స్పాటర్‌గా పని చేసి రిటైరైన థియో వాన్‌డర్ వూర్ట్ పేరు పెట్టారు. దీని పనితీరు ఆయన్ను కూడా మెప్పించడం విశేషం. ''తోటల్లో తిరిగీ మా నడుములు పడిపోయేవి! మా పనిని ఈ రోబో అలవోకగా చేసేస్తోంది. పాడైన మొక్కలు, పూలను మాకు ఏ మాత్రమూ తీసిపోని విధంగా గుర్తించి ఏరేస్తోంది'' అంటూ కితాబిచ్చాడాయన!

హెచ్-1బీ రిజిస్ట్రేషన్‌కు ఆఖరు తేదీ మార్చి 22

వాషింగ్టన్: 2025వ సంవత్సరానికి గాను హెచ్-1బీ వీసాల ప్రాథమిక నమోదుకు గడువు మార్చి 22వ తేదీతో ముగియనుందని యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) తెలిపింది. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో యూఎస్‌సీఐఎస్ వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని, సంబంధిత ఫీజును చెల్లించాలని సూచించింది. ఇందుకు అవసరమైన ఐ-907, ఐ-129 వంటి ముఖ్యమైన దరఖాస్తులను కూడా ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చని వివరించింది. అదేవిధంగా, హెచ్-1బీ క్యాప్ పిటిషన్లకు ఏప్రిల్ ఒకటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొంది. నాన్ క్యాప్ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండే తేదీలను తర్వాత ప్రకటిస్తామని తెలిపింది. భారతీయ ఐటీ నిపుణులు ఎక్కువగా దరఖాస్తు చేసుకునే నాన్ ఇమిగ్రాంట్ వీసా హెచ్-1బీ. అమెరికా కంపెనీలు భారత్, చైనా వంటి దేశాల నుంచి వేలాది మంది విదేశీ ఐటీ నిపుణులను ఈ వీసాపైనే నియమించుకుంటాయి.

కాలుష్య రాజధానిగా ఢిల్లీ

- ప్రపంచంలోనే అత్యధిక కాలుష్య మెట్రోప్రాంతంగా బిహార్‌లోని బెగుసరాయ్‌కు టాప్ ర్యాంక్
- ప్రపంచ వాయు నాణ్యతా నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: 'అత్యంత కాలుష్య దేశ రాజధాని' అప్రతిష్ట కిరీటాన్ని ఢిల్లీ మరోసారి తన నెత్తిన పెట్టుకుంది. స్విట్జర్లాండ్‌కు చెందిన ఐక్యూఎయిర్ సంస్థ ప్రపంచ వాయు నాణ్యతా నివేదిక-2023లో పలు అంశాలను ప్రస్తావించింది. నివేదికలో వెల్లడైన వివరాల ప్రకారం.. ప్రపంచంలోనే అత్యంత కాలుష్యంతో నిండిన మెట్రోపాలిటన్ ప్రాంతంగా బిహార్‌లోని బెగుసరాయ్ నిలిచింది. ఘనపు మీటర్‌కు 54.4 మైక్రోగ్రామ్‌ల చొప్పున వార్షిక సూక్ష్మధూళికణాల(పీఎం 2.5) గాఢత ఉన్న దేశాల జాబితాలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. 79.9 మైక్రోగ్రామ్‌లతో బంగ్లాదేశ్ తొలిస్థానంలో, 73.7 మైక్రోగ్రామ్‌లతో పాకిస్తాన్ రెండోస్థానంలో నిలిచింది. గత ఏడాది ఘనపు మీటర్‌కు కేవలం 53.4 మైక్రోగ్రామ్‌ల వార్షిక సూక్ష్మధూళి కణాల(పీఎం 2.5)గాఢతతో భారత్ ఎనిమిదో స్థానంలో ఉండగా ఇటీవలికాలంలో దేశంలో కాలుష్యం విపరీతంగా కమ్ముకుని భారత స్థానం దారుణంగా మూడో స్థానానికి ఎగబాకడం ఆందోళనకరం. ఇక బిహార్‌లోని బెగుసరాయ్ గత ఏడాది కాలుష్యప్రాంతాల జాబితాలోనే లేదు. కానీ ఈ ఏడాది ఘనపు మీటర్‌కు 118.9 మైక్రోగ్రామ్‌ల పీఎం2.5 గాఢతతో ప్రపంచంలోనే అతి కాలుష్య మెట్రోపాలిటన్ పట్టణంగా అప్రతిష్టను మూటగట్టుకుంది. ఆ తర్వాతి స్థానాల్లో గువాహటి, ఢిల్లీ, పంజాబ్‌లోని ముల్లాన్‌పూర్ నిలిచాయి.

నాలుగుసార్లు టాప్ ర్యాంక్

ఢిల్లీ పీఎం2.5 గాఢత గత ఏడాది 89.1 మైక్రోగ్రాములు ఉంటే ఈసారి మరికాస్త పెరిగి 92.7 మైక్రోగ్రాములకు చేరుకుంది. దీంతో విపరీతమై కాలుష్యం కారణంగా 2018 ఏడాది నుంచి చూస్తే నాలుగుసార్లు మోస్ట్ పొల్యూటెడ్ క్యాపిటల్ సిటీ కిరీటాన్ని ఢిల్లీకే కట్టబెట్టారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం ఒక ఘనపు మీటర్‌కు 5 మైక్రోగ్రాములకు మించి సూక్ష్మధూళి కణాలు ఉండకూడదు. కానీ భారత్‌లోని 136 కోట్ల ప్రజలు అధిక వాయుకాలుష్యం బారిన పడ్డారని తాజా నివేదిక ఘోషిస్తోంది. దేశ జనాభాలో 96 శాతం మంది అంటే 133 కోట్ల మంది డబ్ల్యూహెచ్‌వో పరిమితికి ఏడు రెట్లు మించి కాలుష్యమయ వాతావరణంలో జీవిస్తున్నారు. భారత్‌లోని 66 శాతం నగరాలు సగటున ఘనపు మీటర్‌కు 35 మైక్రోగ్రామ్‌ల ధూళికణాలున్న వాయుకాలుష్యం బారిన పడ్డాయి.

విభిన్న మార్గాల్లో, విస్తృతస్థాయి డేటా

ప్రపంచవ్యాప్తంగా 134 దేశాల్లో ఏర్పాటుచేసిన 30,000 వాయునాణ్యతా ప్రమాణాల స్టేషన్లు, సెన్సార్లు సేకరించిన డేటాను క్రోడీకరించి ఈ నివేదికను తయారుచేసినట్లు ఐక్యూఎయిర్ తెలిపింది. అధ్యయన సంస్థలు, ప్రభుత్వ విభాగాలు, విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు, ప్రభుత్వేతర లాభాపేక్షలేని సంస్థలు, ప్రైవేటు కంపెనీలు, పౌర శాస్త్రవేత్తల నుంచి తీసుకున్న డేటాను ఈ నివేదిక కోసం వినియోగించినట్లు సంస్థ పేర్కొంది.

ఆసియా '100'లో 83 భారత్‌లోనే

ప్రపంచవ్యాప్తంగా కాలుష్యానికి కేరాఫ్ అడ్రస్‌గా భారత్ పేరుమోస్తోంది. ఆసియాలో అత్యంత కాలుష్యమయ 100 నగరాల జాబితా ప్రకటించగా అందులో 83 నగరాలు భారత్‌లో ఉండటం దారుణ పరిస్థితికి దర్పణం పడుతోంది. కొన్ని నగరాల్లో కాలుష్యం డబ్ల్యూహెచ్‌వో పరిమితిని పది రెట్లు దాటేయడం గమనార్హం. కాలుష్యానికి సంబంధించి ప్రపంచవ్యాప్తంగా 7,800 నగరాలను పరిశీలిస్తే అందులో డబ్ల్యూహెచ్‌వో పరిమితికి లోబడి కేవలం 9 శాతం నగరాలు ఉండటం చూస్తే పరిస్థితి చేయిదాటిపోయిందని అర్థమవుతోంది. ' ఫిన్లాండ్, ఎస్తోనియా, ప్యూర్టోరికో, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, బెర్ముడా, గ్రెనెడా, ఐస్‌ల్యాండ్, మారిషస్, ఫ్రెంచ్ పాలినేసియా దేశాల్లో మాత్రం వాయు నాణ్యత బాగుంది.

అసమ్మతిపై హాంకాంగ్ ఉక్కుపాదం

హాంకాంగ్: హాంకాంగ్‌లో పౌర హక్కులకు మరింతగా కత్తెర పడింది. అసమ్మతిని ఉక్కుపాదంతో అణచివేసేందుకు వీలు కల్పించే జాతీయ భద్రతా చట్టానికి హాంకాంగ్ పార్లమెంటు మంగళవారం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. హాంకాంగ్‌ను చెప్పుచేతల్లో ఉంచుకున్న చైనా స్వతంత్ర పాలన కోసం అక్కడ తలెత్తుతున్న ఆందోళనలను ఎప్పటికప్పుడు అణచివేస్తూ వస్తోంది. ప్రజాస్వామిక పాలన కోసం 2019లో జరిగిన ఆందోళనలపై అయితే ఉక్కుపాదమే మోపింది. తాజా చట్టం ఆమోదంలో చట్టసభలో మెజారిటీ వర్గమైన చైనా విధేయులు కీలకపాత్ర పోషించారు. దీనిప్రకారం ఆందోళనకారులపై దేశద్రోహం, బయటి శక్తులతో కుమ్మక్కు, సాయుధ తిరుగుబాటు, గూఢచర్యం, దేశ రహస్యాల వెల్లడి వంటి అభియోగాలు మోపవచ్చు. జీవిత ఖైదు సహా పలు కఠిన శిక్షలు విధించవచ్చు. అభ్యంతకర సాహిత్యంతో పట్టుబడ్డా కఠిన జైలు శిక్షలు ఖాయం. ఈ చట్టంతో హాంకాంగ్‌లో పౌర హక్కులు మరింతగా కుంచించుకుపోతాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. 2020లో కూడా హాంకాంగ్‌లో ఇలాంటి చట్టాన్ని చైనా అమల్లోకి తెచ్చింది.



మంగళవారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీలో సోనియా గాంధీ, పార్టీ చీఫ్ ఖర్గే

పంచ 'న్యాయ్'లతో ప్రజల ముందుకు

- సీడబ్ల్యూసీ భేటీలో కాంగ్రెస్ నేతల నిర్ణయం
- దేశం మార్పు కోరుతోంది: ఖర్గే

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో రైతులు, మహిళలు, యువత, శ్రామికుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఇచ్చిన ఐదు ప్రధాన గ్యారంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) నిర్ణయించింది. భాగీదారి న్యాయ్, కిసాన్ న్యాయ్, నారీ న్యాయ్, శ్రామిక్ న్యాయ్, యువ న్యాయ్ దేశ ప్రజలకు న్యాయం దక్కేలా చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. యువత, మహిళలు, కార్మికులు, కర్షకులు, అణగారిన వర్గాల కోసం రూపొందించిన ఈ ఐదు 'న్యాయ్' హామీలను దేశవ్యాప్తంగా ప్రతి ఇంటి చెంతకు చేర్చాలని పార్టీ పిలుపునిచ్చింది. కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లో హామీలను ఇచ్చి, అమలు చేసిన మాదిరే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ తన హామీలను అమలు చేస్తుందన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించాలని నిర్ణయించింది. పి.చిదంబరం నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన మేనిఫెస్టోకు ఆమోదం తెలిపిన సీడబ్ల్యూసీ, మరో మూడు, నాలుగు రోజుల్లో పూర్తి మేనిఫెస్టోను అధికారికంగా ప్రజల ముందుంచే బాధ్యతను పార్టీ చీఫ్ ఖర్గేకు కట్టబెట్టింది. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పార్టీ మేనిఫెస్టోపై చర్చించి, ఆమోదించేందుకు సీడబ్ల్యూసీ మంగళవారం ఢిల్లీలోని పార్టీ కార్యాలయంలో భేటీ అయింది. ఈ సమావేశానికి పార్టీ మాజీ చీఫ్‌లు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు అంబికా సోనీ, ప్రియాంక గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. 'దేశం మార్పును కోరుకుంటోంది. 2004 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్‌డీఏ కూటమి ఇచ్చిన 'భారత్ వెలిగిపోతోంది' నినాదానికి ఏ గతి పట్టిందో, ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం ఇస్తున్న గ్యారంటీలకు అదే గతి పడుతుంది' అని ఖర్గే వ్యాఖ్యానించారు.

అర్థంలేని వాదనలొద్దు

అరుణాచల్ ముమ్మాటికీ భారత్‌లో అంతర్భాగమే: కేంద్రం

న్యూఢిల్లీ: అరుణాచల్‌ప్రదేశ్ చైనాలో భాగమన్న ఆ దేశ వ్యాఖ్యలపై భారత్ ఆగ్రహం వ్యక్తంచేసింది. ''అర్థం లేని వాదనలు ఆపండి. అరుణాచల్ ముమ్మాటికీ భారత్‌లో అంతర్భాగం' అని మరోమారు స్పష్టంచేసింది. అరుణాచల్‌లో ప్రధాని మోదీ పర్యటనపై చైనా వ్యక్తంచేసిన అభ్యంతరాలను భారత్ తోసిపుచ్చడంతో చైనా మళ్లీ అదే వాదన మొదలెట్టింది. దీంతో మంగళవారం భారత విదేశాంగ శాఖ స్పందించింది. ' నిరాధార ఆరోపణలు చేసినంత మాత్రాన అవి నిజాలైపోవు. అరుణాచల్ ఎల్లప్పుడూ భారత్‌లో విడదీయలేని భాగం. దేశంలో అంతర్భాగం. భారత ప్రభుత్వం అక్కడ చేపట్టే అభివృద్ధి పనుల వల్ల అక్కడి వారు ప్రయోజనం పొందుతూనే ఉంటారు' అని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ వ్యాఖ్యానించారు. అరుణాచల్ అంశాన్ని చైనా తెరమీదకు తేవడం ఈ నెలలో ఇది రెండోసారి. అరుణాచల్‌ను తమదిగా పేర్కొంటూ చైనా ఆ రాష్ట్రానికి 'జాంగ్నాన్' అని పేరు పెట్టుకుంది. చైనాతో సరిహద్దు వెంబడి, ఫార్వర్డ్ పోస్ట్‌ల వెంట బలగాల మొహరింపునకు వీలుగా సొరంగ మార్గాన్ని ఇటీవల ప్రధాని మోదీ ప్రారంభించడంతో భారత్‌పై మరోసారి అక్కసు వెళ్లగక్కింది.

వాళ్లే అంతర్ధానమౌతారు

విపక్షాలపై మరోమారు మోదీ విమర్శలు



సేలం(తమిళనాడు)/పాలక్కడ్(కేరళ): పక్షాల 'ఇండియా' కూటమిపై ప్రధాని మోదీ విమర్శల జడి కొనసాగుతోంది. 'శక్తి'ని అంతం చేయాలని బయల్దేరిన వాళ్లే నాశనమవుతారని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. కొద్దిరోజులుగా దక్షిణభారత రాష్ట్రాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్న మోదీ మంగళవారం సైతం తమిళనాడు, కేరళలో పర్యటించి ప్రచారసభల్లో పాల్గొన్నారు. సేలంలో జరిగిన సభలో మోదీ ప్రసంగించారు. ' తమిళనాడులో కాంగ్రెస్, డీఎంకేలు ఒక నాణానికి రెండు పార్శ్వాలు. అవినీతి, వారసత్వ రాజకీయాలతో అంటకాగాయి. ఇతర మతాలపై పల్లెత్తు మాట అయినా మాట్లాడటానికి జంకే కూటమి పార్టీలు హిందూ మతాన్ని దూషించటానికి ఒక్క క్షణం కూడా ముందూ వెనకా ఆలోచించవు. ఎన్నికల ప్రచారం ముంబైలో మొదలెట్టిన మొదటిరోజే వారి వైఖరి బట్టబయలైంది. 'శక్తి'ని నాశనం చేస్తామని ముంబైలో శివాజీపార్క్ సభావేదికగా ప్రకటించారు. హిందూత్వంలో శక్తికి ఉన్న ప్రాధాన్యత, విశిష్టత తమిళనాడులో ప్రతి ఒక్కరికీ తెలుసు. కంచి కామాక్షి అమ్మవారు, 'శక్తిపీఠం ' మదుర మీనాక్షి అమ్మవారు, సమయపురం మారియమ్మన్... ఇలా అంతా శక్తి స్వరూపిణిలే. శక్తి అంటే మాతృ శక్తి, నారీ శక్తి' అంటూ సభకు వచ్చిన మహిళలనుద్దేశిస్తూ మోదీ అన్నారు. 'ఈ శక్తినే విపక్షాలు అంతం చేస్తాయట. కూటమి నేతలు పదేపదే హిందువుల విశ్వాసాలను కించపరుస్తున్నారు. శక్తిని అంతం చేయాలని చూసిన వాళ్ల నాశనమైన వృత్తాంతాలు మన ఇతిహాసాల్లో ఎన్నో ఉన్నాయి. ఇలాంటి ఘటనను ఏప్రిల్ 19న తమిళనాడు ప్రజలు పునరావృతం చేస్తారు' అని అన్నారు. తమిళనాడులో అదే తేదీన 39 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ ఉన్న సంగతి తెల్సిందే. '' జాతీయ కవి సుబ్రమణ్య భారతి చెప్పినట్లుగానే నేనూ భరతమాతను శక్తి స్వరూపిణిగానే ఆరాధిస్తా. దేశ నారీశక్తిని ఆరాధిస్తా. నేను శక్తి ఉపాసకుడిని. శక్తిని అంతం చేస్తామన్న వాళ్లను తమిళనాడు ఓటర్లు శిక్షిస్తారు. కోట్లాది తమిళులు ఇస్తున్న గ్యారెంటీ ఇది'' అని మోదీ అన్నారు.

పాలక్కడ్‌లో భారీ రోడ్‌షో

కేరళలో క్షేత్రస్థాయిలో పార్టీని మరింతగా బలోపేతం చేయడమే లక్ష్యంగా మోదీ మంగళవారం కేరళలో పర్యటించారు. లోక్‌సభ ఎన్నికల బరిలో నిల్చిన పార్టీ అభ్యర్థులకు మద్దతుగా పాలక్కడ్‌లో రోడ్‌షోలో మోదీ పాల్గొన్నారు.

పవార్ పేరుతో పోటీ చేయొచ్చు: సుప్రీం

న్యూఢిల్లీ: దేశంలో త్వరలో జరగనున్న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో శరద్ పవార్ వర్గం 'నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ-శరద్‌చంద్ర పవార్'పేరుతో పోటీ చేసేందుకు సుప్రీం కోర్టు అనుమతించింది. ఎన్నికల గుర్తుగా 'బాకా ఊదుతున్న వ్యక్తి'ని వాడుకోవచ్చని తెలిపింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు శరద్ పవార్ వర్గాన్ని 'నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ- శరద్‌చంద్ర పవార్'గా గుర్తించాలంటూ ఫిబ్రవరి 19వ తేదీన సుప్రీంకోర్టు ఎన్నికల కమిషన్(ఈసీ)ని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈసీ కేటాయించిన 'గడియారం'గుర్తును ఎన్‌సీపీ అజిత్ పవార్ వర్గం వాడకుండా అడ్డుకోవాలంటూ శరద్ పవార్ వర్గం వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఆదేశాలిచ్చింది.

రూ.3,852 కోట్ల బాండ్ కష్టం!

కోర్టుకు తెలిపిన ట్రంప్ లాయర్లు

న్యూయార్క్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు కోర్టు కష్టాలు మరింత ఎక్కువయ్యాయి. స్థిరాస్తుల విలువను ఎక్కువ చేసి చూపి బ్యాంక్ రుణాలు, ఇన్సూరెన్స్‌లను పొందారన్న సివిల్ మోసం కేసులో న్యూయార్క్ సివిల్ కోర్టు విధించిన 46.4 కోట్ల డాలర్ల బాండ్ సమర్పణ గడువు దగ్గర పడుతుండటంతో ట్రంప్‌కు ఆందోళన మొదలైంది. దాదాపు రూ.3,852 కోట్ల(46.4 కోట్ల డాలర్ల) విలువైన బాండ్‌ను ట్రంప్ తరఫున కోర్టుకు సమర్పించేందుకు ఏ ఒక్క బీమా సంస్థ ముందుకురాకపోవడమే ఇందుకు అసలు కారణం. మార్చి 25వ తేదీకల్లా ట్రంప్ ఈ బాండ్ సమర్పించకపోతే ఆయన స్థిరాస్తులను కోర్టు జప్తుచేయడం మొదలుపెడుతుంది. 2.6 బిలియన్ డాలర్ల ఆస్తిపాస్తులతో కుబేరుడై ఉండి ట్రంప్ ఇప్పటికిప్పుడు 46.4 కోట్లడాలర్ల బాండ్ సమర్పించలేని పరిస్థితి దాపురించిందని ఆయన తరఫు లాయర్ కోర్టుకు విన్నవించారు. ట్రంప్ వద్ద 40 కోట్ల డాలర్ల విలువైన చరాస్తులన్నా వాటిని ఇప్పటికిప్పుడు నగదు రూపంలోకి మార్చడం కుదరడం లేదన్నారు. ''విజయవంతమైన వ్యాపారవేత్త అయినా నాలాంటి వాడికి సైతం ఇంతటి బాండ్ ఇవ్వాలంటే కష్టమే. అసలు అంత మొత్తానికి బాండ్ అనేది ఇన్సూరెన్స్ కంపెనీలు కూడా ఎప్పుడూ వినలేదట' అని ట్రంప్ ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు.

సీఏఏ అభ్యంతరాలపై సమాధానమివ్వండి

కేంద్రానికి సుప్రీం 3 వారాల గడువు

న్యూఢిల్లీ: పౌరసత్వ(సవరణ)చట్టం-2019 చట్టం అమలుపై స్టే ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్లపై మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. చట్టం అమలుపై స్టే ఇచ్చేందుకు నిరాకరించిన ధర్మాసనం..పిటిషనర్ల వాదనలపై మూడు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.

'పతంజలి' సంస్థపై సుప్రీం ఆగ్రహం

బాబా రాందేవ్ హాజరుకు ఆదేశం

న్యూఢిల్లీ: యోగా గురువు, పతంజలి ఆయుర్వేద సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన రాందేవ్, ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య బాలకృష్ణ వ్యక్తిగతంగా హాజరు కావాల్సిందిగా సుప్రీంకోర్టు ఆదేశించింది. సంస్థ ఉత్పత్తుల ప్రకటనలు, వాటి ఔషధ ప్రభావానికి సంబంధించి కోర్టు ధిక్కారం కింద జారీ చేసిన నోటీసులకు వారు స్పందించకపోవడాన్ని అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. ధిక్కరణ నోటీసులకు ఎందుకు స్పందించలేదో బుధవారం కల్లా తెలపాలని పేర్కొంది. తదుపరి విచారణ సమయంలో వారిద్దరూ స్వయంగా హాజరు కావాలని జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లాల ధర్మాసనం మంగళవారం స్పష్టం చేసింది. కోవిడ్ వ్యాక్సినేషన్‌తో పాటు ఆధునిక వైద్య విధానాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ పతంజలి సంస్థపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. దీనిపై గతేడాది నవంబర్‌లో విచారణ జరిపిన న్యాయస్థానం ఆ సంస్థను మందలించింది. సంస్థ ఉత్పత్తులు వివిధ రకాల వ్యాధులను నయం చేస్తాయంటూ అసత్య, తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇవ్వరాదని గత ఏడాది నవంబర్‌లో విచారణ సందర్భంగా ఆదేశించింది. ఈ మేరకు ఆ సంస్థ న్యాయస్థానానికి హామీ ఇచ్చింది.

ఎలక్షన్ బీట్

కేంద్ర మంత్రి పశుపతి పారస్ రాజీనామా



న్యూఢిల్లీ: రాష్ట్రీయ లోక్‌శక్తి పార్టీ(ఎల్‌జేపీ) నేత పశుపతి కుమార్ పారస్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారు. లోక్‌సభ ఎన్నికలకు సీట్ల పంపిణీలో తమ పార్టీని విస్మరించి బీజేపీ తనకు అన్యాయం చేసిందని ఆరోపించారు. దివంగత రామ్ విలాస్ పాశ్వాన్ కుమారుడు చిరాగ్ పాశ్వాన్‌కి చెందిన ఎల్‌జేపీ (రామ్ విలాస్)కి బిహార్‌లో ఐదు సీట్లు కేటాయిస్తూ బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ సోమవారం నిర్ణయం తీసుకోవడంపై పారస్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ఢిల్లీలో మీడియాకు తన రాజీనామా విషయం ప్రకటించారు. కారణాలను మాత్రం వివరించలేదు. ప్రధాని మోదీ మంత్రివర్గంలో మిత్రపక్షానికి చెందిన మంత్రి పారస్ ఒక్కరే కావడం గమనార్హం. ప్రస్తుతం పరాస్ హాజీపూర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి పోటీ చేయనున్నట్లు చిరాగ్ ప్రకటించారు.

తమిళనాట పీఎంకేతో బీజేపీ పొత్తు

విల్లుపురం: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడులో కలిసి పోటీ చేసేందుకు బీజేపీ, పట్టాలి మక్కల్ కట్చి(పీఎంకే)నిర్ణయించుకున్నాయి. పీఎంకేకు తమిళనాడులోని 10 స్థానాలను కేటాయించేందుకు అంగీకారం కుదిరింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్ విల్లుపురంలో ఈ మేరకు ఒప్పందంపై సంతకాలు చేశారు. ఉత్తర ప్రాంత జిల్లాల్లోని వన్నియార్ కులస్తుల్లో పీఎంకేకి మంచి పలుకుబడి ఉంది. గత పదేళ్లుగా ఎన్‌డీఏ భాగస్వామిగా కొనసాగుతోంది. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి పోటీ చేశాయి.

మళ్లీ ఎన్డీఏ గూటికి అకాలీ?

న్యూఢిల్లీ/చండీగఢ్: పంజాబ్‌లో శిరోమణి అకాలీదళ్ మళ్లీ ఎన్డీఏ గూటికి చేరే అవకాశం కన్పిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేసేలా చర్చలు జరుగుతున్నట్టు ఇరు పార్టీల నేతలూ మంగళవారం ధ్రువీకరించారు. మార్చి 22న అకాలీదళ్ కోర్ కమిటీ భేటీ తర్వాత దీనిపై స్పష్టత రావచ్చని బీజేపీ అధికార ప్రతినిధి ఎస్ఎస్ చన్నీ తెలిపారు. రైతు చట్టాలు తదితరాలపై భేదాభిప్రాయాల నేపథ్యంలో అకాలీదళ్ 2020లో బీజేపీతో తెగదెంపులు చేసుకుని ఎన్డీఏ కూటమిని వీడటం తెలిసిందే.

అమిత్ షాతో రాజ్ ఠాక్రే భేటీ

న్యూఢిల్లీ: మహారాష్ట్ర నవ నిర్మాణ సేన చీఫ్ రాజ్ ఠాక్రే మంగళవారం ఢిల్లీలో హోం మంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. ఈ భేటీపై ఎంఎన్ఎస్ సీనియర్ నేత బాలా నంద్‌గావ్‌కర్ ముంబైలో మాట్లాడుతూ..లోక్‌సభ ఎన్నికలపై ఇద్దరు నేతల మధ్య సానుకూలంగా చర్చలు జరిగాయన్నారు. ఒకట్రెండు రోజుల్లో వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

జేఎంఎంకు గట్టి ఎదురుదెబ్బ



రాంచీ: లోక్‌సభ ఎన్నికల వేళ జార్ఖండ్ ముక్తిమోర్చా (జేఎంఎం)కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికైన, మాజీ సీఎం హేమంత్ సోరెన్ వదిన సీతా సోరెన్ పార్టీని వీడి, బీజేపీలో చేరారు. మంగళవారం ఢిల్లీలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే, ఆ పార్టీ జార్ఖండ్ ఎన్నికల ఇన్‌చార్జి లక్ష్మీకాంత్ బాజ్‌పాయ్‌ల సమక్షంలో ఆమె కాషాయ కండువా కప్పుకున్నారు. జార్ఖండ్ ఎమ్మెల్యే పదవికి సైతం ఆమె రాజీనామా చేసినట్లు ఆమె కార్యాలయం తెలిపింది. జేఎంఎంలో తనను ఒంటరిగా మార్చారని, నిర్లక్ష్యం చేస్తున్నారని ఆమె ఆరోపించారు.

సాక్షి
కరీంనగర్
బుధవారం | 20 | మార్చి | 2024



క్వింటాల్ పత్తి రూ.7,700

జమ్మికుంట: స్థానిక మార్కెట్‌లో మంగళవారం క్వింటాల్ పత్తి రూ. 7,700 పలికింది. మార్కెట్‌లో క్రయవిక్రయాలను కార్యదర్శి గుగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ 6:26	గురు 4:51

గరిష్ఠం/కనిష్ఠం
32.0/21.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల అప్పుడప్పుడు ఉరుములతో కూడిన చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో ఉద్యమించాలి



కరీంనగర్: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం జీవితం నేటితరానికి ఆదర్శమని, వారి జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి డిమాండ్ చేశారు. మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి సందర్భంగా బాలవికాస కేంద్రంలో పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ముకుందలాల్ మిశ్రా భవన్‌లో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. మల్లు స్వరాజ్యం తన పదకొండవ ఏటనుంచి ప్రజా ఉద్యమాలలో పాల్గొని తుంగతుర్తికి రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేశారని గుర్తుచేశారు. ఐద్వా ఉపాధ్యక్షురాలు ద్యావ అన్నపూర్ణ, లక్ష్మి, యమున, శారద, రమ, స్వప్న పాల్గొన్నారు.

అంబులెన్స్‌ల తనిఖీ



కరీంనగర్ అర్బన్/హుజూరాబాద్/మానకొండూర్: కరీంనగర్, హుజూరాబాద్, మానకొండూర్‌లోని 1962 పశు సంచార వైద్యశాల వాహనాలను రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ భాగేష్ మిశ్రా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనంలో గల పరికరాల పనితీరు, మందులు, రికార్డులను పరిశీలించారు. 24గంటలు అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. మూగజీవాల వైద్య సేవల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కోరారు. పశువులకు అంబులెన్స్ అందుబాటులో ఉండాలన్నారు. సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ సలీం, కోఆర్డినేటర్ రాజ్‌కుమార్, సిబ్బంది శ్రీనివాస్, వినిషా, రోషిని, రమేశ్,, అనూష పాల్గొన్నారు.

రెండోరోజు ప్రశాంతంగా 'పది' పరీక్షలు

కరీంనగర్: పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మంగళవారం ద్వితీయ భాష పరీక్ష ప్రశాంతంగా జరిగిందని డీఈవో సీహెచ్ జనార్దన్ రావు తెలిపారు. జిల్లాలో రెగ్యులర్ విద్యార్థులు మొత్తం 12,434 మందికి గానూ 12,420మంది హాజరుకాగా 14మంది గైర్హాజరు అయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు 28మందికి గానూ 11మంది హాజరు కాగా 17మంది గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన తనిఖీ బృందాలు 23 పరీక్ష కేంద్రాలను, ప్రభుత్వ పరీక్షల విభాగం సహాయ కమిషనర్ నాలుగు కేంద్రాలను, డీఈవో ఐదు కేంద్రాలను, కలెక్టర్ ఒక పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. రామడుగు మండలం జెడ్పీహెచ్ఎస్ గోపాల్‌రావుపేట పరీక్ష కేంద్రంలో అనుమతి లేని వాహనాలు పరిసర ప్రాంతంలో ఉండడంతో చీఫ్ సూపరింటెండెంట్ రాజమౌళి జెడ్పీహెచ్ఎస్ వెదిర జీహెచ్ఎంను విధుల నుంచి తొలగించారు. ఒక పరీక్ష కేంద్రంలో సీఎస్ ఇద్దరు ఇన్విజిలేటర్లు ఐడీ కార్డులు ధరించనందున, మరోకేంద్రంలో సీఎస్ నివేదిక ప్రకారం ముగ్గురు ఇన్విజిలేటర్స్ విధులకు హాజరు కానందున షోకాజ్ నోటీసులు జారీచేసినట్లు డీఈవో వెల్లడించారు.

ప్రతిభా పురస్కారాలకు ఎంపిక



లక్ష్మణరావు

కరీంనగర్ కల్చరల్: జిల్లా కేంద్రానికి చెందిన సాహితీవేత్త డాక్టర్ గండ్ర లక్ష్మణరావు(అవధానం), అన్నవరం శ్రీనివాస్ (చిత్రకళ)తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభా పురస్కారాలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని విశ్వవిద్యాలయ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య తంగెడ కిషన్‌రావు ఫోన్ ద్వారా సమాచారం అందించినట్లు తెలిపారు. వీరిరువురూ ఈ నెల 28న హైదరాబాద్ పురస్కారాన్ని అందుకోనున్నారు.

సిరిసిల్లలోనూ సర్వర్ రూం



- ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్తకోణం
- నలుగురు సిబ్బందితో ప్రణీత్‌రావు ప్రత్యేక నిఘా



ప్రణీత్‌రావు

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కొత్త విషయం బయటపడింది. ఈ కేసులో తీగ లాగిన కొద్దీ దర్యాప్తు అధికారులకు కొత్త విషయాలు తెలుస్తున్నాయి. సస్పెండెడ్ డీఎస్పీ ప్రణీత్‌రావు ఫోన్ ట్యాపింగ్ కోసం సిరిసిల్లలోనూ ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు సమాచారం. తాజాగా ఈ కేసులో ప్రణీత్‌రావుకు సహకరించిన వారందరినీ ఒక్కొక్కరిగా అరెస్టు చేస్తున్నారు. ట్యాపింగ్ ఉదంతం వెలుగుచూసిన కొత్తలోనే హైదరాబాద్‌లోని ఎస్ఐబీ కార్యాలయం కేంద్రంగా ఈ వ్యవహారం జరిగిందని అనుకున్నా.. తర్వాత వివిధ జిల్లాల్లోనూ జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలోనే ప్రణీత్‌రావు సిరిసిల్లలోనూ ట్యాపింగ్ కోసం ప్రత్యేకంగా సర్వర్‌రూం, ఎస్సై నేతృత్వంలో ముగ్గురు కానిస్టేబుళ్లను నియమించినట్లు తెలిసింది. వాస్తవానికి 2021లోనే కరీంనగర్ వేదికగానే పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్ ప్రణీత్‌రావు ఉదంతాన్ని బయటపెట్టి సంచలనం రేపారు. తనను, తన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారని ఆరోపించారు. తాజాగా అదే ఆరోపణలపై పంజగుట్టలో కేసు నమోదు కావడం, డీఎస్పీ ప్రణీత్‌రావు అరెస్ట్‌కావడం, ఇందుకు సంబంధించి ఆయనకు సహకరించిన సిబ్బందిని కూడా పోలీసులు ప్రశ్నిస్తుండటం గమనార్హం.

సిరిసిల్ల కేంద్రంగా..

సిరిసిల్లలో ప్రణీత్‌రావు ఆదేశాల మేరకు పనిచేసిన సిబ్బందిని సైతం కేసు దర్యాప్తు చేస్తున్న పంజగుట్ట పోలీసులు విచారించే అవకాశాలున్నాయి. వరంగల్‌లో ఒకటి, సిరిసిల్లలో మరో సర్వర్ ఏర్పాటు చేసినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. సీఎం సన్నిహితుడు, కరీంనగర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ లీడర్ సత్తు మల్లేశ్ ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు అనుమానిస్తున్నారు. ప్రణీత్‌రావు డిలీట్ చేసిన చాటింగ్ రీట్రీవ్‌తో సత్తు మల్లేశ్ కాంటాక్ట్ వెలుగుచూడటం గమనార్హం. సత్తు మల్లేశ్ ఫోన్ ద్వారా ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, అడ్లూరి లక్ష్మణ్, చింతకుంట విజయరమణారావుల సంభాషణలు విన్నారని అనుమానిస్తున్నారు. సిరిసిల్లలోని సర్వర్ రూం ఆధారంగానే ఉమ్మడి జిల్లాలోని ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేశారని భావిస్తున్నారు. అయితే, వీరు కేవలం రాజకీయ నాయకుల ఫోన్లే ట్యాప్ చేశారా? జాబితాలో ఇతరులు కూడా ఉన్నారా? అన్న విషయం తెలుసుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. గతేడాది డిసెంబర్ 4వ తేదీన ప్రభుత్వం మారడంతో ప్రణీత్‌రావు బేగంపేట ఎస్ఐబీ కార్యాలయంలోని సర్వర్ రూంలోని అన్ని ఆధారాలు ధ్వంసంచేశాడు. అందులో భాగంగా సిరిసిల్ల సర్వర్‌లోని ఆధారాలను కూడా దొరకకుండా చేసి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీటిని నాశనం చేసే ముందే ప్రణీత్‌రావు ఆ వివరాలను పెన్‌డ్రైవ్‌ల ద్వారా కాపీ చేసుకున్నాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

తల్లి ఆరోగ్యమే.. కుటుంబ ఆనందం



జమ్మికుంటలో గర్భిణులతో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తదితరులు

- కలెక్టర్ పమేలా సత్పతి

జమ్మికుంట/హుజూరాబాద్/వీణవంక/కరీంనగర్ కార్పొరేషన్: తల్లి ఆరోగ్యంతోనే ఆ కుటుంబం ఆనందంగా.. ఆరోగ్యంగా ఉంటుందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం జమ్మికుంటలోని కేవీకేలో ఐసీడీఎస్ హుజూరాబాద్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ.. మహిళలు రక్తహీనత బారిన పడకుండా మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం కేవీకేలోని వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఏర్పాటు చేసిన ప్రదర్శన క్షేత్రాలను పరిశీలించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో రమేశ్‌బాబు, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతీ, సీడీపీవో తిరుమల, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు తదితరులు పాల్గొన్నారు.

మంచి మార్కులు సాధించాలి

పదోతరగతి విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాస్తూ మంచి మార్కులు సాధించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. హుజూరాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎండాకాలం నేపథ్యంలో పరీక్ష రాసిన తర్వాత విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని సూచించారు. కేంద్రంలో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

సుఖ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

ప్రభుత్వ దవాఖానాల్లో అత్యుత్తమ సౌకర్యాలు ఉన్నాయని, ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ దవాఖానాల్లో నార్మల్ డెలివరీలు చేయించుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మండలంలోని చల్లూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆరోగ్యమహిళ కార్యక్రమాన్ని పరిశీలించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి, రోగులకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.

నిబంధనల ప్రకారం పనిచేయాలి

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అధికారులు నిబంధనల ప్రకారం పని చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధశాఖల ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో ఇప్పటికే ప్రారంభించిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. అత్యవసరమైన విద్యుత్, తాగునీటి సరఫరాకు ఆటంకం కలుగకుండా చూడాలని అన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నిబంధనలు పాటించకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, సీపీఓ కొమురయ్య, నీటిపారుదలశాఖ ఎస్ఈ శివకుమార్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నియమావళి

- సీపీ అభిషేక్ మహంతి



మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మహంతి, అదనపు డీసీపీ లక్ష్మీ నారాయణ

కరీంనగర్‌క్రైం: ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేయాలని సీపీ అభిషేక్ మహంతి సూచించారు. కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగళవారం లోక్‌సభ ఎన్నికల నిర్వహణతో పాటు నేరసమీక్షపై సమావేశం అయ్యారు. సీపీ అభిషేక్ మహంతి మాట్లాడుతూ.. సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ఐదు అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, అక్కడి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే సంఘవిద్రోహ శక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పలు రాజకీయ పార్టీలు నిర్వహించే ప్రచార సమావేశాలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని తెలిపారు.పోలీస్‌స్టేషన్లవారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, అందుకు గల కారణాలు తెలుసుకున్నారు. త్వరితగతిన కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీలు నరేందర్, వెంకటరమణ, శ్రీనివాస్, మాధవి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా కమిషనరేట్‌వ్యాప్తంగా పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. కరీంనగర్ వన్‌టౌన్, టూ టౌన్, త్రీటౌన్ పరిధిలోని బస్‌స్టాండ్, కమాన్‌చౌరస్తా, మంచిర్యాలచౌరస్తా, గీతాభవన్ చౌరస్తాతో పాటుగా పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు, డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు.

అంజన్న టెండర్ల సొమ్ము ఏమైనట్లు?

- ఆలయంలో ఏడీసీ తనిఖీలు
- పలు రికార్డులు స్వాధీనం



కొండగట్టు ఆలయంలో ఏడీసీ జ్యోతి

కొండగట్టు(చొప్పదండి):కొండగట్టు ఆలయాల టెండర్ల సొమ్మును ఓ అధికారి వాడుకున్న నేపథ్యంలో ఈవో ఇటీవల సదరు అధికారిని సస్పెండ్ చేసి కేసు పెట్టారు. ఈ నేపథ్యంలో ఆలయానికి సంబంధించి అన్ని సెక్షన్‌ల రికార్డులను మంగళవారం రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. 2018 నుంచి 2024 వరకు రికార్డులను పరిశీలించగా, 2022–23 సంవత్సరానికి గాను రూ.14లక్షలు, 2023–24 గాను రూ.38 లక్షలు మొత్తం రూ.52 లక్షలు అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. 2018 సంవత్సరానికి సంబంధించి గతంలోనే లక్షల రూపాయల అవకతవకలు జరిగినట్లు ఆడిట్ అధికారులు గుర్తించగా, మరోసారి సదరు రికార్డులను తనిఖీ చేసి రెండు రోజుల్లో కమిషనర్‌కు నివేదిక అందజేస్తామని ఏడీసీ పేర్కొన్నారు. సంబంధిత రికార్డులను హైదరాబాద్ కమిషనర్ కార్యాలయానికి తీసుకెళ్లారు. కాగా కొండగట్టు ఆలయానికి సంబంధించి అవకతవకల్లో ఒక్క అధికారికి మాత్రమే ప్రమేయం ఉందా.. ఇంకా ఎవరైనా ఉన్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వేసవి భత్యం ఉన్నట్టా.. లేనట్టా?

- మూడేళ్లుగా కూలీల నిరీక్షణ
- సౌకర్యాలు కల్పిస్తారా? గతమే పునరావృతమా?



పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

జిల్లాలో మొత్తం గ్రామాలు:	313
మొత్తం జాబ్ కార్డులు:	1,35,642
కూలీల సంఖ్య:	2,96,756
జారీ చేసిన పనిదినాలు:	11,460
సరాసరి రోజు కూలి(రూ.లలో):	190

కరీంనగర్ అర్బన్: సొంత ఊరిలోనే పనులు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తోంది. పంట పొలాలు చదును చేయడం, చెరువులు, కుంటలు, బావుల్లో పూడిక తొలగించడం, వ్యవసాయ క్షేత్రాలకు దారులు వేయడం, హరితహారంలో మొక్కలు నాటడం, కంచె ఏర్పాటు చేయడం వంటి పనులు కల్పిస్తున్నారు. వ్యవసాయ పనులు పూర్తయిన తర్వాత అంటే వేసవికాలంలో ఉపాధి పనులు జోరుగా సాగుతుంటాయి. అయితే ఏటా అమలు చేసే వేసవి భత్యం విషయంపై ఇప్పటివరకు ఎలాంటి మార్గదర్శకాలు రాకపోవడంతో సందిగ్ధం నెలకొంది. మూడేళ్లుగా ఆ ఊసే లేకపోవడంతో కూలీలు డోలాయమానంలో పడ్డారు.

భత్యం ఉన్నట్టా.. లేనట్టా

వ్యవసాయ పనులు పూర్తయిన తరువాత ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఉపాధి పనులు జోరుగా సాగుతుంటాయి. ఎండల తీవ్రత నేపథ్యంలో పూర్తిస్థాయిలో పనులు చేయలేని పరిస్థితిలో వేసవిభత్యం అమలు చేసేవారు. ఫిబ్రవరిలో 20శాతం, మార్చి, ఏప్రిల్‌లో 25శాతం, మేలో 30శాతం, జూన్‌లో 25శాతం అందించేవారు. అయితే ఈ ఏడాది మార్చి మూడోవారం పూర్తవుతున్నా ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. పథకం ప్రారంభమైనప్పటి నుంచి టీసీఎస్ సాఫ్ట్‌వేర్‌లోనే కార్యకలాపాలు కొనసాగుతూ వచ్చాయి. కొత్తగా తీసుకొచ్చిన ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌లో వేసవి భత్యానికి సంబంధించిన ఎలాంటి ఆప్షన్ లేదు. దీంతో ఈ సారి అమలవుతుందా ..? లేదా..?అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదనపు భత్యం లేకపోతే కూలీలు నష్టపోయే పరిస్థితి ఉంది. అసలే సరైన పనులు లేక ఇబ్బందులెదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ విషయంలో ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

313 గ్రామాల్లో ఊపందుకున్న పనులు

జిల్లాలో కరీంనగర్ అర్బన్ మినహా మిగిలిన 15 మండలాల్లో ఉపాధి పనులు జోరందుకున్నాయి. రోజురోజుకూ కూలీల సంఖ్య పెరుగుతుండగా ఫీల్డ్ అసిస్టెంట్లు పర్యవేక్షిస్తున్నారు. 313 గ్రామాల్లోని ప్రజలకు ఉపాధి హామీ పథకం భరోసా కల్పిస్తోంది. మొత్తం 1.35లక్షల కుటుంబాలకు జాబ్‌కార్డులు ఉండగా వీరిలో 2.96 లక్షల మంది సభ్యులుగా ఉన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 1.26 లక్షల కుటుంబాలకు చెందిన 2.56 లక్షల మంది పనులకు హాజరయ్యారు. ఒక్కోకూలీకి నిత్యం రూ.186 నుంచి రూ.200వరకు చెల్లిస్తున్నారు.

సౌకర్యాల సంగతేంటి?

ఏటా వేసవిలో ఉపాధి పనుల వద్ద సౌకర్యాలు అందని ద్రాక్షగా మారాయి. సమావేశాల్లో చెప్పడమే తప్ప ఆచరణలో ఒరిగింది శూన్యం. మండుటెండలో పనులు చేసి వడదెబ్బకు గురై మరణించిన వారూ లేకపోలేదు. ఉపాధి పనులు జరిగే చోట నీడ సౌకర్యం కచ్చితంగా ఉండాలి. చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి. కూలీలకు మంచి నీటి సౌకర్యం కల్పించాలి. నీటి వసతి కల్పించని క్రమంలో రూ.5 అదనంగా మంచినీటి భత్యం చెల్లించాలి. పని ప్రదేశంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి. పని చేస్తున్న సమయంలో కూలీలకు గాయాలైతే ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలి. కూలీలు ఎవరైనా అస్వస్థతకు గురైతే వారిని తక్షణం ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించాలి.

గిట్లయితే ఎట్లా..?



ప్రతీ సంవత్సరం ఉపాధి కూలీ పనిచేవారికి అదనపు భత్యం ఇచ్చేవారు. మూడేళ్లుగా ఆ ఊసే లేదు. ఇదెక్కడి అన్యాయమని అధికారులను అడిగితే పైనుంచి ఆదేశాలు రాలేదంటున్రు. గిట్లయితే ఎట్లా బతికేది.

– రాజయ్య, ఉపాధి కూలీ, రామడుగు

వసతులు కల్పించాలి



ఉపాధి పనులు చేసే చోట సౌకర్యాలు కల్పించడం లేదు. అధికారులు పర్యవేక్షణకు వచ్చినప్పుడు వారికి చెప్పినా చర్యలు లేవు. ఎండలు ముదరకముందే ఏర్పాట్లు చేయాలి. లేకుంటే వడదెబ్బను తట్టుకోలేం.

– మాధవి, ఉపాధి కూలీ, ఇల్లందకుంట

'సుడా'కు న్యాయం చేస్తా

- పెద్దల సమష్టి నిర్ణయంతోనే పదవి
- కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



కరీంనగర్ కార్పొరేషన్ : తనకు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అందరి సహకారంతో సుడా పదవికి న్యాయం చేస్తానని నూతనంగా సుడా చైర్మన్‌గా నియమితుడైన సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిటీ కాంగ్రెస్ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు అందరు పెద్దల సహకారంతో తనకు పదవి వచ్చినట్లు తెలిపారు. 30ఏళ్ల నుంచి వివిధ హోదాల్లో పార్టీ బాధ్యతలు నిర్వర్తిస్తూ వచ్చానన్నారు. 2018లో కాంగ్రెస్‌కు గడ్డుకాలం ఎదురై, అందరూపార్టీని వీడినప్పుడు తాను పార్టీ వెన్నంటి ఉన్నానని గుర్తు చేశారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పొన్నం ప్రభాకర్ తనకు పార్టీ అధికార ప్రతినిధిగా, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పదవులు కట్టబెట్టారని తెలిపారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఇవ్వకున్నా క్రమశిక్షణ గల కార్యకర్తగా పనిచేశానన్నారు. తనకు టికెట్ ఇవ్వలేని సందర్భంలో స్వయంగా ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే సైతం తన పదవికి హామీ ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ పెద్దలంతా కలిసి తనను సుడా చైర్మన్‌గా నియమించారన్నారు. సుడా పరిధిలో అభివృద్ధి చేస్తానని చెప్పారు. అలాగే చెక్‌డ్యాంలు కొట్టుకుపోవడం, కేబుల్‌బ్రిడ్జి అప్రోచ్‌రోడ్ కుంగిపోవడం, స్మార్ట్‌సిటీ పనుల్లో నాణ్యతాలోపంపై తాము గతంలో ఫిర్యాదు చేశామని, ఇప్పుడు విచారణ కొనసాగుతుందని తెలిపారు. నాయకులు కొరివి అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్, అఖిల్, కుర్ర పోచయ్య, స్వామిగౌడ్, బొబ్బిలి విక్టర్, ఖమరొద్దిన్, దన్నసింగ్, నెల్లి నరేశ్, మెతుకు కాంతయ్య పాల్గొన్నారు.

కూరలు రుచిగా లేవంటే కొడుతున్నారు

- కేశవపట్నం సంక్షేమ హాస్టల్ విద్యార్థుల ఆందోళన



వార్డెన్‌కు మొరపెట్టుకుంటున్న విద్యార్థులు

శంకరపట్నం: 'హాస్టల్‌లో వంట సరిగా చేయడం లేదు. కూరలు రుచిగా ఉండడం లేదు. ఇదేంటని ప్రశ్నిస్తే కొడుతున్నారు'.. అంటూ కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కేశవపట్నం సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. హాస్టల్‌లో కామాటి రాంప్రకాశ్ పెడుతున్న శారీరక హింసలు భరించలేక ఇంటికి వెళ్లిపోతామని వార్డెన్ నాగరాజుకు మొరపెట్టుకున్నారు. ఈనెల 13న పదోతరగతికి చెందిన ఓ విద్యార్థిని తీసుకుని రాం ప్రకాశ్ ఓ హోటల్‌కు వెళ్లాడని, అక్కడ విద్యార్థికి చికెన్, చపాతి తినిపించాడని, రాంప్రకాశ్ మద్యం సేవించినట్లు ఆరోపణలు ఉన్నాయి. రాంప్రకాశ్ తీరుపై వార్డెన్ నాగరాజు సాంఘిక సంక్షేమశాఖ డీడీకి సైతం ఫిర్యాదు చేశాడు. విచారణ పూర్తికాగా.. ఆయన తీరులో మార్పు రాలేదని, అవే ఇబ్బందులు కొనసాగుతున్నాయని విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ విషయమై రాంప్రకాశ్‌ను వివరణ కోరగా తాను విద్యార్థికి హోటల్‌లో చికెన్ తినిపించింది వాస్తవమేనని చెప్పాడు. నిబంధనలు ఎలాఉంటాయో తనకు తెలియదని, బదిలీ చేస్తే.. వెళ్లిపోతానని చెప్పడం కొసమెరుపు.

క్లుప్తంగా

హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరిపై కేసు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రవీందర్ తెలిపారు. బీర్‌పూర్‌కు చెందిన చంద్రశేఖర్‌పై అదే గ్రామానికి చెందిన మురళి పదునైన ఆయుధంతో, శేఖర్ అనే వ్యక్తి సైతం దాడికి పాల్పడ్డాడు. చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు మురళి, శేఖర్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండల కేంద్రంలో మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్సై రవీందర్ కథనం ప్రకారం.. బీర్‌పూర్‌కు చెందిన మహిళ ఇంట్లోకి అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్ అక్రమంగా ప్రవేశించిన అసభ్యంగా ప్రవర్తించాడు. సదరు మహిళ ఫిర్యాదు మేరకు చంద్రశేఖర్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

బెల్టుషాపు నిర్వాహకుడిపై..

రాయికల్(జగిత్యాల): రాయికల్ మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన చౌటపల్లి కిరణ్ అక్రమంగా బెల్టుషాపు నిర్వహిస్తుండగా మంగళవారం ఎస్సై అజయ్ ఆధ్వర్యంలో దాడి నిర్వహించారు. రూ.44,400 విలువ గల 79 లీటర్ల మద్యాన్ని జప్తుచేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

సైదాపూర్: మండలంలోని పెరుకపల్లిలో పురుగుమందు పోతరాజు ఓదయ్య(85) అనే వృద్ధుడు మృతిచెందినట్లు సైదాపూర్ ఎస్‌ఐ ఆరోగ్యం తెలిపారు. ఓదయ్య భార్య కనకవ్వ రెండు నెలల క్రితం మృతిచెందింది. దీంతో మనోవేదనకు గురయ్యాడు. సోమవారం ఉదయం పురుగుమందుతాగాడు. చికిత్స కోసం వెంటనే హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి అటునుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా అదేరోజు సాయంత్రం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు యాదగిరి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

రేషన్‌బియ్యం పట్టివేత

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామంలో మంచాల అంజయ్య ఇంట్లో రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్, డీటీసీఎస్ మహేశ్వర్‌రావు తెలిపారు. కల్లెడకు చెందిన అంజయ్య కొంతకాలంగా రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నాడు. ఈనేపథ్యంలో మంగళవారం అతడి ఇంట్లో ఎస్సై, డీటీసీఎస్ తనిఖీలు చేపట్టారు. 51 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి అంజయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై గోదాంకు తరలించారు.

మల్యాలలో..

మల్యాల(చొప్పదండి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మల్యాల మండల కేంద్రంలో ఎస్సై అబ్దుల్ రహీం సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా వెళ్తున్న బొలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో అక్రమంగా తరలిస్తున్న 34.50క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, నిందితులు బండారి ఎల్లయ్య, వెంకట్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వినిపించని 'కిచకిచ'

- దెబ్బతింటున్న ప్రకృతి సమతుల్యత
- అంతరించిపోతున్న ఊరపిచ్చుకలు
- నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

పిచ్చుకలు అడవిలో నాలుగైదేళ్లు బతుకుతాయి. పట్టణాల్లో చెప్పలేం! ఎందుకంటే.. ఎవరి గింజల్ని వాళ్లు వెతుక్కోడానికి పరుగులు తీస్తున్న తరుణంలో.. పిచ్చుకల కోసం ఇంటి ఎదుట కంకులు వేలాడదీసేవాళ్లెవరు? మట్టి పాత్రలో నీళ్లు పెట్టేవాళ్లెవరు? అందుకే.. పెంకుటిళ్ల మాదిరిగానే వాటి ఆయుష్షు అర్ధంతరంగా తీరిపోతోంది.



ఆకర్షిస్తున్న ఊరపిచ్చుక గూళ్లు



అందమైన ఊరపిచ్చుకలు

కోల్‌సిటీ(రామగుండం): సుమారు ఇరవయేళ్ల వెనక్కి వెళ్తే.. మన ఇల్లు, పెరట్లో కిచకిచమంటూ ఆహ్లాదకర శబ్దాలతో సందడి చేస్తూ ఆట పట్టించేవి పిచ్చుకలు. మానవ జీవితాల్లో మమేకమై గ్రామాలు, పట్టణాలు.. ఇలా ఎక్కడపడితే అక్కడ కనిపించేవి. నేడు ఆ పరిస్థితి లేదు. పిచ్చుకలు క్రమంగా అంతరించిపోతున్నాయి. పర్యావరణానికి మేలుచేసే ఈ పక్షిజాతి కనుమరుగు కావడంతో జీవవైవిధ్యం దెబ్బతింటోందని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. జీవనశైలిలో చోటుచేసుకుంటున్న పెనుమార్పులు 'ఊరపిచ్చుక'లపై బ్రహ్మాస్త్రంగా మారుతున్నాయి. బుధవారం 'ప్రపంచ పిచ్చుకల దినోత్సవం' సందర్భంగా కథనం..

పిచ్చుకలు అంతరించిపోవడానికి..

- పిచ్చుకలు అంతరించిపోవడానికి నిపుణులు పలు కారణాలు వెల్లడిస్తున్నారు. నానాటికీ పెరిగిపోతున్న శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం వాటి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.
- సెల్‌ఫోన్ టవర్ల ద్వారా విడుదలయ్యే రేడియేషన్‌తో పిచ్చుకలు ప్రాణాలొదులుతున్నాయి.
- అంతరిస్తున్న పల్లెదనం, మాయమైన ఇంటి పెరటి, పెరిగిపోతున్న పట్టణీకరణ, నగరీకరణతో పిచ్చుకలు గూళ్లు పెట్టుకోవడానికి అవకాశం లేకపోవడం.
- వంట పొలాల్లో పురుగు నివారణకు వినియోగిస్తున్న విషపూరిత రసాయన మందులు సైతం పిచ్చుకల ప్రాణాలు హరిస్తున్నాయి.

ప్రతిఒక్కరూ కృషి చేయాలి



పిచ్చుకల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి. పిచ్చుకలతో సమాజానికి ఎంతోమేలు జరుగుతుంది. మన ఇంటి చుట్టూ ఉన్న పిచ్చుకలను కాపాడుకోవాలి. వాటి మనుగడకు అవసరమైన గూళ్లు, ఆహారం, నీరు ఇంటి పరిసరాలల్లో అందుబాటులో ఉంచాలి. అందుకే సదాశయ ఫౌండేషన్ ఓదెల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా మట్టి చిప్పలు పంపిణీ చేయడానికి శ్రీకారం చుట్టింది.

– భీష్మాచారి, రాష్ట్ర కార్యదర్శి, సదాశయ ఫౌండేషన్

- రసాయనాలతో మిళితం చేసిన పండ్లు, ఆహార ధాన్యాల ఉత్పత్తి తదితర జీవన శైలీలో వస్తున్న పెను మార్పులతో పిచ్చుకల జీనవం దయనీయంగా మారుతోంది.
- అధునాతన కాంక్రీట్ కట్టడాలతో పిచ్చుక గూళ్ల నిర్మాణం తగ్గిపోతోంది.

పక్షి జాతికి గౌరవం..

పిచ్చుక జాతిని కాపాడాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని తెలియజేస్తూ ప్రభుత్వం తపాలా బిళ్ల కూడా విడుదల చేసింది. ఈ స్టాంప్‌పై పిచ్చుక ఫొటో ముద్రించి పిచ్చుకజాతిని గౌరవించింది. అంతేకాకుండా ఎన్ఎఫ్ఎస్ గుజరాత్ రాష్ట్రంలో మార్చి 2011 నుంచి పిచ్చుక అవార్డులు ఇస్తోంది.

ఆ కిచకిచలే వేరు..

చిన్నగా.. బొద్దుగా ఉండే పిచ్చుకల కిచకిచల శబ్దాలే సపరేటు. గింజలు, చిన్నచిన్న కీటకాలే వీటికి ఆహారం. ఊర పిచ్చుక గూళ్లు చూడ్డానికి అందంగా, చూడముచ్చటగా ఉంటాయి. ఆడపిచ్చుకలు గుడ్లు పెట్టే ముందు మగ పిచ్చుకలు గడ్డి పొరకలతో అందంగా గూళ్లు తయారు చేసుకుంటాయి. వీటిలో ఆడపిచ్చుకలు గుడ్లు పెట్టి 11 నుంచి 14 రోజుల వరకు పొదిగి పిల్లలు చేస్తాయి. ఏడాదికి రెండు సార్లు పిచ్చుకలు పొదుగుతాయి. అయితే పిల్లల సంరక్షణ మాత్రం మగపిచ్చుకలు చూసుకుంటాయి.

ఊపిరి పోద్దాం..

పిచ్చుకలను కాపాడుకోకుంటే భవిష్యత్‌లో ఇంటర్నెట్లు, పాఠ్యపుస్తకాలల్లో మాత్రమే ఊర పిచ్చుకలను చూడాల్సిన పరిస్థితి రాబోతుందని పక్షిప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిచ్చుకలకు సంరక్షణ కల్పించకుంటే అరుదైన పక్షుల జాబితాలో చేరే ప్రమాదం కూడా ఉంది. ఊర పిచ్చుకలు సంచరిస్తున్న నివాసాల్లో ధాన్యం వేయడం, కిటికీలు, డాబాలపై కృత్రిమ పిచ్చుక గూళ్లు తయారు చేయడం తదితర వాటితో పిచ్చుకలను కాపాడాలని పక్షి ప్రేమికులు కోరుతున్నారు.

ఇకనైనా తీరు మారేనా?

- వీణవంక తహసీల్ కార్యాలయంలో భూ వివాదాలు
- సాక్షిలో వరుస కథనాలు ప్రచురితం
- కార్యాలయాన్ని ప్రక్షాళన చేసిన కలెక్టర్
- మార్పు దిశగా పని చేయాలని కోరుతున్న ప్రజలు
- ఎంపీ ఎన్నికల కోడ్ వచ్చినా ఇన్‌చార్జి తహసీల్దారే దిక్కు



వీణవంక: తహసీల్ కార్యాలయంలో వరుస వివాదాలపై ఇటీవల ‘సాక్షి’లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో కలెక్టర్ పమేలా సత్పతి తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రక్షాళన చేసిన విషయం తెలిసిందే. అటెండర్ నుంచి ఆర్‌ఐల వరకు అందరినీ బదిలీ చేయడం సంచలనం రేపింది. తహసీల్దార్, డెప్యూటీ తహసీల్దార్, ధరణి ఆపరేటర్ సస్పెండ్‌కు గురయ్యారు. సాక్షి కథనాలపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఇప్పటికైన అధికారుల తీరు మారుతుందా అని ఎదురు చూస్తున్నారు. మండలంలో 26గ్రామ పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో 17వేల కుటుంబాలు ఉండగా 32 వేల ఎకరాల సాగు భూములున్నాయి. వ్యవసాయఆధారిత మండలం కావడంతో ఇక్కడ భూముల రేట్లకు డిమాండ్ ఉంది. హైబ్రిడ్ వరిని(ఆడ, మగ) రైతులు ఎక్కువగా పండిస్తారు. మంచి లాభాలు అర్జించడంతో భూములు ధరలు అమాంతంగా పెరిగాయి. భూములు కొనేవారు పుష్కలంగా ఉన్నా, అమ్మేవారు లేరు అంటే భూముల ధరలు ఎలా ఉన్నాయో తెలుస్తోంది.

భూ సమస్యలే ఎక్కువ

తహసీల్దార్ కార్యాలయానికి భూ సమస్యలే వస్తుంటాయి. దీన్ని ఆసరా చేసుకొని కొంతమంది సిబ్బంది రైతుల నుంచి భారీగా డబ్బులు వసూళ్లు చేశారనే ఆరోపణలు. ఘన్ముక్కులలో ఓ వ్యక్తికి సంబంధించిన ఇంటి స్థలం ప్రొహిబిటెడ్ ల్యాండ్ కింద ధరణిలో చూపిస్తుండటంతో సదరు వ్యక్తి తహసీల్ కార్యాలయంలో పలుమార్లు దరఖాస్తు చేసుకొన్నాడు. ఇదీ గమనించి ఓ సిబ్బంది(ఇటీవల బదిలీ అయ్యాడు)పని పూర్తి చేస్తానని అతని వద్ద డబ్బులు దండుకున్నాడు. కానీ ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదు. ఇలా ఒక్కరు కాదు ఇద్దరు కాదు చాలా మంది వద్ద సదరు అధికారి వసూళ్లు చేశాడని ఆరోపణలు. మల్లారెడ్డిపల్లి గ్రామంలో ఓ భూమి విషయంలో అధికారులు చేతివాటం ప్రదర్శించారని ఇటీవల రైతు ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. ఇలా కింది స్థాయి సిబ్బంది నుంచి అధికారుల వరకు కార్యాలయాన్ని భ్రష్టు పట్టించారనే విమర్శలు వెలువడ్డాయి.

ఇన్‌చార్జి తహసీల్దారే దిక్కు

పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చినా ఇప్పటివరకు తహసీల్దార్‌ను నియమించలేదు. ఇటీవల తహసీల్దార్ తిర్మల్‌రావును వివాదాల నేపథ్యంలో కలెక్టర్ సస్పెండ్ చేసింది. ఇక్కడ కాశీచరణ్‌ను తహసీల్దార్‌గా నియమించినా కరీంనగర్ జిల్లా వ్యక్తి కావడంతో ఎన్నికల నియామవళి ప్రకారం విధుల్లో చేరలేదు. దీంతో ఇటీవల నూతనంగా విధుల్లో చేరిన డిప్యూటీ తహసీల్దార్ నిజామొద్దీన్‌ను ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు. సమస్యాత్మక మండలంగా వీణవంక జిల్లాలో మొదటి స్థానంలో ఉంది. ఇక్కడికి అధికారులు రావాలంటేనే జంకుతున్నారని ప్రచారం. ఇప్పటికైనా విధుల్లో చేరిన తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది మార్పు దిశగా పని చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నెమలిని చంపిన కేసులో ఇద్దరి అరెస్ట్



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ రఘుచందర్



స్వాధీనం చేసుకున్న రైఫిల్, తూటాలు

- రైఫిల్, తూటాలు, గొడ్డలి, కారు స్వాధీనం
- డీఎస్పీ రఘుచందర్

పెగడపల్లి(ధర్మపురి): జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం దోమలకుంట గ్రామంలో నెమలిని చంపి పట్టుబడిన నిందితులను పోలీసులు అరెస్టు చూపారు. మంగళవారం మల్యాల సీఐ రవి, ఎస్సై రామకృష్ణతో కలిసి డీఎస్పీ రఘుచందర్ పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన నలువాల సత్యనారాయణ, మల్యాల మండల కేంద్రానికి చెందిన జవ్వాజి రాజు అనే ఇద్దరు వేటగాళ్లు సోమవారం రాత్రి దోమలకుంట శివారులో నాటు తుపాకీతో నెమలిని కాల్చిచంపి కారులో తరలిస్తున్నారు. పక్కా సమాచారం మేరకు ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది దోమలకుంటకు చేరుకుని వాహనాల తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో కారును తనిఖీ చేయగా లైసెన్స్ లేని జీరో పాయింట్ 22 ఇంచెస్ రైఫిల్, నెమలి కళేబరం లభ్యమైంది. కారులో ఉన్న ఇద్దరిని విచారించగా రైఫిల్‌తో నెమలిని హతమార్చినట్లు ఒప్పుకున్నారు. నెమలితో పాటు రైఫిల్, 33 తూటాలు, గొడ్డలి స్వాధీనం చేసుకున్నారు. కాగా సత్యనారాయణ 2017లో భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో జింకను హతమార్చిన కేసు ప్రధాన నిందితుడని, ఇంకా కేసు కొనసాగుతుందని డీఎస్పీ పేర్కొన్నారు. నెమలిని హతమార్చిన సత్యనారాయణ, కారు డ్రైవర్ రాజును మంగళవారం కోర్టులో హాజరు పరిచారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై, ఏఎస్సై సత్తయ్య, సిబ్బందిని ఎస్పీ సన్‌ప్రీతిసింగ్ అభినందించారు.

పేకాటస్థావరంపై దాడి.. రూ.14.48లక్షలు స్వాధీనం

- 10 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్
- రామగుండం సీపీ శ్రీనివాస్



వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడిచేసి భారీగా నగదు స్వాధీనం చేసుకున్నట్లు రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం అస్నాద గ్రామ శివారు మామిడితోటలో కొందరు డబ్బులు పెట్టి మూడుముక్కలాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ సంజీవ్ ఆధ్వర్యంలో దాడి చేశారన్నారు. ఈ సందర్భంగా 10 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారని, వారినుంచి 10 సెల్‌ఫోన్లు రూ.14.48లక్షల నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని వివరించారు. కొందరు ముఠాగా ఏర్పడి పెద్దపల్లి, మంచిర్యాల, వరంగల్, కరీంనగర్, ఆసిఫాబాద్, ఏరియాల నుంచి పేకాటరాయుళ్లను పిలిపించుకుని పేకాట ఆడుతున్నట్లు వివరించారు. కొంత పెట్టుబడి పెట్టి, అటవీ ప్రాంతాల్లో రోజుకు ఒక ఏరియాలో పేకాటస్థావరాలు ఏర్పాటుచేసి, ఆటగాళ్ల నుంచి పెద్దమొత్తంలో వసూలు చేస్తున్నారని అన్నారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో స్థావరాలు ఏర్పాటు చేసుకొని పేకాట నిర్వహిస్తున్నారన్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడిలో పట్టుపడిన వారు మంచిర్యాల, చెన్నూర్ మండలం నాగాపురం, గోదావరిఖని మల్కాపురం, హనుమాన్‌నగర్, మంచిర్యాల జిల్లా వేంపల్లి, వరంగల్ పోర్ట్, కొలనూరు, రెబ్బన, సీసీసీ నస్పూర్‌కు చెందిన వారు ఉన్నారని సీపీ వివరించారు.

ఇసుక లారీల పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక లారీలు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): పెద్దరాతుపల్లి, కిష్టంపేట, మీర్జంపేట గ్రామాల నుంచి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న లారీలను పోలీసులు మంగళవారం పట్టుకున్నట్లు సమాచారం. ఈవిషయమై ఎస్సై ఓంకార్ యాదవ్‌ను వివరణ కోరగా పెద్దరాతుపల్లి మానేరు నది నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారనే పక్కా సమాచారంతో తనిఖీలు చేసి లారీలను సీజ్‌చేసినట్లు వివరించారు. లారీ డ్రైవర్లు, ఓనర్లను బైండోవర్ చేశామని పేర్కొన్నారు. మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చామని ఎస్సై తెలిపారు.

పందెం కోళ్లు విక్రయం



విక్రయానికి సిద్ధంగా ఉన్న కోళ్లు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ శివారులో మహారాష్ట్రకు చెందిన ఆయుర్వేద హనుమాన్ సంచార జాతులువారు మంగళవారం పందెం కోళ్లను విక్రయించారు. ఒక్కో కోడి ధర రూ.మూడువేల నుంచి నాలుగు వేల వరకు పలికింది. కొంతమంది మాంసం ప్రియులు పందెం కోళ్లను కొనుగోలు చేసి ఆరగించాలన్న ఆసక్తితో ధరను లెక్క చేయకుండా కొనుగోలు చేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

పెగడపల్లి(ధర్మపురి): మండలంలోని బతికపల్లి గ్రామానికి చెందిన గాజె చంద్రయ్య (55) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై రామకృష్ణ వివరాల ప్రకారం.. చంద్రయ్య కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. వ్యాధి నయం కోసం మందులు వాడినా తగ్గలేదు. ఈ క్రమంలో జీవతంపై విరక్తి చెంది ఈ నెల 15న తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యార్థులపై వేడినీళ్లు పడిన సంఘటనపై విచారణ

జమ్మికుంట: మండలంలోని గండ్రపల్లి గ్రామ శివారులోని తెలంగాణ సాంఘిక గురుకుల(బాలికల) పాఠశాలలో విద్యార్థులపై వేడినీళ్లు పడి సంఘటనపై కరీంనగర్ రీజినల్ కోఆర్డినేటర్ లక్ష్మాంజలి, డీసీవో శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. వేడినీళ్లు పడి తీవ్రగాయాలైన విద్యార్థులు, తండ్రులు, ఉపాధ్యాయులు, కేర్ టేకర్ రమ్య, అసిస్టెంట్ కేర్ టేకర్ రేణుక, ఉపాధ్యాయులు, క్లాస్‌లీడర్లను విడివిడిగా విచారించి సంఘటనపై వివరాలు సేకరించారు. ఉన్నతాధికారులకు వివరాలు తెలియజేసి చర్యలు తీసుకుంటామని డీసీవో తెలిపారు. వైద్యఖర్చులకు స్కూల్ ఫండ్ అందజేయాలని ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సత్యప్రియను ఆదేశించారు. విచారణలో వైస్‌ప్రిన్సిపల్ పరిమళవాణి, పేరెంట్స్ కమిటీ సభ్యులు ఉన్నారు.

రూ.2 లక్షలు పట్టుకున్న పోలీసులు



పట్టుకున్న వాహనంతో పోలీసులు, వ్యక్తులు

ధర్మారం(ధర్మపురి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం జక్కన్నపల్లి గ్రామంలో మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా రూ.2,80,000 నగదు లభించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. చెక్‌పోస్టు వద్ద బొలేరో వాహనం తనిఖీ చేయగా దరావత్ ఠాకూర్, లోకవత్ దేవేందర్ వద్ద రూ.55,000 లభించాయని, వీటికి ఆధారాలు చూపలేదన్నారు. అదేవిధంగా మరో బొలేరో వాహనంలో చొప్పదండికి చెందిన అంజయ్య, కుమార్, మల్లయ్య, అంజయ్య, లచ్చయ్య వెళ్తుండగా తనిఖీ చేశామన్నారు. ఇందులో రూ.2.25లక్షల నగదు లభించిందని, వీటికి ఆధారాలు చూపలేదని తెలిపారు. ఈ సొమ్మును ఎఫ్ఎస్‌టీ బృందానికి అప్పగించినట్లు ఎస్సై వివరించారు. తనిఖీల్లో ధర్మారం ఎస్సై– 2 అశ్విని, పోలీసులు పాల్గొన్నారు.

బయట తినొద్దన్నందుకు ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



సాహిజాద్ మృతదేహం

గోదావరిఖని: పవిత్ర రంజాన్ సందర్భంగా బయటి తిండి తొనిద్దని తండ్రి మందలించినందుకు మనస్తాపం చెందిన ఇంటర్ విద్యార్థి ఎండీ సాహిజాద్(17) ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని గాంధీనగర్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో సాహిజాద్ ఇటీవల ఇంటర్ ప్రథమ సంవత్సరం పూర్తిచేశాడు. తరచూ బయటి తిండి తినడంతో తండ్రి గట్టిగా మందలించాడు. మనస్తాపం చెందిన సాహిజాద్ చున్నీతో తన ఇంట్లో ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. మృతుడి తండ్రి తాజుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకున్నట్లు గోదావరిఖని వన్‌టౌన్ రెండో సీఐ రవీందర్ తెలిపారు.

సిరిసిల్ల వాసికి అయోధ్య రామయ్య వెండి నాణెం





ప్రకాశ్ అందుకున్న అయోధ్య బాలరాముడి వెండి నాణెం

సిరిసిల్లటౌన్: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన నాణేల కలెక్షన్ కింగ్ బుడిమె ప్రకాశ్ మరో అరుదైన నాణెం సొంతం చేసుకున్నారు. ఇటీవల అయోధ్య బాలరాముడి ఆలయం ప్రారంభంకాగా.. కోల్‌కత మింట్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి మొదటి వారంలో ఆలయ ప్రాశస్త్యం, చరిత్రలో నిలిచేలా వెండి నాణెం తయారు చేశారు. వివిధ పత్రికల్లో నోటిఫికేషన్‌ను చూసిన ప్రకాశ్ ఫిబ్రవరి 16న కోల్‌కత మింట్‌కు ఆన్‌లైన్‌లో రూ.5,092 చెల్లించాడు. ఇందుకుగాను మంగళవారం రామ్‌లల్లా ప్యూర్ సిల్వర్ కాయిన్ ప్రకాశ్‌కు అందింది. ఇది 50 గ్రాముల ప్యూర్ సిల్వర్‌తో తయారైంది.

హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవ శిక్ష

జగిత్యాలజోన్: తనతో గొడవపడ్డ వ్యక్తిని చంపేందుకు వెళ్లగా, సదరు వ్యక్తి పారిపోవడంతో ఆ కారణంగా అతడి స్నేహితుడిని హత్య చేసిన కేసులో నిందితులైన ఇద్దరికి యావజ్జీవశిక్ష, ఒక్కొక్కరికి రూ.5 వేల జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు జిల్లా జడ్జి సుగలి నారాయణ మంగళవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాసారపు మల్లేశం కథనం ప్రకారం.. వెల్గటూర్ మండలం ముత్తునూర్‌కు చెందిన బైరం దామోదర్, సింగం రాజయ్య స్నేహితులు. అయితే, సాగు నీటి విషయంలో సింగం రాజయ్య, సీపతి ప్రభాకర్ మధ్య గొడవ జరుగగా, ప్రభాకర్ తలకు గాయాలైనాయి. దీంతో రాజయ్యపై కేసు నమోదైంది. అయినా రాజయ్యను ఎలాగైన చంపాలని ప్రభాకర్ తన మిత్రుడైన నేరేళ్ల రాజుతో కలిసి ప్రణాళిక రూపొందించాడు. ఈ నేపథ్యంలో 2009 డిసెంబర్ 24న రాజయ్య తన పొలం నుంచి ఇంటికి వస్తుండగా, గ్రామ శివారులో మాటు వేసిన ప్రభాకర్, రాజు వెంబడించడంతో అతను తప్పించుకుని ఊర్లోకి వెళ్లిపోయాడు. అయితే, అదే సమయంలో రాజయ్య స్నేహితుడు బైరం దామోదర్ కూలీలతో కలిసి ఎడ్లబండిపై ఊర్లోకి వెళ్తున్నాడు. అప్పటికే ఆవేశంతో రగిలిపోతున్న ప్రభాకర్, రాజుకు దామోదర్ కనబడటంతో కత్తులతో దాడి చేసి హత్య చేశారు. ఎడ్లబండిలో ఉన్న కూలీలు భయభ్రాంతులతో తలోవైపు పరిగెత్తారు. మృతుడి అన్న బైరి లచ్చయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్నారు. అప్పటి డీఎస్పీ దామెర నర్సయ్య నిందితులిద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు జి.కిరణ్‌కుమార్, ఎం.కిరణ్‌కుమార్, వి.శ్రీధర్ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో న్యాయమూర్తి పరిశీలించారు. అనంతరం సీపతి ప్రభాకర్, నేరేళ్ల రాజుకు యావజ్జీవశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

విడాకులు ఇచ్చిన భర్తపై యాసిడ్ దాడి



గాయపడిన మహేశ్

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): విడాకులు ఇచ్చిన భర్త మరో పెళ్లి చేసుకోకుండా ఉండేందుకు మాజీ భార్య యాసిడ్‌తో దాడి చేసిన ఘటన జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామంలో జరిగింది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. ఎర్దండికి చెందిన నిరేటి మహేశ్ ఆదిలాబాద్ జిల్లాలో ఓ ప్రైవేటు సీడ్ కంపెనీలో సెల్స్ మేజేజర్‌గా పనిచేస్తున్నాడు. ఎనిమిదేళ్ల క్రితం మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామానికి చెందిన మాస లక్షణతో వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల వయస్సు గల పాప ఉంది. పెళ్లి అయినప్పటి నుంచి తరచూ మనస్పర్థలు రావడంతో 11 అక్టోబర్ 2023న విడాకులు తీసుకున్నారు. కాగా మహేశ్ మరో పెండ్లి చేసుకునేందుకు నిర్ణయించుకొని ఏర్పాట్లు చేస్తుండగా.. అతడికి పెండ్లి కాకుండా ఉండేందుకు ఎదైన హాని చేయలనే ఉద్దేశంతో మంగళవారం ఉదయం లక్షణ ఎర్దండికి వచ్చింది. మహేశ్ ఇంట్లో నుంచి బయటకు రాగానే యాసిడ్ బాటిల్‌తో దాడి చేసింది. మహేశ్‌కు వీపు, ఎడమ కన్ను పై భాగంలో గాయాలైనాయి. చికిత్స నిమిత్తం మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు లక్షణపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అనిల్ తెలిపారు.

దావత్ కోసం పిలిచి దాడి చేసి

- ఫేస్‌బుక్ పరిచయంతో సిరిసిల్లకు వచ్చిన యువకుడు
- స్నేహం ముసుగులో దాడి చేసిన వైనం
- ఇద్దరి రిమాండ్

సిరిసిల్లక్రైం: ఫోన్‌లో ఏర్పడ్డ పరిచయంతో దావత్ చేసుకుందామని పిలిచి దాడి చేసిన ఇద్దరిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సిరిసిల్లటౌన్ సీఐ రఘుపతి తెలిపిన వివరాలు. మేడ్చల్ జిల్లా మల్కాజ్‌గిరి మండలం బొల్లారం గ్రామానికి చెందిన ముక్క శ్రీనివాస్‌కు రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడలోని చింతల్‌ఠాణాకు చెందిన సూర దేవయ్యతో ఫేస్‌బుక్‌లో పరిచయం ఏర్పడింది. దావత్ చేసుకుందామని ఈనెల 17న బొల్లారం నుంచి ముక్క శ్రీనివాస్‌ను సిరిసిల్లకు పిలిపించారు. సూర దేవయ్య, సూర నరేశ్ సిరిసిల్ల బస్టాండ్‌కు వచ్చి శ్రీనివాస్‌ను బైక్‌పై ఎక్కించుకొని బైపాస్‌రోడ్డుకు తీసుకెళ్లారు. ఓ ప్రాంతంలో బైక్ ఆపి శ్రీనివాస్‌పై దాడి చేసి రూ.3వేలు లాక్కున్నారు. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం చంద్రంపేట క్రాసింగ్ వద్ద సూర దేవయ్య, సూర నరేశ్‌లను పట్టుకుని వారి నుంచి నగదు, సెల్‌ఫోన్ సీజ్ చేసి రిమాండ్ పంపారు.

క్లుప్తంగా

విద్యార్థులకు చెస్ బోర్డులు పంపిణీ



చెస్ బోర్డులు పంపిణీ చేస్తున్న సభ్యులు

కరీంనగర్‌స్పోర్ట్స్: నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గల గాయత్రీనగర్, కపిల్ బాలకుటీర్‌లో ఉంటున్న విద్యార్థులకు మంగళవారం హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చెస్ బోర్డులు పంపిణీ చేశారు. చెస్ నేర్చుకునేందుకు అవసరమైన ఆరు చెస్ బోర్డులు, అరటి పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యుడు చిందం రమేశ్, నిర్వాహకులు సాగర్, శ్రీధర్‌రెడ్డి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్ రాజీవ్‌రహదారిలో మంగళవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని బొమ్మకల్ స్టేజీ వద్ద పోలీస్ చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జిల్లా సరిహద్దు గ్రామం మొగ్దుంపూర్ స్టేజీ వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేయగా ప్రస్తుతం బొమ్మకల్ వద్ద ఏర్పాటు చేశారు. పంచాయతీరాజ్, పోలీసు, రెవెన్యూశాఖలకు చెందిన అధికారులతో ఏర్పాటు చేసి మూడు బృందాలు విడతల వారీగా విధులు నిర్వహిస్తారు. మొదటి బృందం ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, రెండో బృందం మధ్యాహ్నం 2గంటల నుంచి రాత్రి 10గంటలు, మూడో బృందం రాత్రి 10గంటల నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకు వాహనాలను తనిఖీ చేస్తారు. పెద్దపల్లి జిల్లా నుంచి కరీంనగర్‌కు అక్రమంగా నగదు, మద్యం, ఇతర నిషేధిత వస్తువుల తరలింపును అడ్డుకునేందుకు బొమ్మకల్ వద్ద పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు కరీంనగర్‌రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం విడిచిపెడుతున్నట్లు వివరించారు.

హుండీల ఆదాయం లెక్కింపు

కరీంనగర్ కల్చరల్: నగరంలోని దేవాదాయ శాఖ పరిధిలో గల రెండు ఆలయాల హుండీల ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. కోతిరాంపూర్ పోచమ్మ ఆలయ హుండీలను లెక్కించగా రూ.3,44,486, రాంపూర్ గిద్దెపెరుమాళ్ల ఆలయ హుండీల ఆదాయం లెక్కించగా రూ.82,800 వచ్చినట్లు ఆయా ఆలయాల ఈవో ఎండపెల్లి మారుతి తెలిపారు. లెక్కింపులో ఈవో మారుతితో పాటు పర్యవేక్షకుడిగా జూనియర్ అసిస్టెంట్ కొత్తకొండ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ గుడికాడి శ్రీనివాస్, ఆలయాల అర్చకులు పెండ్యాల వెంకటేశ్వరావు, రామక శంకరశర్మ, భక్తులు, గోవిందపతి శ్రీవారి సేవా సమితి కార్యకర్తలు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం పరిశీలన

శంకరపట్నం: కేశవపట్నంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. మండలంలోని కేశవపట్నం, మొలంగూర్, తాడికల్ ఎస్సెస్సీ కేంద్రాల్లో 330 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాల వద్ద కేశవపట్నం పోలీసులు విధులు నిర్వహించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

చొప్పదండి: బీఎస్పీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి, పార్టీ తరుపున ఎమ్మెల్యేగా పోటీ చేసిన కొంకటి శేఖర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నిర్ణయాలకు కట్టుబడి ఆయన వెంట బీఆర్‌ఎస్‌లో చేరానని మంగళవారం ప్రకటించారు. కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ పునర్నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు.

వైభవంగా శ్రీసుదర్శన మహాహోమం

రామడుగు: మండలంలోని వెదిర శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా మంగళవారం వేదపండితులు శ్రీసుదర్శన మహాహోమం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేదపండితులు ఆరాధన, సహస్రనామార్చన, ద్రావిడ వేద పారాయణం, పూర్ణశరణాగతి, పూర్ణాహుతి, ద్రావిడ వేద శాత్తుమర, ప్రత్యేకంగా పూజ కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ చెన్నమనేని రాజేందర్‌రావు, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, నిర్వాహకులు వంగళ శ్రీనివాస్‌రెడ్డిశారద దంపతులు, కమిటీ సభ్యులు దొడ్డ లచ్చిరెడ్డి, సంపత్‌రెడ్డి, నాగుల రాజశేఖర్‌గౌడ్, ఏరెడ్డి మునిరెడ్డి, గిరి శ్రీనివాస్‌రెడ్డి భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కూలి చెల్లింపులో జాప్యం

- ఏడాదిగా హరితహారం కూలీల ఎదురుచూపు
- డీటీవోలో చెక్కు పెండింగ్.. ఆర్థిక ఇబ్బందుల్లో బాధితులు



హరితహారం కూలి చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్న కూలీలు

కొత్తపల్లి(కరీంనగర్): బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కూలీల పాలిట శాపంగా మారింది. హరితహారంలో భాగంగా వివిధ పనులు చేసిన కూలీలకు సరైన సమయంలో కూలి డబ్బుల చెల్లింపులో జాప్యం జరుగుతుండటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూలి కోసం సుమారు ఏడాదిగా కూలీలు ఎదురుచూస్తున్న విషయం కొత్తపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి త్వరితగతిన పెండింగ్ కూలి విడుదల చేయాలని కూలీలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొత్తపల్లి పురపాలక సంఘంలో హరితహారం కింద 16 మంది కూలీలు పని చేస్తున్నారు. వారికి రోజుకు రూ.300 చొప్పున చెల్లించాల్సి ఉంది. అయితే గతేదాది ఏప్రిల్ మాసం నుంచి ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి మాసాల కూలి రావాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో డబ్బుల కోసం కూలీలు సంబంధిత అధికారిని అడిగి వేసారి పోయారు. చివరకు ప్రభుత్వం నుంచి డబ్బులు రాకపోవడంతో పనులు బంద్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. హరితహారంలో భాగంగా 3 నర్సరీలు, మెగాప్లాంటేషన్, ఎవెన్యూ ప్లాంటేషన్‌లో వివిధ పనులు చేపట్టారు. రెక్కాడితే గాని డొక్కాడని కూలీల డబ్బులు సుమారు ఏడాదికాలంగా పెండింగ్‌లో ఉండటం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. పండుగలు, స్కూల్ ఫీజులు, కిరాణం తదితర నిత్యావసర పనుల నిమిత్తం అవసరమైన డబ్బుల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. కూలీల ఆర్థిక పరిస్థితులను లెక్కలోకి తీసుకొని చెక్కును క్లియరెన్స్ చేయించాలని విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి.

ట్రెజరీలో చెక్కు పెండింగ్

కొత్తపల్లి పురపాలక సంఘం పరిధిలో చేపట్టిన హరితహారం కింద కూలీలకు రావల్సిన డబ్బుల చెక్కు జిల్లా ట్రెజరీ కార్యాలయంలో పెండింగ్‌లో ఉంది. ట్రెజరీ నుంచి విడుదలైతే గాని కూలీల ఖాతాల్లో డబ్బులు జమ కాని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని చెక్కును క్లియరెన్స్ చేయించాల్సిన అవసరం ఉంది.

ఎట్లా బతికేది?

కూలీ చేసుకొని బతికే మాకు ఏడాదిగా కూలి డబ్బులు రాకపోతే ఎట్లా బతికేది. స్కూల్ ఫీజులు, నిత్యావసర సరుకులు తదితర అవసరాలకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నం. అధికారులు స్పందించి వెంటనే డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

– నంగి మల్లమ్మ, కూలీ, కొత్తపల్లి

చెక్కును ట్రెజరీలో డిపాజిట్ చేశాం

హరితహారం కూలీలకు ఏప్రిల్ 2023 నుంచి డిసెంబర్ 2023 వరకు రావల్సిన కూలి డబ్బులకు సంబంధించిన చెక్కును ట్రెజరీలో డిపాజిట్ చేశాం. ట్రెజరీ నుంచి డబ్బులు విడుదలైతే నేరుగా కూలీల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి. ఇక జనవరి, ఫిబ్రవరి 2024 మాసం డబ్బులు మాత్రమే చెల్లించాల్సి ఉంది.

– రమేశ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీవో లక్ష్మీనారాయణ



కిసాన్‌నగర్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

కరీంనగర్‌రూరల్: చిరు ధాన్యాలతో తల్లులు, పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు సీడీపీవో పి. లక్ష్మీనారాయణ అన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మంగళవారం తీగలగుట్టపల్లి బస్తీ దవాఖానాలో తల్లులు, చిన్నారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీడీపీవో మాట్లాడుతూ మహిళల్లో రక్తహీనత నివారణకు చిరు ధాన్యాలు దోహదపడుతాయన్నారు. పిల్లలకు జంక్ ఫుడ్ పెట్టకుండా ఇంట్లో తయారు చేసిన పల్లీ, నువ్వుల లడ్డులను తినిపించాలని సూచించారు. వైద్యురాలు లావణ్య మహిళలకు వచ్చే పలు కేన్సర్‌లపై అవగాహన కల్పించారు. వేసవికాలంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమావేశంలో సూపర్‌వైజర్ నిర్మల, ఏఎన్‌ఎం స్వర్ణలత, అంగన్‌వాడీ టీచర్లు శ్రీలత, రాజమణి, ఆశావర్కర్లు పుష్పలత, తిరుపతమ్మ పాల్గొన్నారు.

కిసాన్‌నగర్‌లో..

కరీంనగర్: కిసాన్‌నగర్ సెక్టార్ పరిధిలోని ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు పోషణ్ బి, పడాయి బి అనే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులు, తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

‘బాపు’ లఘుచిత్రం పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని జ్యోతినగర్‌లో ఉన్న ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో మంగళవారం బాపు లఘుచిత్రం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ లఘు చిత్రానికి కథ, మాటలు, చిత్రానువాదం, నిర్మాత, దర్శకత్వం సంగెం శివ నిర్వహిస్తున్నారు. బాపు లఘుచిత్రం నాలఘు చిత్రం యూట్యూబ్ ఛానల్‌లో రిలీజ్ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరస్తు ఫంక్షన్ హాల్ అధినేత శనిగరం రాజేశం, కలర్ సత్తెన్న, బొట్ల రామస్వామి, యాదగిరిగౌడ్, బండారి రాధాకిషన్, కనపర్తి శ్రీనివాస్, నిమ్మల శ్రీనివాస్, దీకొండ భాస్కర్, కీసర వెంకటస్వామి, వాయుకుమార్, వినీత, సదన్, శాంతకుమార్, రాజ్‌కుమార్, నిమ్మల యాదగిరి, మురారి శ్రీనివాస్, పవన్‌కల్యాణ్, మురళి, కంకటి సురేశ్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉద్యమకారులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న పామరాజు రామారావు

విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారిని ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పామరాజు రామారావు అన్నారు. మంగళవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఎంతోమంది ప్రాణాలు త్యాగం చేశారని, మరెందరో జైలుకెళ్లారని, పోలీస్‌స్టేషన్లలో బైండోవర్ అయ్యారన్నారు. ఉద్యమంలో పాలుపంచుకున్న వారిని గుర్తించి వారికి గుర్తింపు కార్డులు, ఇళ్ల స్థలాలు, 50 ఏళ్లు దాటిన వారికి పెన్షన్లు, బస్‌పాసులు ఇవ్వాలని తెలిపారు. ఉద్యమకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉద్యమకారుడైన గొడిశాల సతీశ్‌ను సన్మానించారు. ఈ సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు పురమల్ల శ్రీనివాస్, సలహాదారులు ఉప్పు రవీందర్, సంపత్‌కుమార్, నాయకులు ఆనంద్, కలర్ సత్తన్న, తిరుపతి, రమేశ్, వెంకటేశ్వర్లు, కాళిదాసు రేణుక, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై కొరడా

- బొమ్మకల్‌లో డీఎల్‌పీవో విచారణ
- మోఖాపై పరిశీలించి హద్దురాళ్ల తొలగింపు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని అక్రమ లేఅవుట్లపై మంగళవారం పంచాయతీ అధికారులు కొరడా ఝులిపించారు. డీఎల్‌పీవో రాంబాబు మోఖాపై పరిశీలించి అక్రమ లేఅవుట్లలోని హద్దురాళ్లను తొలగించారు. అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని హెచ్చరించారు. బొమ్మకల్‌లో కొన్నేళ్ల నుంచి అక్రమ లేఅవుట్లతో గ్రామపంచాయతీ ఆదాయానికి రియల్‌ఎస్టేట్ వ్యాపారులు గండి కొడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని సామాజిక కార్యకర్త దొమ్మాటి బాబు ఈనెల 11న ప్రజావాణిలో కలెక్టర్ పమేలా సత్పతికి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం డీఎల్‌పీవో రాంబాబు గ్రామపంచాయతీ కార్యాలయంలో అక్రమ లేఅవుట్లపై విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుడు బాబుతో పాటు ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి హిదైతుల్లా నుంచి అక్రమ లేఅవుట్లకు సంబంధించిన సర్వేనంబర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో పంచాయతీ ఆధ్వర్యంలో తీసుకున్న చర్యలు, డీటీసీపీ, సుడా నుంచి ఎన్ని లేఅవుట్లకు అనుమతులున్నాయనే విషయాలను సేకరించారు. అనంతరం టీఎస్ బీపాస్ అనుమతితో అక్రమ లేఅవుట్ స్థలంలో నిర్మిస్తున్న రెండు గృహాలను డీఎల్‌పీవో పరిశీలించారు. సర్వేనంబర్లు 9, 10, 11, 142, 57, 111లో చేసిన లేఅవుట్ స్థలాలను తనిఖీ చేశారు. సర్వేనం.164లోని స్థలంలో అనుమతి లేకుండా హద్దురాళ్లను ఏర్పాటు చేస్తుండగా అడ్డుకున్నారు. తాము కొనుగోలు చేసిన స్థలంలో హద్దులను ఏర్పాటు చేస్తున్నామని పట్టాదారులు చెప్పగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను పరిశీలించారు. లేఅవుట్ అనుమతి లేకపోవడంతో హద్దురాళ్లను తొలగించడంతో పాటు ట్రాక్టర్, డీసీఎం వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమ లేఅవుట్ స్థలాలపై సమగ్ర సమాచారాన్ని సేకరించి కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు డీఎల్‌పీవో రాంబాబు తెలిపారు.



బొమ్మకల్‌లో అక్రమ లేఅవుట్‌లోని సిమెంట్ పోల్స్‌ను తొలగిస్తున్న పంచాయతీ అధికారులు



బొమ్మకల్ గ్రామపంచాయతీలో అక్రమ లేఅవుట్లపై విచారణ చేస్తున్న డీఎల్‌పీవో రాంబాబు

అవగాహనతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

కరీంనగర్‌టౌన్: ఆరోగ్యంపై అవగాహన పెంచుకొని కాపాడుకోవాలని డాక్టర్ కేర్ హోమియోపతి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏఎం. రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని ప్రతిమ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఆరోగ్యంపై ప్రజలకు పూర్తి అవగాహన లేకపోవడం వల్ల తమ ఇష్టానుసారంగా మందులు వాడుతున్నారని అన్నారు. తద్వారా అనారోగ్యాల పాలవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో కంటే కరీంనగర్ లాంటి జిల్లా కేంద్రాలతో పాటు పట్టణాలు, గ్రామస్థాయిల్లో అవగాహన తక్కువగా ఉందన్నారు. గత పదేళ్ల క్రితం కంటే ఇప్పుడు రోగాలు విపరీతంగా పెరిగాయని, మందులకు లొంగని రోగాలు కూడా వస్తున్నాయని వెల్లడించారు. అన్ని వ్యాధులకు హోమియోపతిలో మందులు ఉన్నాయని తెలిపారు. భవిష్యత్‌తరాలు బాగుండాలనే ఉద్దేశంతో ‘థాంక్యూ డాక్టర్’ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నీరజ, డాక్టర్ భార్గవి, డాక్టర్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఏఎం. రెడ్డి

వరిపై తెగుళ్ల దాడి



ఎలబోతారంలో అగ్గి తెగులు సోకిన పొలం

- ఆందోళనలో అన్నదాతలు
- సస్యరక్షణ చర్యలపై అధికారుల అవగాహన
- కరీంనగర్ మండలంలో 12,368 ఎకరాల్లో సాగు

కరీంనగర్‌రూరల్: యాసంగి వరిపంటను కాపాడుకునేందుకు రైతులు నానాతంటాలు పడుతున్నారు. ఓవైపు సాగు నీరందక పంట ఎండుతుండగా మరోవైపు తెగుళ్లు ఆశిస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. కరీంనగర్ మండలంలో ఈ యాసంగి సీజన్‌కు సంబంధించి 12,368 ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటం, వాతావరణంలో వచ్చిన మార్పులతో వివిధ రకాల తెగుళ్లు పంటను ఆశిస్తున్నాయి. వాటి నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులను మండల వ్యవసాయాధికారి బి.సత్యం వివరించారు.

అగ్గి తెగులు : సాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉండటం లేదా వాతావరణ మార్పులతో ప్రస్తుతం అగ్గి తెగులు ఎక్కువగా ఆశిస్తోంది. ఆకుల మీద నూలు కండె ఆకారంలో ఎర్రటి మచ్చలు ఏర్పడి, ఆకులు మాడిపోతాయి. నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లేదా ఐసోప్రొథయోలిన్ 1.5 మిల్లీలీటర్లను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కాండం తొలుచు పురుగు: ఈ తెగులు ఆశిస్తే మొగి చనిపోయి, పెరుగుదల ఆగిపోతుంది. నివారణకు ఎకరానికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మిల్లీలీటర్లను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉంటే క్లోరంట్రానిలిప్రోల్ 0.3 మిల్లీలీటర్లను లీటరు నీటిలో కలిపి వినియోగించాలి.

కాండం కుళ్లు తెగులు: ప్రస్తుత వాతావరణంలో ఈ తెగులు ఎక్కువగా ఆశించే అవకాశముంది. నివారణకు హెక్సాకోనజోల్ 5ఎస్‌సీ 2 మిల్లీలీటర్లు లేదా ప్రొపికొనజోల్ 1 మిల్లీలీటర్‌ను ఒక లీటరు నీటిలో కలిపి పిలకలు కిందకు తడిచేలా పిచికారీ చేయాలి.

జింక్ లోపం: వరి ఆకులపై ఇటుక రంగు మచ్చలు ఏర్పడి, కర్ర పెరుగుదల ఆగిపోతుంది. నివారణకు 2 గ్రాముల జింక్ సల్ఫేట్ లీటర్ నీటిలో కలిపి, రెండుసార్లు ఐదు రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.

నీటి యాజమాన్య పద్ధతులు..

ఎండల తీవ్రత పెరుగుతుండటంతో నీటి అవసరం పెరుగుతుంది. పొలాన్ని ఎప్పుడూ తడిగా ఉంచాలి. నీటి ఎద్దడి ఎక్కువగా ఉంటే కిరణజన్య సంయోగ క్రియ జరగక పొలం ఎండిపోయి, గొలక రాదు. ఈ దశలో పొడ, కుళ్లు, వేరుకుళ్లు తెగులు సోకే ప్రమాదముంది. వీటి నివారణకు ఎకరానికి ముందస్తుగా మాంకోజెఫ్, కార్బాండిజమ్ మిశ్రమం 400 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి, పిచికారీ చేయాలి. వేపనూనెను రెండు విడతలుగా పావు లీటర్ చొప్పున పిచికారీ చేస్తే తెగుళ్లు ఆశించవు.

మానవ హక్కుల కమిటీ మండల అధ్యక్షుడిగా రవీందర్‌రెడ్డి



రవీందర్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్: జాతీయ మానవ హక్కుల కమిటీ కరీంనగర్‌రూరల్ మండల శాఖ అధ్యక్షుడిగా మొగ్దుంపూర్‌కు చెందిన గోల్కొండ రవీందర్‌రెడ్డిని నియమించినట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాసం సుధాకర్, విలసాగరం పృథ్వీరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు ఎం.భద్రయ్య, సంయుక్త కార్యదర్శి ఎస్.రమేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇద్దరిపై కేసు

జమ్మికుంట: పట్టణంలో రెండు బెల్టు షాపుల్లో మద్యం పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరగంటి రవి మంగళవారం తెలిపారు. హౌసింగ్‌బోర్డు కాలనీలోని కిరాణా షాపులో రూ.10 వేలు, ఆదర్శ కాలనీలోని కిరాణాషాపులో రూ.3 వేల మద్యం స్వాధీనం చేసుకున్నామని అన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో కొత్త విద్యుత్ లైన్ల పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు 11 కేవీ వరలక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలోని రెడ్డి ఫంక్షన్‌హాల్ వెనుక, సాయిరాంనగర్ రోడ్ నం.2 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జాతీయ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు




ఎంపికైన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని హుబ్లీలో ఈనెల 19 నుంచి 23వరకు జరిగే 48వ జాతీయస్థాయి యోగా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు యోగా సంఘం కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లోని మానేరు ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో రాణించిన చరణ్ తేజ, శకుంతల, శ్రీనిధి (కరీంనగర్), ఆమని (సుల్తానాబాద్), శ్రీనివాస్(పెద్దపల్లి), హసీనాబేగం, వెంకటేశం(గోదావరిఖని) ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులను యోగా సంఘం అధ్యక్షుడు రవీందర్ సింగ్, కన్నకృష్ణ, శ్రీనివాస్, విజయ్‌కుమార్, మనోజ్ అభినందించారు.

నేడు నల్లగొండ నారసింహుని కల్యాణం

తిమ్మాపూర్: నల్లగొండ లక్ష్మీనర్సింహస్వామి, సీతారాముల వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఈనెల 16 ప్రారంభమైన బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం లక్ష్మీనసింహస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో వెంకన్న, చైర్మన్ లక్ష్మణ్ తెలిపారు. వేడుకలకు సుమారుగా 10 వేల మంది వస్తారని, తగిన ఏర్పాట్లు చేశామన్నారు. కల్యాణోత్సవంలో భాగంగా ఉదయం 7 గంటలకు పుణ్యాహవచనం, మంత్సంగ్రహణం, అంకురార్పణ రుత్విక్ వరుణం, పటాధివాసం నిర్వహిస్తామని, సాయంత్రం 4 గంటలకు ధ్వజారోహణం, 4:30 గంటలకు లక్ష్మీనర్సింహస్వామి, శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం జరిపిస్తామన్నారు. రాత్రి 7 గంటలకుహోమం, నిత్యహోమం, స్వామి వారి గరుడ వాహన సేవ, బలిహరణ, తీర్థగోష్టి ఉంటాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.



నల్లగొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



పంటను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తిమ్మాపూర్: చిగురుమామిడి మండలంలోని బాడిపల్లె గ్రామంలో ఎండిన వరి పంటలను మంగళవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. నష్టపోయిన రైతులతో మాట్లాడారు. సాగునీరు లేక పంట నష్టపోయిన రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని, ఎకరానికి రూ.50వేల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో మాట్లాడి రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలన్నారు. ఎండిన పంటలపై సర్వే చేయించి రైతులను ఆదుకోవాలన్నారు. వెంట రైతులు కాటం మల్లారెడ్డి, సందబోయిన ఎల్లయ్య, రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

సామాన్యులకే సై

వైఎస్సార్‌సీపీలో నిబద్ధత గల కార్యకర్తలకు అసామాన్య అవకాశం

రాష్ట్ర చరిత్రలో సరికొత్త ఒరవడికి ఏపీ సీఎం వైఎస్ జగన్ శ్రీకారం

జన బలమే గీటురాయిగా, ప్రజా సేవే ప్రామాణికంగా, నిబద్ధతే పరమావధిగా కింది స్థాయి కార్యకర్తలను అభ్యర్థులుగా ఎంపిక చేయడం ద్వారా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ ప్రజాస్వామ్యానికి మరోసారి సరైన అర్థం చెప్పారు. రాజకీయాలను పక్తు వ్యాపారంగా మార్చేసి.. ఓటుకు నోటు అలవాటు చేసిన 40 ఇయర్స్ ఇండస్ట్రీ, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు యథావిధిగా పార్టీని నమ్ముకున్న వారిని కాదని, కోట్లు కుమ్మరించే బడాబాబులకే రకరకాల ఆఫర్లతో సీట్లు ఇస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు.



1. ఖలీల్ అహ్మద్ (నెల్లూరు, సాధారణ కార్యకర్త)
2. సర్నాల తిరుపతిరావు (మైలవరం, రైతు)
3. ఈర లక్కప్ప (మడకశిర, ఉపాధి హామీ కూలీ)
4. గూడూరి ఉమాబాల (నర్సాపురం ఎంపీ అభ్యర్థి, న్యాయవాది)
5. ఎం.వీరాంజనేయులు (శింగనమల, టిప్పర్ డ్రైవర్)

సాక్షి, అమరావతి : సార్వత్రిక ఎన్నికల్లో శాసనసభ, లోక్‌సభ అభ్యర్థులుగా పార్టీలో కష్టపడి పని చేస్తున్న మామూలు కార్యకర్తలకు అసాధారణ అవకాశం కల్పించారు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ప్రజా సమస్యలపై సూక్ష్మ స్థాయిలో అవగాహన ఉండి.. వాటి పరిష్కారం కోసం కృషి చేస్తూ.. జనం మన్ననలు పొందుతున్న సామాన్యులకు పరిపాలనలో భాగస్వామ్యం కల్పించడం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మరింత మెరుగ్గా సేవలు అందించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో సాధారణ కార్యకర్తలకు వెన్నుదన్నుగా నిలుస్తూ టిక్కెట్లు ఇచ్చి ఆర్థికంగా బలవంతులైన పెత్తందార్లపై పోటీకి దింపుతూ సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాన్ని రాజకీయ పరిశీలకులు, సామాజిక వేత్తలు ప్రశంసిస్తున్నారు.

విద్యా వ్యాపారిపై కార్మికుడు పోటీ

నారాయణ విద్యా సంస్థల ద్వారా విద్యా వ్యాపారం చేస్తూ.. 2014–19 మధ్య రాజధాని భూ కుంభకోణం, ఇన్నర్ రింగ్ రోడ్డు స్కాం, పట్టణ పేదలకు పక్కా గృహాలు ఇచ్చే పేరుతో టిడ్కో ఇళ్ల కుంభకోణానికి పాల్పడిన మాజీ మంత్రి నారాయణ రూ.వేలాది కోట్లకు పడగలెత్తారు. రూ.900 కోట్లకుపైగా పార్టీ ఫండ్ ఇచ్చిన నారాయణను నెల్లూరు సిటీ నియోజకవర్గం నుంచి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బరిలోకి దించితే.. వైఎస్సార్‌సీపీలో సాధారణ కార్యకర్త ఖలీల్ అహ్మద్‌ను సీఎం జగన్ పోటీకి పెట్టారు. మైనార్టీ కుటుంబానికి చెందిన ఖలీల్ అహ్మద్ బంగారు అభరణాల తయారీ పని చేస్తూ.. వచ్చే కూలీ డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటూనే పేదల సమస్యలపై పోరాటం చేశారు. అదే మొన్న నెల్లూరు నగర పాలక సంస్థకు జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున కార్పొరేటర్ టికెట్ ఇచ్చేందుకు దోహదపడింది. కార్పొరేటర్‌గా ఎన్నికైన ఖలీల్ అహ్మద్‌ను సీఎం జగన్.. నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా చేశారు. సమస్యల పరిష్కారంలో డిప్యూటీ మేయర్‌గా ఖలీల్ అహ్మద్ పనితీరుపై అన్ని వర్గాల ప్రజలు ప్రశంసిస్తుండటంతో ఆయనకు నెల్లూరు సిటీ నియోజకవర్గం నుంచి సీఎం జగన్ టికెట్ ఇచ్చారు.

మైలవరంలో రైతు బిడ్డ పోటీ

మైలవరంలో టీడీపీ అభ్యర్థిత్వం కోసం కోటీశ్వరులు మాజీ మంత్రి దేవినేని ఉమా, వసంత కృష్ణప్రసాద్‌ల మధ్య వేలం పాట నిర్వహిస్తున్న చంద్రబాబు.. ఎవరు ఎక్కువ పాడుకుంటే వారికి టికెట్ ఇచ్చేందుకు సిద్ధమైతే.. ఆ స్థానం నుంచి జనబలమే గీటురాయిగా బీసీ వర్గానికి చెందిన రైతు బిడ్డ సర్నాల తిరుపతిరావును వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సీఎం జగన్ ఎంపిక చేశారు. మైలవరంలో తిరుపతి రావు ప్రజా సమస్యల పరిష్కారానికి చూపుతున్న చొరవను గమనించిన సీఎం జగన్.. మొన్నటి ఎన్నికల్లో జడ్పీటీసీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. జెడ్పీటీసీ సభ్యుడిగా అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన తిరుపతిరావు.. జనంతో మమేకమవుతూ వారి సమస్యలు పరిష్కరిస్తున్నారు. ఇదే ఆయనను మైలవరం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎంపిక చేయానికి దారితీసింది.

నరసాపురం ఎంపీ స్థానంలో..

నరసాపురం లోక్‌సభ స్థానం నుంచి కోటీశ్వరులను రాజకీయ పార్టీలు బరిలోకి దించడం రివాజు. ఆ లోక్‌సభ స్థానం అభ్యర్థిగా గూడురి ఉమాబాలను సీఎం వైఎస్ జగన్ ప్రకటించగానే రాష్ట్రం యావత్తు ఆశ్చర్యపోయింది. బీసీ వర్గంలోని శెట్టి బలిజ సామాజిక వర్గానికి చెందిన కుటుంబం నుంచి వచ్చిన న్యాయవాది ఉమాబాల. వైఎస్సార్‌సీపీలో సాధారణ కార్యకర్తగా చేరిన ఆమె ప్రజా సమస్యల పరిష్కారంలో దూసుకుపోతూ అంచలంచెలుగా ఎదిగారు. జనబలమే గీటురాయిగా ఉమాబాలను నరసాపురం లోక్‌సభ అభ్యర్థిగా సీఎం జగన్ ఎంపిక చేశారు. ఆ స్థానం నుంచి బరిలోకి దించేందుకు వేల కోట్లకు పడగలెత్తిన కోటీశ్వరుల కోసం చంద్రబాబు వెంపర్లాడుతున్నారు.

చిలకలూరిపేటలో నిబద్ధతగల కార్యకర్త పోటీ

గుంటూరుకు చెందిన కావటి మనోహర్‌నాయుడు కాపు సామాజిక వర్గానికి చెందిన కుటుంబం నుంచి వచ్చారు. వైఎస్సార్‌సీపీలో సాధారణ కార్యకర్తగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీ లేని పోరాటాలు చేస్తుండటాన్ని పసిగట్టిన సీఎం జగన్.. మొన్న మున్సిపల్ ఎన్నికల్లో గుంటూరు కార్పొరేషన్‌లో కార్పొరేటర్ టికెట్ ఇచ్చారు. అత్యధిక మెజార్టీతో కార్పొరేటర్‌గా ఎన్నికైన మనోహర్ నాయుడు నిబద్ధత, అంకిత భావం చూసి ఆయన్ను గుంటూరు కార్పొరేషన్ మేయర్‌గా చేశారు. మేయర్‌గా రాణిస్తూ అన్ని వర్గాల ప్రజల నుంచి ప్రశంసలు అందుకుంటుండటంతో చిలకలూరిపేట నియోజకవర్గం అభ్యర్థిగా అవకాశం కల్పించారు. ఈ స్థానం నుంచి 2014–19 మధ్య మంత్రిగా పనిచేసి, అక్రమార్జన ద్వారా వందల కోట్లు కాజేసిన పత్తిపాటి పుల్లారావును టీడీపీ అభ్యర్థిగా చంద్రబాబు బరిలోకి దించడం గమనార్హం.

ఉపాధి కూలీ.. టిప్పర్ డ్రైవర్‌లకు అవకాశం

- శ్రీసత్యసాయి జిల్లా గుడిబండ మండలం ఫళారం గ్రామానికి చెందిన ఈర లక్కప్ప బీఏ వరకు చదువుకున్నారు. ఎస్సీ వర్గానికి చెందిన ఇతను అవివాహితుడు. ప్రభుత్వం ఇచ్చిన రెండు గదుల ఇంట్లో తన తల్లితో కలిసి నివసిస్తున్నారు. ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తూ వచ్చే కూలీతో తన తల్లి కడుపు నింపుతున్న ఈర లక్కప్ప.. మండల కేంద్రం గుడిబండకు వివిధ సమస్యలపై వచ్చే ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల వద్ద అర్జీలు రాసి ఇస్తూ.. వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీలో 2015లో చేరిన ఇతని సేవా భావాన్ని గమనించిన సీఎం వైఎస్ జగన్.. మడకశిర నియోజకవర్గం అభ్యర్థిగా ఎంపిక చేశారు. ఉపాధి హామీ కూలీని అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దించుతూ సీఎం వైఎస్ జగన్ తీసుకున్న సాహసోపేత నిర్ణయంపై దేశ వ్యాప్తంగా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.
- అనంతపురం జిల్లా శింగనమల మండలం బండమీదపల్లికి చెందిన మన్నెపాకుల వీరాంజనేయులు ఎస్సీ కుటుంబానికి చెందిన వారు. ఏంఏ వరకు చదువుకున్న ఇతను టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ సాధారణ కార్యకర్త ఈయన కరోనా సమయంలో ప్రజలకు సహాయం చేయడంలో చూపిన నిబద్ధతను గుర్తించిన సీఎం వైఎస్ జగన్.. శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎంపిక చేశారు.

స్థానిక సంస్థల నుంచి చట్టసభలకు..

- కర్నూలు జిల్లా చిప్పగిరి మండలంలో వైఎస్సార్‌సీపీ సాధారణ కార్యకర్త అయిన బుసినే విరూపాక్షి బీసీ వర్గంలో బోయ సామాజిక వర్గానికి చెందిన రైతు బిడ్డ. నిబద్ధత, నిజాయితీ, సేవా భావాన్ని గమనించి మొన్నటి జెడ్పీటీసీ ఎన్నికల్లో ఆ మండలం నుంచి అభ్యర్థిగా విరూపాక్షిని సీఎం జగన్ బరిలోకి దించారు. అత్యధిక మెజార్టీతో జెడ్పీటీసీగా ఎన్నికైన ఆయన ప్రజా సమస్యల పరిష్కారంలో చూపుతున్న చొరవను గమనించి.. ఆలూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎంపిక చేశారు.
- కర్నూలు నగరానికి చెందిన బీవై రామయ్య బీసీ వర్గంలో బోయ సామాజిక వర్గానికి చెందిన రైతు బిడ్డ. వైఎస్సార్‌సీపీలో సాధారణ కార్యకర్త స్థాయి నుంచి అంచలంచెలుగా ఎదిగారు. ప్రజా సమస్యల పరిష్కారంలో బీవై రామయ్యకు ఉన్న చిత్తశుద్ధిని పసిగట్టిన సీఎం వైఎస్ జగన్.. మొన్న కర్నూలు నగర పాలక సంస్థకు జరిగిన ఎన్నికల్లో కార్పొరేటర్‌గా టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో గెలిచిన బీవై రామయ్యను కర్నూలు నగరానికి మేయర్‌గా చేశారు. మేయర్‌గా రాణిస్తూ అన్ని వర్గాల ప్రశంసలు అందుకుంటుండటంతో కర్నూలు లోక్‌సభ అభ్యర్థిగా ఎంపిక చేశారు.
- శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన పిరియా విజయ రైతు కుటుంబానికి చెందిన మహిళ. బీఏ చదువుకున్న ఆమె వైఎస్సార్‌సీపీలో సాధారణ కార్యకర్తగా రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆమె చూపుతున్న చిత్తశుద్ధిని గమనించిన సీఎం వైఎస్ జగన్.. మొన్న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీటీసీ టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంతో శ్రీకాకుళం జడ్పీ ఛైర్‌పర్సన్‌గా చేశారు. ఆ పదవిలో రాణిస్తున్న విజయను ఇప్పుడు ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎంపిక చేశారు.
- అరకు వ్యాలీ నియోజకవర్గానికి చెందిన రేగం మత్స్యలింగం ఉపాధ్యాయుడు. ప్రజా సేవలో ఆయనకున్న అంకిత భావాన్ని గమనించిన సీఎం జగన్.. మొన్నటి జడ్పీటీసీ ఎన్నికల్లో హుకుంపేట మండలం నుంచి బరిలోకి దించారు. ఆ ఎన్నికల్లో విజయం సాధించి.. ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవచూపుతుండటంతో అరకు వ్యాలీ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎంపిక చేశారు.
- ప్రకాశం జిల్లాలో వైఎస్సార్‌సీపీ సాధారణ కార్యకర్త అయిన దద్దాల నారాయణ యాదవ్‌కు మొన్న జరిగిన జెడ్పీటీసీ ఎన్నికల్లో సీఎం జగన్ అవకాశం కల్పించారు. జెడ్పీటీసీ సభ్యునిగా ఎన్నికైన నారాయణ యాదవ్ ప్రజా సేవలో చూపుతున్న అంకిత భావాన్ని గమనించి.. కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. ఈ నియోజకవర్గంలో కోట్లకు పడగలెత్తిన ముక్కు ఉగ్రనరసింహారెడ్డిని చంద్రబాబు బరిలోకి దించడం గమనార్హం.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గానికి చెందిన విప్పర్తి వేణుగోపాల్ ఎస్సీ కుటుంబానికి చెందిన వారు. వైఎస్సార్‌సీపీ సాధారణ కార్యకర్త అయిన ఇతను మొన్నటి జడ్పీ ఎన్నికల్లో జెడ్పీటీసీ సభ్యునిగా ఎన్నికయ్యారు. ఆ పదవిలో మంచి పనితీరు కనబరుస్తున్న వేణుగోపాల్‌ను పి.గన్నవరం నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా సీఎం జగన్ అవకాశం కల్పించారు.

వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అకాల వర్షాల మూలంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా డిమాండ్ చేశారు. రెండు, మూడు రోజులుగా అకాల వర్షాలు కురుస్తున్నా ప్రభుత్వం కనీసం స్పందించడం లేదన్నారు. రాజకీయాలు తప్ప రైతు ప్రయోజనాలు పట్టని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే మేల్కొని అన్నదాతకు అండగా నిలవాలని సూచించారు. గతంలో అకాల వర్షాలతో రైతులు నష్టపోయిన సందర్భంలో అప్పటి ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేల నష్ట పరిహారాన్ని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. నాటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్వయంగా రైతులను పరామర్శించి భరోసా కల్పించారని పేర్కొన్నారు. పంటలు చేతికందే సమయంలో కురిసిన వడగండ్ల వాన రైతులకు కన్నీరు మిగిల్చిందని హరీశ్ ఆవేదన వ్యక్తం చేశారు. వరి, మొక్కజొన్న, జొన్న పంటలతో పాటు బొప్పాయి, మామిడి సహా ఇతర ఉద్యాన పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. పంట నష్టాన్ని వెంటనే అంచనా వేయడంతో పాటు ఎకరాకు రూ.10 వేల నష్ట పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇద్దరు రైతుల ఆత్మహత్య

▶ మొదటి పేజీ తరువాయి

కూతురు పెళ్లికి తెచ్చిన అప్పు మిత్తి కలిపి రూ.12 లక్షల వరకు ఉంది. ఇటు పంట ఎండిపోవడం, అటు అప్పు తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపం చెందాడు. సోమవారం మధ్యాహ్నం చేలోకి వెళ్లిన సుధాకర్ ఎండిన పంటలను చూసి తీవ్ర మనోవేదనతో పురుగుల మందు తాగాడు. చుట్టు పక్కల రైతులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వెంటనే వారు అక్కడకు వెళ్లి చూడగా.. అప్పటికే సుధాకర్ మృతి చెందాడు. మంగళవారం మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.

పొలానికి వెళ్లొస్తానని చెప్పి...

ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం బరంపూర్ గ్రామానికి చెందిన కాకర్ల ఆశన్న (43)కు రెండెకరాల 19 గుంటలతో పాటు తన భార్య సుచరిత పేరిట మూడెకరాల 30 గుంటల పొలం ఉంది. మొత్తం ఆరెకరాల్లో వ్యవసాయం చేస్తున్నాడు. ఈ సీజన్‌లో అందులో పత్తి, కంది పంటలు సాగు చేశాడు. పత్తి పెట్టుబడి కోసం ఆదిలాబాద్‌లోని ఎస్‌బీఐలో భార్యాభర్తల ఇద్దరు పేరుమీద రూ.4లక్షలు, ప్రైవేట్ వ్యక్తుల నుంచి మరో రూ.4లక్షలు అప్పు తీసుకున్నాడు. ఈ దంపతులిద్దరికీ ఇద్దరు సంతానం. కుమార్తె డిగ్రీ, కుమారుడు తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఇటీవలే కుమార్తెకు పెళ్లి సంబంధాలు కూడా వస్తున్నాయి. ఈ క్రమంలో పంట దిగుబడి సరిగా రాక, తెచ్చిన అప్పు తీర్చే దారిలేక మనస్తాపం చెందిన ఆశన్న మంగళవారం ఉదయం పొలానికి వెళ్లొస్తానని చెప్పి ఇంటినుంచి బయల్దేరాడు. అక్కడే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా...వారు అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే ఆశన్న మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఊయలతో సహా ఎగిరిపడి..

▶ మొదటి పేజీ తరువాయి

20 మీటర్ల దూరంలో ఉన్న మరో డాబా ఇంటిపై పడింది. దీంతో చిన్నారి తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు చికిత్స కోసం నర్సాపూర్ ప్రైవేట్ ఆసుపత్రికి, అనంతరం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మరో ఘటనలో.. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామానికి చెందిన మన్నె సత్తయ్య–రేణుక దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు అనిల్ గజ్వేల్‌లో ఐటీఐ చదువుతుండగా, రెండో కుమారుడు వెంకటేశ్ (15) పదో తరగతి చదువుతున్నాడు. ప్రస్తుతం పరీక్షలు రాస్తున్నాడు. రోజుమాదిరిగానే పొలం వద్ద ఉన్న పశువులను సాయంత్రం వేళ ఇంటికి తోలుకొని వస్తున్నాడు. ఈ క్రమంలో ఈదురు గాలుల ధాటికి రోడ్డుపక్కనున్న చెట్టుకొమ్మ విరిగి వెంకటేశ్‌పై పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిద్దిపేట జిల్లాలో దెబ్బతిన్న పంటలు



వెంకటేష్ (ఫైల్)



ట్రాక్టర్‌పై కూలిన వృక్షం

ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట): సిద్దిపేట జిల్లాలో మంగళవారం సాయంత్రం వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల మధ్యలో కురిసిన వర్షం పంటలను దారుణంగా దెబ్బతీసింది. పట్టణంలో అత్యధికంగా 17 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, జిల్లా వ్యాప్తంగా 90.6 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, వరి, మామిడి, కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. గాలి దుమరానికి చెట్లు విరిగి ఇళ్లపై, వాహనాలపై పడి తీవ్ర ఆస్తి నష్టాన్ని కలిగించాయి. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే హరీశ్‌రావులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

'పచ్చ' ముసుగుతో 'కోడ్'కూతలా?

- గతేడాది ఇచ్చిన పుస్తకాలపై ఇప్పుడు ఏడుపా!
- కోడ్ తర్వాత ఇచ్చే వాటిపైనే ఆంక్షలుంటాయని తెలియదా?
- ఎన్నికల సంఘంపైనే నిందలు
- నిబంధనలను పక్కాగా పాటించే ప్రభుత్వం ఇది
- ఏమైతేనేం 47 లక్షలమంది పిల్లలకు పుస్తకాలిచ్చినట్టు రామోజీ అంగీకారం
- ఇకపై విద్యార్థులకు చిక్కీలపై రేపర్ తొలగించి పంపిణీ

రగులుతున్న పొత్తు కుంపట్లు

టీడీపీ, జనసేన, బీజేపీ ఎవరికి వారే

- మిత్రధర్మాన్ని పాటించని మూడు పార్టీలు.. ఇంకా ఖరారు కాని చిత్తూరు ఎంపీ అభ్యర్థి
- కుప్పంలో చేతులెత్తేసిన తెలుగుదేశం క్యాడర్

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ప్రజలతో మమేకమవుతూ సీఎం జగన్ 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర

- ఇడుపులపాయ నుంచి ఉత్తరాంధ్ర వరకు విరామం లేకుండా బస్సు యాత్ర
- 27న ఇడుపులపాయ నుంచి ప్రారంభం
- తొలిరోజు ప్రొద్దుటూరులో భారీ బహిరంగ సభ.. 28న నంద్యాల, 29న కర్నూలు లోక్‌సభ నియోజకవర్గాల్లో యాత్ర
- నోటిఫికేషన్ తరువాత సీఎం జగన్ మలివిడత ప్రచారం
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి వెల్లడి



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం వివిధ వర్గాల ప్రజలతో మమేకమవుతూ, కార్యకర్తలను ఎన్నికల సంగ్రామానికి సన్నద్ధులను చేస్తూ 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర సాగుతుందని పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. సీఎం వైఎస్ జగన్ చేపట్టే 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఈ నెల 27వ తేదీన వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో ప్రారంభమై ఉత్తరాంధ్ర వరకు కొనసాగుతుందని తెలిపారు. 27న ఇడుపుల పాయలోని దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్ వద్ద సీఎం జగన్ నివాళులర్పిస్తారని, అనంతరం బస్సు యాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. యాత్రలో ప్రతి రోజూ ఉదయం వివిధ వర్గాల ప్రజలతో ముఖాముఖి (ఇంటరాక్షన్), సాయంత్రం భారీ బహిరంగ సభ కామన్‌గా ఉంటాయని తెలిపారు. ఆయన మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో జరిగే తొలి మూడు రోజుల బస్సు యాత్ర షెడ్యూల్‌ను విడుదల చేశారు. తర్వాత జరగబోయే యాత్ర వివరాలు త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. సిద్ధం సభలు జరిగిన నాలుగు నియోజకవర్గాలు పోను మిగిలిన నియోజకవర్గాలన్నింటిలో బస్సు యాత్ర జరుగుతుందన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్ర తరహాలోనే బస్సు యాత్ర కూడా జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే (సుమారు ఏప్రిల్ 18వ తేదీ) వరకు సీఎం జగన్ విరామం లేకుండా పూర్తిగా యాత్రలోనే ఉంటారని, పండుగలు, సెలవుల్లోనూ యాత్ర కొనసాగుతుందని చెప్పారు. నోటిఫికేషన్ వచ్చాక సీఎం జగన్ మలివిడత ఎన్నికల ప్రచారం చేస్తారని తెలిపారు. ఎంత మంది కూటమి కట్టినా తమ బ్రాండ్ సీఎం జగనే అన్నారు. అన్ని రకాల శక్తులు, ప్రత్యర్థులు ఏకమై వస్తున్నారని, వారందరినీ తాము ఒంటరిగానే ఎదుర్కొంటున్నామని తెలిపారు.

సీఎం జగన్ 'మేమంతా సిద్ధం' తొలి 3 రోజుల యాత్ర ఇలా..

27వ తేదీ (తొలి రోజు యాత్ర): ఉదయం ఇడుపులపాయలో మహానేత వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులు. అనంతరం యాత్రకు శ్రీకారం.

సాయంత్రం ప్రొద్దుటూరులో తొలి 'మేమంతా సిద్ధం' భారీ బహిరంగ సభ.

28వ తేదీ (రెండో రోజు) : ఉదయం నంద్యాల లేదా ఆళ్లగడ్డలో వివిధ వర్గాల ప్రజలతో ముఖాముఖి.

సాయంత్రం నంద్యాలలో భారీ బహిరంగ సభ.

29వ తేదీ (మూడో రోజు): కర్నూలు పార్లమెంటులోకి ప్రవేశిస్తారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో ముఖాముఖి. సాయంత్రం ఎమ్మిగనూరులో భారీ బహిరంగ సభ.

నేడు, రేపు కోస్తాంధ్రలో వానలకు ఆస్కారం

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో రానున్న రెండు రోజులు వర్షాలు కురవడానికి పరిస్థితులు అనుకూలంగా మారాయి. దక్షిణ తమిళనాడు నుంచి పశ్చిమ విదర్భ వరకు ఉన్న ద్రోణి సముద్రమట్టం నుంచి 1.5 కి.మీల ఎత్తు వరకు విస్తరించి ఉంది. ఇది దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి పశ్చిమ విదర్భ పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం వరకు కొనసాగుతోంది. జార్ఖండ్ నుంచి ఒడిశా మీదుగా ఉత్తర కోస్తాంధ్ర వరకు ఉన్న ద్రోణి బలహీన పడింది. వీటి ప్రభావంతో బుధ, గురువారాల్లో ఉత్తర కోస్తాంధ్రలో కొన్నిచోట్ల, దక్షిణ కోస్తాంధ్రలో ఒకట్రెండు చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) మంగళవారం తెలిపింది. బుధవారం అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలకు ఆస్కారం ఉందని పేర్కొంది. రాయలసీమ జిల్లాల్లో వేడి, ఉక్కపోతతో అసౌకర్య వాతావరణం ఉంటుందని తెలిపింది. ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రల్లో రానున్న 2 రోజులు వర్షాలకు ఆస్కారం ఉంటుందని వెల్లడించింది.

చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్ విచారణ వాయిదా

ఏప్రిల్ 16న విచారణ జరుపుతామన్న సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలంటూ ఏపీ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ పిటిషన్ మంగళవారం కోర్టు సమయం ముగిసే సమయానికి కొద్దిసేపు ముందుగా జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. ఏపీ సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ వాదనలు ప్రారంభిస్తూ.. సమయం కొద్దిగానే ఉందని, అయితే వాదనలు వినిపించడానికి సమయం పడుతుందని పేర్కొన్నారు. సోమవారం నుంచి వారం రోజులపాటు హోలీ సెలవులు ముగిసిన అనంతరం విచారణ చేస్తామని ధర్మాసనం పేర్కొంది. స్పష్టమైన తేదీ తెలపాలని రంజిత్‌కుమార్ ధర్మాసనానికి విజ్ఞప్తి చేయగా.. ఏప్రిల్ 16న విచారణ చేపడతామని ధర్మాసనం పేర్కొంది.

ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి

- మృతుల్లో ఇద్దరు డీవీసీఎంలు, ఇద్దరు ప్లాటూన్ సభ్యులు
- మంచిర్యాల కుమురంభీం కమిటీకి గట్టి దెబ్బ
- మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాలో ఘటన



వర్గీశ్   మృతి చెందిన మావోయిస్టులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు గడ్చిరోలి జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భద్రత బలగాలు తనిఖీలు ముమ్మరం చేశాయి. ఈ నేపథ్యంలో మావోయిస్టులు తెలంగాణ నుంచి ప్రాణహిత నది దాటి మహారాష్ట్రలోకి అడుగు పెడుతున్నారనే సమాచారం మేరకు కూంబింగ్ చేపట్టారు. మంగళవారం తెల్లవారుజామున అహెరి తాలూకా కొలమార్క కొండలకు ఐదు కిలోమీటర్ల దూరంలో రేపన్‌పల్లి శివారు అడవుల్లో అదనపు ఎస్పీ యతీశ్ దేశ్‌ముఖ్ నేతృత్వంలో సీ60, సీఆర్‌పీఎఫ్ క్యూఏటీ(క్విక్ యాక్షన్ టీం) గాలిస్తుండగా, ఎదురుపడిన మావోయిస్టు బృందం వీరిపై కాల్పులు జరిపింది. దీంతో భద్రత బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. కాల్పుల్లో మంచిర్యాల కుమురం భీం కమిటీ సభ్యుడు, డివిజనల్ కమిటీ మెంబర్ (డీవీసీఎం), మంగి–ఇంద్రవెల్లి ఏరియా కమిటీ కార్యదర్శిగా ఉన్న వర్గీశ్ కోయ అలియాస్ మంగులు, డీవీసీఎం, సిర్పూర్–చెన్నూరు ఏరియా కమిటీ కార్యదర్శి మంగ్తూ, ప్లాటూన్ సభ్యులు కుర్సాంగ్ రాజు, కుడిమెత వెంకటేశ్ చనిపోయినట్లు గుర్తించారు. ఘటనా స్థలంలో ఒక ఏకే–47, ఒక కార్బైన్, రెండు దేశీ పిస్తోళ్లు, విప్లవ సాహిత్యం స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. మృతులు నలుగురిపై మహారాష్ట్ర ప్రభుత్వం గతంలో రూ.36 లక్షల రివార్డు ప్రకటించింది.

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు మావోలు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో మంగళవారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. జిల్లా ఎస్పీ గౌరవ్‌రాయ్ తెలిపిన వివరాల ప్రకారం... దంతెవాడ – బీజాపూర్ జిల్లాల సరిహద్దు ప్రాంతం, కిరండోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పురంగేల్, గంపూర్ గ్రామాల సమీప అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో బలగాలు అప్రమత్తమయ్యాయి. దంతెవాడ జిల్లాకు చెందిన డీఆర్‌జీ, బీఎఫ్‌ఆర్, సీఆర్‌పీఎఫ్ 111, 230, 231 బెటాలియన్లకు చెందిన దళాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో పురంగేల్ అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు (ఒక పురుషుడు, ఒక మహిళ) మృతి చెందారు. వీరి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనా ప్రాంతం నుంచి రెండు తుపాకులు, మందుగుండు సామగ్రి, నిత్యావసర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎదురుకాల్పుల్లో 20 నుంచి 25 మంది మావోయిస్టులు పాల్గొన్నట్లు తెలుస్తుండగా.. తప్పించుకున్న వారి కోసం బీజాపూర్, దంతెవాడ, సుకుమా జిల్లాల నుంచి అదనపు బలగాలను రప్పించి కూంబింగ్ ముమ్మరం చేశారు.

మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ

సాక్షిప్రతినిధి, వరంగల్: సీపీఐ (మావోయిస్టు) పార్టీకి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ల సరిహద్దులోని గడ్చిరోలి జిల్లాలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆ పార్టీ కీలక నేతలు నలుగురు హతమైన విషయం తెలిసిందే. మహారాష్ట్ర సరిహద్దు అటవీ ప్రాంతాల్లో రెండు నెలలుగా తెలంగాణ రాష్ట్ర కమిటీ నేతృత్వంలో ఇటీవల సాయుధ దళాల సంచారం పెరిగినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు గుర్తించాయి. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వారం క్రితం రెండు రాష్ట్రాల్లో విస్తరించిన వివిధ మావోయిస్టు ఏరియా కమిటీలకు చెందిన 40 మంది సమావేశమైనట్టు కూడా ప్రచారం జరిగింది. తెలంగాణ సరిహద్దు నుంచి మహారాష్ట్రలోకి ప్రవేశించారన్న పక్కా సమాచారంతో 'కోలమార్క' గుట్టల సమీపంలో మావోయిస్టుల కదలికలను కనిపెట్టిన పోలీసులు కూంబింగ్ ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే ఎన్‌కౌంటర్ జరిగింది.

భిన్న ఉపాధి

తొలి మహిళా షిప్ సర్వేయర్



స్త్రీలు సముద్రయానంలో పని చేయడానికి వెనుకాడతారు. సముద్రం మీదకు వెళ్లడానికి ధైర్యమున్నా కుటుంబాలు అంగీకరించవు. కాని పూజా ఛతోత్ దేశంలో మొదటి మహిళా షిప్ సర్వేయర్ కాగలిగింది. ఒక షిప్ తయారీ మొదలైనప్పటి నుంచీ అది సముద్రం మీద చేసే ప్రయాణం వరకూ అన్ని ప్రమాణాలు పాటించేలా చూసే ఉద్యోగమే షిప్ సర్వేయర్. పూజా ఛతోత్ పరిచయం.

భారీ నౌక ప్రయాణిస్తూ ఉంటుంది. కనుచూపు మేరా నీలి రంగు సముద్రం తప్ప వేరే ఏమీ ఉండదు. ఉప్పునీటి గాలులు ముఖాన తాకుతుంటాయి. ఆ నౌక సముద్రయానానికి సురక్షితం అనే ఆమోదం తెలిపిన షిప్ సర్వేయర్ డెక్ మీద నిలబడి డ్యూటీ సమర్థంగా చేస్తున్నాననే తృప్తితో చిరునవ్వు చిందిస్తూ ఉంటే ఎలా ఉంటుంది? పూజా ఛతోత్‌ను అడగాలి.

ఆమె ఇప్పుడు బ్రిటన్‌కు చెందిన ప్రఖ్యాత సముద్రయాన సంస్థ 'లాయెడ్స్ రిజిస్టర్'లో షిప్ సర్వేయర్‌గా పని చేస్తోంది. ఇతర దేశాలలో షిప్ సర్వేయర్లుగా మహిళలు ఇదివరకే పని చేస్తున్నా మన దేశంలో పూజా ఛతోత్ మాత్రమే తొలి మహిళా సర్వేయర్ కాగలిగింది.

చిన్నప్పటి ప్రభావం

పూజా ఛతోత్‌ది కేరళలోని కన్నూర్ జిల్లా. అక్కడి 'ఎజిమల' అనే చోట ఆసియాలోనే అతి పెద్దదైన భారత నావెల్ అకాడెమీ ఉంది. నావెల్ కేడెట్‌ల శిక్షణ అక్కడే జరుగుతుంది. బాల్యంలో తల్లిదండ్రులతో కలిసి అకాడెమీని సందర్శించిన పూజా శిక్షణలో ఉన్న నావెల్ కేడెట్‌లను చూసి స్ఫూర్తి పొందింది. ముఖ్యంగా చాలామంది పురుష కేడెట్‌ల మధ్య ఒకే ఒక మహిళా ఆఫీసర్‌ను చూసింది పూజ. అప్పుడే ఆ ఆఫీసర్‌లాగానే తానూ సముద్రం మీద పని చేసే ఉద్యోగం చేయాలని అనుకుంది. 'నేను హైస్కూల్ చదువుతున్నప్పుడే అనుకున్నాను ఆఫీసులో ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు వరకు పని చేసే ఉద్యోగం చేయకూడదని' అంది పూజ.

నావెల్ ఆర్కిటెక్చర్ చదివి...

సముద్రయాన రంగంలో పని చేయాలనుకున్నది పూజ. కొచ్చిలో నావెల్ ఆర్కిటెక్చర్‌ను 2020లో పూర్తి చేసింది. ఆ తర్వాత ఒక మెరైన్ కంపెనీలో ట్రయినీ నావెల్ ఆర్కిటెక్ట్‌గా చేరింది కాని ఆ పని రుచించలేదు. సముద్రపుగాలి తగలాలి అనుకుంది. ఆ సమయంలోనే తండ్రి స్నేహితుడొకడు షిప్ సర్వేయర్ ఉద్యోగం గురించి తెలిపాడు. అయితే ఆ రంగంలో స్త్రీలు ఇప్పటి దాకా లేరు. 'నువ్వు మొదటిదానివి ఎందుకు కాకూడదు' అన్నాడు తండ్రి. ఆ ప్రోత్సాహంతో లాయెడ్స్ రిజిస్టర్‌లో షిప్ సర్వేయర్‌గా ఉద్యోగం సంపాదించింది పూజ.

రెండేళ్ల శిక్షణ

షిప్ సర్వేయర్ మానసిక బలం, శారీరక సామర్థ్యం అవసరమయ్యే ఉద్యోగం. నౌక తయారవుతున్నప్పటి నుంచి సముద్రం మీదకు చేరే వరకూ చేరాక కూడా అన్ని నిర్మాణ, సాంకేతిక విభాగాలూ నిర్ణీత ప్రమాణాలు పాటిస్తున్నాయా లేదా చూడటమే ఈ ఉద్యోగం. నేల మీదా, సముద్రం మీదా పని ఉంటుంది. ఇందుకు కఠినమైన శిక్షణ అవసరం. లాయెడ్స్ రిజిస్టర్ సంస్థ ఆమెకు రెండేళ్ల శిక్షణ ఇచ్చింది. నౌకను తయారు చేసే మెటీరియల్ సర్వే శిక్షణ ముంబైలో తీసుకుంటే తయారీ విధానం సర్వే శిక్షణ కొచ్చిలో, గోవాలో తీసుకుంది. టెక్నికల్ శిక్షణ అంతా వైజాగ్, సింగపూర్‌లలో జరిగింది. రెండేళ్ల మొత్తం శిక్షణను సమర్థతతో పూర్తి చేయడం వల్ల ఇటీవల ఆమె షిప్ సర్వేయర్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు తీసుకుంది.

పూజను చూసి మరెందరో యువతులు ఈ రంగంలోకి వస్తారు. ఏ రంగమూ మగవారి స్వీయసామ్రాజ్యం కాదని నిరూపిస్తారు.

సేవ

పది రూపాయలతో ప్రారంభం..



మనం ఒక్కరమే బాగుంటే సరిపోదు...
మనతో పాటు మన చుట్టూ
ఉన్నవారూ బాగుండాలి
అనే ఆలోచన ఇండోర్‌వాసి కుక్కు ద్వివేదినిది.
ఆపదలో ఉన్నవారికి
చిన్న సాయమైనా చేయాలి అనే ఆశయంతో
బ్యాంకు ఉద్యోగం చేస్తూ,
కుటుంబ నిర్వహణను చూస్తూనే
పేదలకు కావల్సిన మందులను
ఉచితంగా పంపిణీ
చేయాలనుకుంది. అందుకోసం
400 మంది సహోద్యోగుల జీతంలో
ఒక్కొక్కరి నుంచి
పదేసి రూపాయలను సేకరించి,
ఆ మొత్తంతో ఉచిత మందుల పంపిణీని
మొదలుపెట్టింది. పాతికేళ్లుగా
సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది.
బ్యాంకు ఉద్యోగం నుంచి
వీఆర్ఎస్ తీసుకొని గ్రామాలు తిరుగుతూ
ఉచిత విద్య, వైద్యసేవలను అందిస్తూ
అందరికీ స్ఫూర్తిగా నిలుస్తోంది.

''నా బాల్యం అందమైన జ్ఞాపకాలతో గడిచింది. మా నాన్న డాక్టర్. నలుగురికి సాయం చేసే స్వభావం కావడంతో ఆయన సాయం కోసం, వైద్యం కోసం ఇంటికి ఎప్పుడూ అనేకమంది వస్తూ ఉండేవారు. వారి కోసం అమ్మ ప్రతిరోజూ వంట చేసి ఉంచేది. అది చూస్తూ పెరగడం వల్ల కాబోలు చిన్నప్పటి నుంచి ఎవరైనా సాయం అడిగితే కాదనే గుణం నాకు లేదు. ఇలా ఉచితంగా చేసే సాయాలను సామాజిక సేవ అంటారని కూడా తెలియకుండానే పదిమందికీ చేతనైన సాయం చేసేదాన్ని.

జీవించడానికి తక్కువ వస్తువులు చాలు

డిగ్రీ పూర్తవుతూనే తొలి ప్రయత్నంలోనే బ్యాంకు ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంలో చేరినప్పటినుంచి ఇతరులకు నా అంతట నేనే సాయం చేయగలిగే అవకాశం వచ్చిందని సంతోషించాను. పెళ్లయ్యాక నా భర్త మద్దతు లభించింది. నా భర్త కూడా బ్యాంకు ఉద్యోగి. ఇద్దరి సంపాదన ఉన్నా మా ఇంట్లో తక్కువ వస్తువుల వినియోగం ఉండేది. నిరాడంబరంగా జీవించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. మా ఇంటి పరిసరాల్లోని అమ్మాయిల చదువుకు సాయం చేసేదాన్ని.

పేదలకు అందని వైద్యం

ఉద్యోగం చేస్తున్న రోజుల్లోనే నా కూతురు తీవ్ర అనారోగ్యానికి గురైంది. నా కుమార్తెకు చికిత్స జరుగుతున్నప్పుడు వైద్యం ఎంత ఖరీదైనదో తెలుసుకున్నాను. అంతటి ఖర్చు మేం ఎలాగో భరించగలిగాం. కానీ, రెండు పూటలా తిండికే నోచుకోని వారి సంగతేంటి? వారికి చికిత్స అవసరమైతే ఏం చేస్తారు? ఈ విషయం పదే పదే ఆలోచించేదాన్ని. ఒంటరిగా చేయడంలో పెద్ద సాయాన్ని అందివ్వలేనని గ్రహించాను. దీంతో నా సహోద్యోగుల సాయం తీసుకోవాలనుకున్నాను.

పది రూపాయలతో ప్రారంభం...

మా బ్యాంకు యూనియన్ లీడర్‌కు ఈ విషయాన్ని చెప్పాను. 'మా అందరికీ మంచి జీతం ఉంది. పేద ప్రజల కోసం ఏదైనా సహాయం చేయాలి' అని వివరించాను. దాదాపు ముప్పై ఏళ్ల క్రితం ఆలోచన ఇది. ప్రతి ఉద్యోగీ, తన జీతం నుంచి పది రూపాయలను 'సేవ' కోసం కేటాయించాలనే నిర్ణయం తీసుకున్నారు. అలా నెలకు నాలుగు వేల రూపాయలు జమ అయ్యేవి. పాతిక వేలు జమ కాగానే మా యూనియన్ లీడర్ 'ఏం చేయాలో చెప్పమ'ని అడిగారు.

గంట సమయం సద్వినియోగం

అలా జమ అయిన డబ్బుతో పేద ప్రజలకు వైద్యం, విద్యలో సాయం చేయాలనే విషయాన్ని చెప్పాను. సేవా కార్యక్రమాలకు సమయాన్ని ఎలా కేటాయిస్తారు అని అడిగారు. ఎందుకంటే మాది ఉమ్మడి కుటుంబం. పిల్లల సంరక్షణ ఎలా సాధ్యమవుతుందని అడిగి, ఆఫీస్ టైమింగ్స్ నుండి గంట ఆలస్యంగా రావడానికి పర్మిషన్ ఇస్తామన్నారు. ఆఫీసు టైమ్‌కి ఇంటినుండి బయల్దేరి ఇండోర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లడం, అక్కడ అన్ని డిపార్ట్‌మెంట్లు చూసి, ఎక్కడ సాయం అవసరం ఉందో చూసి, సేవా కార్యక్రమాలను మొదలుపెట్టాను. ఈ క్రమంలో జూనియర్ డాక్టర్లతో పరిచయాలు ఏర్పడ్డాయి. మెడికల్ కంపెనీ ప్రతినిధులు వచ్చినప్పుడు వారి దగ్గర నుంచి శాంపిల్స్ సేకరించడం కూడా మొదలైంది. ఏ మందు దేనికి వాడాలో వచ్చిన వారికి చెప్పి ఇవ్వడానికి, అక్కడే ఒక కాంపౌండర్‌ను కూడా నియమించాం.



హఠాత్పరిణామాలు

బ్యాంకు నిధులే కాకుండా విరాళం పేరుతో సాయం చేయడానికి కొంతమంది దాతలు ముందుకు వచ్చారు. పదేళ్ల పాటు ఈ విధమైన సేవాకార్యక్రమాలు బాగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో నా భర్త హఠాత్తుగా చనిపోయాడు. దీంతో నేను చాలా రోజులు డిస్టర్బ్ అయ్యాను. ఆ రోజుల్లో మా సహోద్యోగులు కూడా మరింత సాయం అందించడానికి ముందుకు వచ్చారు. దీంతో రిలీఫ్ సొసైటీగా పేరు మార్చాం. ఎందుకంటే ఇందులో బయటి వ్యక్తులు చేరడం మొదలుపెట్టారు. రూపాయ నుంచి లక్షల రూపాయల విలువైన మందులు వస్తున్నాయి.

పేదలకోసం పాఠశాల

జబ్బులు వచ్చి, చికిత్సలో ఉన్న రోగులకు మందులు ఇవ్వడం ద్వారా సాయం చేస్తున్నాం. కానీ, జబ్బులు రాకుండా అవగాహన కల్పించాలంటే చదువు ఉండాలనుకున్నాం. సరైన చదువు ఉంటే ముందస్తు జాగ్రత్తలు కూడా తీసుకోగలరు. ఈ ఆలోచనతో సైన్యంలో వైద్య సేవలు అందించే మా స్నేహితురాలు డాక్టర్ అనురాధతో కలిసి గిరిజన పిల్లలకు చదువులు చెప్పడం ప్రారంభించాం. ఇండోర్‌కు మూడు గంటల ప్రయాణం దూరంలో ఉన్న ఖర్గోన్‌లో సంస్థకు ధర్మకర్తగా ఉంటూ అనురాధతో పాటు కలిసి కార్యక్రమాలు నిర్వహించేదాన్ని. అక్కడే 12 ఎకరాల్లో పాఠశాల, హాస్టల్ కూడా నిర్మించాం. నా స్నేహితురాలి హఠాన్మరణంతో నేను బ్యాంకు ఉద్యోగం నుంచి వీఆర్ఎస్ తీసుకొని స్కూల్ బాధ్యతలు చూసుకోవడానికి వచ్చేశాను.

మొదట ఎనిమిది, పది మంది పిల్లలతో ప్రారంభించిన స్కూల్‌లో ఇప్పుడు 200 మంది పిల్లలు చదువుతున్నారు. వీరిలో 35 మంది వికలాంగులు. ఇప్పటికీ గ్రామంలో బాల్య వివాహాలు చేస్తుంటారు. దీంతో వారు చదువులు మానేసి వ్యవసాయం చేస్తుంటారు. పెద్దలకు అవగాహన కల్పించి, పిల్లలను స్కూల్‌కు తీసుకు రావడం పెద్ద యుద్ధమే అవుతుంటుంది' అంటూ తాము చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు ద్వివేదిని.

శీతల పంటలు



కేయా సాలోత్



ఉష్ణోగ్రతలు తగ్గించే పైకప్పు



రాస్ప్ బెర్రీ



బ్లూ బెర్రీ

మన నేలమీద పండిద్దాం

విదేశీయుల వ్యాపార రహస్యం, మార్కెట్ మాయాజాలం ఒకటి ఉంటుంది. ఒక ఉత్పత్తి మార్కెట్‌లోకి విడుదలయ్యే లోపు దాని గురించి ఒక సదభిప్రాయాన్ని కలిగించే ప్రచారం మొదలవుతుంది. ఆ ప్రమోషన్ ఆధారంగా సదరు ఉత్పత్తికి మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ పెరిగిపోతుంది. వాళ్ల బుట్టలో పడేవరకు మనకు ఆ మాయాజాలం అర్థం అయ్యేది కాదు. అర్థమయ్యే లోపు సదరు ఉత్పత్తిని వాడడానికి అలవాటు పడిపోయేవాళ్లం. ఆలా ఆయా ఉత్పత్తుల దిగుమతికి రహదారి పడుతుంటుంది. నిజానికి భారతదేశం నేల మీద పండని పంట ఉంటుందా అనుకుంది కేయా సాలోత్. అమెరికా, రష్యా, మెక్సికో, పోలండ్ దేశాల్లో పండే రాస్ప్‌బెర్రీ, బ్లాక్‌బెర్రీ, బ్లూ బెర్రీ, క్రాన్‌బెర్రీ... పంటలను మన నేల మీద పండించి చూపించాలనుకుంది. ఆ పంటలకు అనుగుణమైన ఉష్ణోగ్రతలను మెయింటెయిన్ చేసింది. మంచి దిగుబడిని సాధిస్తోంది.

హై బుష్ కౌన్సిల్ ప్రకటన!

''మన దేశం నుంచి ఇండియా దిగుమతి చేసుకున్న కూరగాయలు, పండ్ల విలువ ఏడాదికి ముప్పై శాతం చొప్పున తగ్గిపోతోంది. మనకిది ఏ మాత్రం అభిలషణీయమైన లావాదేవీ కానేరదు. ఇండియా మార్కెట్ అవసరాలను పెంచడానికి ప్రయత్నించడం వల్ల ప్రయోజనం కూడా ఉండదు. ఎందుకంటే ఇండియా తనంతట తానుగా ఈ పంటలను పండించుకుంటోంది. స్థానికంగా పండించుకోవడం వల్ల బయటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటే అయ్యే ఖర్చుతో పోలిస్తే చాలా తక్కువ ధరకు దొరుకుతున్నాయి'' అని యూఎస్ హైబుష్ బ్లూ బెర్రీ కౌన్సిల్ ప్రతినిధి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ పంటలను పండించడంలో కేయా సాలోత్, ఆమె బాటలో మరికొంత మంది చిన్నరైతులు విజయవంతమైనట్లు చెప్పడానికి ఈ ప్రకటనే నిదర్శనం.

దిగుబడికి ముందే ఆర్డర్‌లు!

ఇంతకీ కేయాసాలోత్ అనతికాలంలోనే సక్సెస్ సాధించడానికి ఆమెకు వ్యవసాయ నేపథ్యం ఏ మాత్రం లేదు. ఆమె ముంబయిలో పుట్టి పెరిగింది. న్యాయశాస్త్రం చదివి లాయర్‌గా ప్రాక్టీస్ చేసింది. తన జ్ఞానాన్ని క్లయింట్‌లను కాపాడడం కోసం వినియోగించడం కంటే అంతకంటే మెరుగైన కారణం కోసం పని చేస్తే బావుణ్నని కోరుకుంది. అప్పుడు ఆమె దృష్టి మనదేశంలోకి అమెరికా, రష్యా, పోలండ్, మెక్సికో, సెర్బియా వంటి శీతల దేశాల నుంచి మనదేశానికి వస్తున్న రాస్ప్‌బెర్రీ, బ్లూ బెర్రీల మీద కేంద్రీకృతమైంది. మనం తినడానికి ఇష్టపడుతున్న పండ్లను మనం పండించుకోలేమా అని ప్రయోగం మొదలు పెట్టింది. ఇందుకోసం ఆమె మహారాష్ట్రలో ఏ ప్రదేశమైతే ఈ పంటలకు అనువుగా ఉంటుందోనని అధ్యయనం చేసింది. ఈ పంటలు పండే దేశాలకు వెళ్లి వారు అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలించింది. తిరిగి ఇండియాకి వచ్చి ఇరవై ఎకరాల పొలంలో వ్యవసాయం మొదలుపెట్టింది. ఎండ, వర్షాలను తట్టుకునే విధంగా తెల్లటి పై కప్పుతో షెడ్ వేసింది. మొదటగా మైక్రోగ్రీన్స్‌తో మార్కెట్‌లోకి ప్రవేశించింది. కొత్తిమీర, మెంతి ఆకు వంటి స్వల్పకాల పంటలను రసాయన ఎరువులు లేకుండా పండించి రెస్టారెంట్‌లకు సప్లయ్ చేయడంతో అనతికాలంలోనే 50 మంది క్లయింట్‌లు వచ్చారు. రాబోయే కాలంలో తమ పొలం నుంచి ఫలానా పంటలు అందుబాటులోకి వస్తాయని క్లయింట్‌లకు సమాచారం ఇవ్వడంతో ఆమెకు అడ్వాన్స్ బుకింగ్‌లు మొదలయ్యాయి. ఈ పండ్లు దిగుబడి సాధించేలోపు ఆమె మార్కెట్ వేదికను ఏర్పాటు చేసుకుందన్నమాట. రైతులందరూ వ్యవసాయం చేస్తారు. పంట పండించి కొనుగోలుదారుల కోసం ఎదురు చూస్తారు. దళారుల చేతిలో మోసపోతుంటారు. 32 ఏళ్ల కేయా సాలోత్ అనుసరించిన సక్సెస్ ఫార్ములా రైతులకు మార్గదర్శనం.



యూత్ పల్స్

నేడు వరల్డ్ హాపీనెస్ డే

లక్ష్యం ఉన్నచోట ఉత్సాహం... ఉత్సాహం ఉన్నచోట సంతోషం ఉంటాయి

సంతోషం సగం బలం అన్నారుగానీ నిజానికి అది సంపూర్ణ బలం. ఆ బలం ఉన్నచోటే ఆరోగ్యం ఉంటుంది. విజయం ఉంటుంది. డబ్బుతో కొనలేని 'సంతోషం' ఎవరూ చేరుకోలేని కీకారణ్యం కాదు. 'నేను సంతోషంగా ఉండాలనుకుంటున్నాను' అని మనసులో గట్టిగా అనుకొని ఒక అడుగు వేస్తే ఎన్నో దారులు కనిపిస్తాయి. సంతోష సామ్రాజ్యానికి దగ్గర చేస్తాయి.

'సక్సెస్‌తో సంతోషం రాదు. సంతోషంతో సక్సెస్ వస్తుంది' అనే పాతతరం మాటకు కొత్త తరం విలువ ఇస్తోందిప్పుడు. నిరంతరం సంతోషంగా ఉండడానికి ప్రయత్నిస్తోంది. సంతోషంగా ఉండడానికి సంబంధించిన టెక్నిక్స్ గురించి ఆసక్తిగా తెలుసుకుంటోంది...

భోపాల్‌కు చెందిన అనీష ప్రతి రెండు రోజులకు ఒక సంస్కృత శ్లోకాన్ని కంఠస్థం చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకొని ఈ ఏడాది జనవరి మొదటి తేదీ నుంచి ప్రారంభించింది. ఫిబ్రవరి నెల పూర్తయ్యే సరికి తాను అలవోకగా చెప్పగలిగే శ్లోకాల గురించి లెక్క వేసుకుంటే చెప్పలేనంత సంతోషం కలిగింది. ఆ సంతోషం ఇంకా కొనసాగుతూనే ఉంది.

తమిళనాడులోని వెల్లూరుకు చెందిన ఇంజినీరింగ్ స్టూడెంట్ ఐశ్వర్య మోహన్‌కు డ్రైవింగ్ అంటే చెప్పలేనంత భయం. ఆ భయాన్ని వదిలి ఈమధ్యే స్కూటీ నడపడం నేర్చుకుంది. తనకు ఇప్పుడు విమానం నడుపుతున్నంత సంతోషంగా ఉంది. ముంబైకి చెందిన సజన్ ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఎప్పటికప్పుడు కొత్త కొత్త గ్యాడ్జెట్స్ కొనడంలో అతడికి అంతులేనంత సంతోషం దొరుకుతుంది. ఇవి మాత్రమే కాదు...మనం చేసే పనికి ఇతరుల నుంచి లభించే ప్రశంస, అభిమాన హీరో సినిమాకు వెళ్లడం, 'చాలా హ్యాండ్‌సమ్'గా ఉన్నావు'లాంటి కామెంట్... ఇలాంటివి అప్పటికప్పుడు లభించే తాత్కాలిక సంతోషాలే అయినా తక్కువ చేసి చూసేవి మాత్రం కాదు.

చిన్న చిన్న చినుకులు కలిస్తేనే కదా వర్షం.

ట్రై చేసి చూద్దాం

వ్యాయామాలతో సంతోషాన్ని సొంతం చేసుకునేవారు కొందరైతే, సంతోషం కోసం ప్రత్యేక వ్యాయామాలు చేసేవారు కొందరు. 'హ్యాపీనెస్'ను సొంతం చేసుకోవడం కోసం చిన్నపాటి ఎక్సర్‌సైజ్‌ల మీద దృష్టి పెట్టే ధోరణి యువతరంలో పెరుగుతుంది. వాటిలో కొన్ని..

- టాప్ ఔట్ స్ట్రెస్
- న్యూ బిహేవియర్
- యాంకర్ హ్యాపీ అండ్ కామ్ ఫీలింగ్స్
- బ్రీత్ టెక్నిక్
- యాంగర్ రిలీజ్ సీక్రెట్.

నచ్చిన పనిలోనే సంతోషం

చెన్నైలో పుట్టి బెంగళూరులో పెరిగిన నిహారిక ఎన్ఎం ఇంజినీరింగ్ చదివే రోజుల్లో హాబీగా యూట్యూబ్ వీడియోలు చేసింది. ఈ ప్రక్రియ తనను ఒత్తిడికి దూరంగా ఉంచడంతో పాటు ఎప్పుడూ సంతోషంగా ఉండేలా చేసింది. 'నచ్చిన పని చేయడంలో అపారమైన ఆనందం సొంతం అవుతుంది' అంటున్న నిహారిక ఎన్ఎం 'డిజిటల్ కంటెంట్ క్రియేటర్'గా ప్రపంచవ్యాప్తంగా మంచి పేరు తెచ్చుకుంది.

హ్యాపీనెస్ ఫార్ములా

'హ్యాపీనెస్' అనే మాట వినిపించగానే గుర్తుకు వచ్చే పేర్లలో ఒకటి సైకాలజిస్ట్ మార్టిన్ సెలిగ్మాన్. అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఎంపికైన సెలిగ్మాన్ సంతోషం అంటే ఏమిటి? మనిషిని సంతోషంగా ఉంచే అంశాలు ఏమిటి? ఫెయిల్యూర్స్‌ను అధిగమించి విజయాలు సొంతం చేసుకున్న వ్యక్తుల గురించి లోతుగా అధ్యయనం చేశాడు. 'అథెంటిక్ హ్యాపీనెస్' పేరుతో పుస్తకం రాశాడు. 'హ్యాపీనెస్'కు సంబంధించి హెచ్=ఎస్+సి+వి అనే ఫార్ములాను రూపొందించాడు.



హెచ్–హ్యాపీనెస్

ఎస్–సెట్ రేంజ్: మన సంతోషంలో 50 శాతం పూర్తిగా మన నియంత్రణలో ఉండదు. జెనెటిక్ కెపాసిటీ ప్రభావం ఉంటుంది.

సి–సర్‌కమస్టాన్సెస్: దీర్ఘకాలిక సంతోషాన్ని సొంతం చేసుకోవడానికి పరిస్థితులను సరిదిద్దుకుంటూ, స్ట్రాటజిక్ వర్క్‌తో ప్రయాణించాలి. ఉదా: నెగెటివ్ ఈవెంట్స్, నెగిటివ్ ఎమోషన్స్‌కు దూరంగా ఉండడం.

వి–వాలెంటరీ వేరియబుల్స్: హ్యాపీనెస్ ఫార్ములాలో బెస్ట్ అండ్ మోస్ట్ కంట్రోలబుల్ పార్ట్ ఇది. గత, వర్తమాన, భవిష్యత్తుకు సంబంధించిన పాజిటివ్ ఎమోషన్స్ ద్వారా సంతోషంగా ఉండడం.

హార్వర్డ్ బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్, సోషల్ సైంటిస్ట్, రచయిత డా.ఆర్థర్ బ్రూక్స్ 'హ్యాపీనెస్'కు సంబంధించి హెచ్=ఇ+ఎస్+ఎం అనే ఈక్వేషన్‌ను ప్రచారంలోకి తీసుకువచ్చాడు.

హాపీనెస్ (హెచ్) = ఎంజాయ్‌మెంట్ (ఇ)+శాటిస్ఫాక్షన్ (ఎస్)+మీనింగ్ (ఎం)

హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో ఆర్థర్ రూపొందించిన 'మేనేజింగ్ హ్యాపీనెస్' అనే కోర్సు అందుబాటులో ఉంది.



నిహారిక

చిరు సంతోషాల కలయికే కదా ఆనందమయ జీవితం!

'హాబీల నుంచి వచ్చే హ్యాపీనెస్ అంతా ఇంతా కాదయా' అని చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.

జెన్ జెడ్‌కు సుపరిచితమైన పేరు... విష్ణు కౌశల్. ఇన్‌స్టాగ్రామ్‌లో కామిక్ కంటెంట్ జెనరేట్ చేయడం అతడి హాబీ. ఈ హాబీ కాస్త అతడిని డిజిటల్ స్టార్‌ను చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో విష్ణు కౌశల్‌కు 2.3 మిలియన్‌ల ఫాలోవర్‌లు ఉన్నారు. 'పెద్ద లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని నా ప్రయాణాన్ని ప్రారంభించలేదు. నేను కామిక్ కంటెంట్‌ను క్రియేట్ చేయడానికి కారణం అది నన్ను ఎప్పుడూ సంతోషంగా ఉంచుతుంది' అంటాడు 25 సంవత్సరాల విష్ణు కౌశల్.

'లేదు అనుకుంటే ఏమీ లేదు. ఉంది అనుకుంటే ఎంతో ఉంది' అనే ధోరణిని అనుసరించే యువతరం సూర్యోదయం నుంచి వెండి వెన్నెల వెలుగు వరకు ప్రతి ప్రకృతి అద్భుతాన్ని ఎంజాయ్ చేస్తోంది.

'హ్యాపీనెస్ అనేది ఎమోషన్, ఫీలింగ్ కాదు. అదొక స్కిల్' అంటున్న యువతరం రకరకాల టెక్నిక్‌లపై కూడా దృష్టి సారిస్తోంది. స్థూలంగా చెప్పాలంటే 'సంతోషం' అనే పునాదిని సిద్ధం చేసుకొని 'లక్ష్యాలు' అనే భవనాలపై దృష్టి పెడుతోంది.

సమ్మర్‌టిప్స్

- వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఏసీలు ఉన్న ఇళ్లలో ఏసీ కండిషన్‌లో ఉందా లేదా అని చెక్ చేసుకోవడం, అవసరమైతే గ్యాస్ పట్టించడం వంటి జాగ్రత్తలు మొదలయ్యే ఉంటాయి. అయితే ఏసీ గురించి పట్టించుకునే ముందు ఇంటి కిటికీలకు వట్టివేరు తడికలను కర్టెన్‌లుగా వేయడానికి ప్రయత్నించండి. పర్యావరణహితంగా ఇంటిని చల్లబరుచుకుందాం.
- వేసవి రాగానే ఫ్రిజ్‌లో పెట్టే వాటర్ బాటిళ్ల మరో సెట్ కొని సిద్ధం చేయడం ఆనవాయితీ. ఫ్రిజ్ బాటిళ్లతోపాటు మట్టి కుండ కూడా కొని ఇంటికి తెచ్చుకోండి. మట్టి కుండలోని నీటి రుచి ఈ తరం బాల్యానికి పరిచయం చేయండి.

ఇంటిప్



- వెడల్పాటి పాత్రలో నీటిని పోసి పూలు అలంకరించి ముందు గదిలో ఒక మూల పెట్టడం ఇంటీరియర్ డెకరేషన్‌లో భాగమైపోయింది. అలాగే ఈ కాలంలో ప్రతి గదిలో ఒక మూల చిన్న నీటి పాత్రను (మూత పెట్టకుండా) ఉంచితే గది ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

పోరాడి ఓడిన సుమిత్ నగాల్



మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్‌కు నిరాశ ఎదురైంది. ఈ టోర్నీలో ప్రపంచ 97వ ర్యాంకర్ సుమిత్ మెయిన్ ‘డ్రా’కు అర్హత పొందలేకపోయాడు. ఫ్లోరిడాలో మంగళవారం జరిగిన క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌లో సుమిత్ 6-3, 1-6, 5-7తో ప్రపంచ 212వ ర్యాంకర్ కోల్మన్ వాంగ్ (హాంకాంగ్) చేతిలో ఓడిపోయాడు. సుమిత్‌కు 13,500 డాలర్ల (రూ. 11 లక్షల 20 వేలు) ప్రైజ్‌మనీ, 10 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

54 స్థానాలు ఎగబాకిన శరత్ కమల్



గతవారం సింగపూర్ స్మాష్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరినందుకు... భారత టేబుల్ టెన్నిస్ (టీటీ) దిగ్గజ ప్లేయర్ ఆచంట శరత్ కమల్ వ్యక్తిగత ర్యాంక్ అమాంతం ఎగబాకింది. అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య తాజా ర్యాంకింగ్స్‌లో శరత్ కమల్ 54 స్థానాలు పురోగతి సాధించి 34వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ప్రస్తుతం భారత నంబర్‌వన్‌గా ఉన్న 41 ఏళ్ల శరత్ మే 16లోపు టాప్-2లో ఉంటే ఒలింపిక్స్‌లో ఐదోసారి సింగిల్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తాడు.

లక్ష్య సేన్ @ 13



న్యూఢిల్లీ: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో సెమీఫైనల్ చేరిన భారత స్టార్ లక్ష్య సేన్ ర్యాంక్ మెరుగైంది. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) తాజా ర్యాంకింగ్స్‌లో పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ ఐదు స్థానాలు ఎగబాకి 13వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ప్రణయ్ ఎనిమిది నుంచి తొమ్మిదో ర్యాంక్‌కు పడిపోయాడు. ఏప్రిల్ 30వ తేదీలోపు టాప్-16లో ఉంటే ప్రణయ్, లక్ష్య సేన్ పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తారు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు 11వ ర్యాంక్‌లో మార్పు లేదు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకుంది. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జోడీ మూడు స్థానాలు ఎగబాకి 20వ ర్యాంక్‌తో భారత నంబర్‌వన్ జోడీగా అవతరించింది. పుల్లెల గాయత్రి-ట్రిసా జాలీ ద్వయం నాలుగు స్థానాలు పడిపోయి 26వ ర్యాంక్‌కు చేరుకుంది.

పెర్త్‌లో తొలి టెస్టు!

ఈ ఏడాది చివర్లో ఆస్ట్రేలియాలో భారత జట్టు పర్యటన



మెల్‌బోర్న్: టెస్టు ఫార్మాట్‌లో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లో ఉన్న భారత జట్టు ఈ ఏడాది చివర్లో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) విజేత ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్‌లో పోటీపడనుంది. ఆస్ట్రేలియా వేదికగా ఈ సిరీస్ జరుగుతుంది. నవంబర్‌లో మొదలయ్యే ఈ సిరీస్‌లో ఐదు టెస్టుల వేదికలను క్రికెట్ ఆస్ట్రేలియా ఖరారు చేసినట్లు సమాచారం. ఈ రెండు మేటి జట్ల మధ్య జరిగే తొలి టెస్టుకు పెర్త్ ఆతిథ్యమివ్వనుంది. అనంతరం రెండో టెస్టు అడిలైడ్‌లో... మూడో టెస్టు బ్రిస్బేన్‌లో... నాలుగో టెస్టు మెల్‌బోర్న్‌లో... చివరిదైన ఐదో టెస్టు సిడ్నీలో జరగనున్నాయి. అడిలైడ్‌లో జరిగే రెండో టెస్టు డే-నైట్‌గా జరుగుతుంది. ఈ సిరీస్ పూర్తి షెడ్యూల్‌ను క్రికెట్ ఆస్ట్రేలియా ఈ నెలాఖరులో అధికారికంగా ప్రకటించనుంది.

ఒక్క టైటిల్ వేటలో...

- ఫైనల్ చేరినా ఐపీఎల్ ట్రోఫీ గెలవని మూడు జట్లు
- ఈ సారైనా బెంగళూరు, ఢిల్లీ, పంజాబ్ జట్ల కల నెరవేరేనా!



ఐపీఎల్‌లో 16 సీజన్లు గడిచిపోయాయి... రెండు టీమ్‌లు చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ ఐదేసిసార్లు విజేతగా నిలిచి తమ స్థాయిని ప్రదర్శిస్తే కోల్‌కతా నైట్‌రైడర్స్ రెండు టైటిల్స్‌తో సత్తా చాటింది. మరో నాలుగు టీమ్‌లు రాజస్తాన్ రాయల్స్, దక్కన్ చార్జర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్ ఒక్కో ట్రోఫీతో కొంత సంతృప్తిని మూటగట్టుకున్నాయి. కానీ అన్ని సీజన్లలో భాగంగా ఉండి ఒక్కసారి కూడా కప్‌ను ముద్దాడలేకపోయిన దురదృష్టకర జట్లూ ఉన్నాయి. సీజన్‌లో తొలి మ్యాచ్ నుంచి చెలరేగి అంచనాలు పెంచి అభిమానుల్లో ఆశలు రేపిన తర్వాత చివరి మెట్టుపై చతికిలపడి ఈ టీమ్‌లు తీవ్ర నిరాశను పంచాయి. మూడు సార్లు ఫైనల్ చేరి ఒక్కసారి కూడా గెలవలేకపోయిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఈ అన్ లక్కీ బ్యాచ్‌లో అగ్రస్థానంలో ఉండగా... పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ఒక్కోసారి ఫైనల్ చేరి పరాజయం పక్షాన నిలిచాయి. కొత్త సీజన్‌లో మరోసారి తమ రాతను పరీక్షించుకునేందుకు సిద్ధమైన ఈ మూడు జట్లకు ఈ సారైనా కలిసి వస్తుందా... ట్రోఫీ చెంత చేరుతుందా అనేది ఆసక్తికరం. -సాక్షి క్రీడా విభాగం

‘బెంగ’ళూరు తీరుతుందా...

తొలి ఐపీఎల్ సీజన్‌లో చివరి నుంచి రెండో స్థానంలో నిలిచిన ఆర్‌సీబీ తర్వాతి సీజన్‌లో కోలుకొని ఫైనల్ చేరినా 6 పరుగుల స్వల్ప తేడాతో దక్కన్ చార్జర్స్ చేతిలో ఓడింది. అనంతరం 2011లోనూ తుది పోరుకు అర్హత సాధించినా... చెన్నై నిర్దేశించిన 206 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక చతికిలపడింది. ఇక కోహ్లి ఏకంగా 973 పరుగులు సాధించిన 2016 ఐపీఎల్‌లోనూ ఆఖరి సమరంలో సన్‌రైజర్స్ చేతిలో 8 పరుగులతో ఓటమి పాలైంది. 209 పరుగుల ఛేదనలో ఒక దశలో 114/0తో ఉండి కూడా టీమ్ ఓడింది. ఇక ఆ తర్వాత ఆర్‌సీబీ ఆ స్థాయి ప్రదర్శనను మళ్లీ చూపించలేదు. గత సీజన్‌లో 7 విజయాలు సాధించిన జట్టు ఆరో స్థానంతో ముగించింది.

బలాబలాలు: తాజా వేలంలో ఆసీస్ ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్‌ను ఆర్‌సీబీ రూ.17.50 కోట్లకు తీసుకుంది. అతని తాజా ఫామ్‌ను బట్టి చూస్తే అటు బౌలింగ్‌లో, ఇటు బ్యాటింగ్‌లో జట్టుకు కచ్చితంగా మంచి ప్రయోజనం కలగవచ్చు. ఓపెనర్లుగా డుప్లెసిస్, కోహ్లిలపై బ్యాటింగ్ భారం ఉండగా... మ్యాక్స్‌వెల్, గ్రీన్ చెలరేగిపోగలరు. గాయంతో గత సీజన్‌కు దూరమైన రజత్ పటిదార్ ఈసారి సత్తా చాటేందుకు సిద్ధమయ్యాడు. బౌలింగ్‌లో ఫెర్గూసన్, అల్జారీ జోసెఫ్‌లలో ఒకరికి అవకాశం దక్కుతుంది. అయితే వీరిద్దరికంటే సిరాజ్, ఇటీవలే టెస్టుల్లో అరంగేట్రం చేసిన ఆకాశ్‌దీప్‌లు రాణించడం కీలకం. రంజీల్లో రాణించిన వైశాక్ విజయ్ కూడా ఉన్నాడు. జట్టు స్పిన్ విభాగం బలహీనంగా ఉంది. కరణ్ శర్మలో మునుపటి పదును లేదు. జట్టులో ఇతర దేశవాళీ ఆటగాళ్లు ఎవరూ ఎక్కువ ప్రభావం చూపించగల సమర్థులు కాదు. ఓవరాల్‌గా చూస్తే బ్యాటింగ్ బలగంతోనే బెంగళూరు మ్యాచ్‌లు గెలవాల్సి ఉంది.

జట్టు వివరాలు — ఆర్‌సీబీ: డుప్లెసిస్ (కెప్టెన్), విల్ జాక్స్, మ్యాక్స్‌వెల్, గ్రీన్, జోసెఫ్, టాప్లీ, టామ్ కరన్, ఫెర్గూసన్ (విదేశీ ఆటగాళ్లు); పటిదార్, కోహ్లి, రావత్, కార్తీక్, సుయశ్, సౌరవ్ చౌహాన్, లోమ్రోర్, కరణ్ శర్మ, స్వప్నిల్, మయాంక్ డాగర్, మనోజ్, ఆకాశ్‌దీప్, సిరాజ్, యశ్ దయాళ్, హిమాన్షు, రాజన్, వైశాక్ (భారత ఆటగాళ్లు).

మరో 2 రోజుల్లో ఐపీఎల్

పంజాబ్ ‘కింగ్స్’ అవుతుందా...

2014లో ఒకే ఒక్కసారి ఫైనల్ చేరిన పంజాబ్ తుది పోరులో 199 పరుగులు చేసి కూడా మూడు బంతుల మిగిలి ఉండగానే కోల్‌కతాకు తలవంచింది. ఇతర జట్లతో పోలిస్తే చాలా కాలంగా పంజాబ్ ప్రదర్శన ఘోరంగా ఉంది. 2019-2022 వరకు వరుసగా నాలుగు సీజన్ల పాటు ఆరో స్థానంలో నిలిచిన జట్టు గత ఏడాది ఎనిమిదో స్థానంతో ముగించింది. అసలు 2014 తర్వాత ఇన్నేళ్లలో ఐదో స్థానంలో (2017)లో నిలవడమే ఆ జట్టు అత్యుత్తమ ప్రదర్శన

బలాబలాలు: ఎప్పటిలాగే అగ్రశ్రేణి భారత ఆటగాళ్లు లేకపోవడం జట్టు ప్రధాన బలహీనత. ఎప్పుడో భారత జట్టుకు దూరమైనా మరో ప్రత్యామ్నాయం లేక ఆటగాడిగా, కెప్టెన్‌గా కూడా శిఖర్ ధావన్‌కు అవకాశం దక్కుతోంది. అతను ఏమాత్రం సమర్థంగా జట్టును నడిపించగలడనేది సందేహమే. చూస్తే జట్టులో చాలా మంది ఆల్‌రౌండర్లు ఉన్నట్లు కనిపిస్తోంది కానీ వీరిలో ఎవరూ గతంలో తమ ఆల్‌రౌండ్ నైపుణ్యాన్ని ప్రదర్శించింది లేదు. బ్యాటింగ్‌లో జితేశ్ శర్మ, బెయిర్‌స్టో, లివింగ్‌స్టోన్‌ల పైనే భారం ఉంది. అర్ష్‌దీప్‌తో పాటు కొత్తగా ఈ జట్టులోకి వచ్చిన హర్షల్ పటేల్‌పై బౌలింగ్ భారం ఉండగా, రబడ రాణించడం కీలకం. వోక్స్, స్యామ్ కరన్ ఎంత ప్రభావం చూపిస్తారో చూడాలి.

జట్టు వివరాలు — పంజాబ్: బెయిర్‌స్టో, లివింగ్‌స్టోన్, రోసో, వోక్స్, స్యామ్ కరన్, రజా, రబడ, ఎలిస్ (విదేశీ ఆటగాళ్లు); శిఖర్ ధావన్ (కెప్టెన్), జితేశ్, ప్రభ్‌సిమ్రన్, హర్‌ప్రీత్, శశాంక్, విశ్వనాథ్, అశుతోష్, తనయ్ త్యాగరాజన్, అథర్వ, రిషి ధావన్, శివమ్ (భారత ఆటగాళ్లు).

ఢిల్లీ... పంత్ ప్రతాపంపైనే...

సూపర్ ఫామ్‌తో అగ్రస్థానం సాధించి 2020లో ఫైనల్ చేరిన ఢిల్లీ క్యాపిటల్స్ పేలవ బ్యాటింగ్‌తో ముంబై చేతిలో ఓడింది. 2023లోనైతే మరీ పేలవంగా ఆడి 9వ స్థానానికి పరిమితమైంది. రిషభ్ పంత్ పునరాగమనమే ఇప్పుడు అన్నిటి కంటే ఎక్కువ ఆసక్తి రేపుతోంది. అయితే తీవ్ర గాయం నుంచి కోలుకొని వస్తున్న అతను ఎలా ఆడతాడు, సారథిగా ఎలా నడిపిస్తాడనేది చర్చనీయాంశం.

బలాబలాలు: ఢిల్లీ బ్యాటింగ్ బలంగా ఉండటం సానుకూలాంశం. వార్నర్, పృథ్వీ షా, మిచెల్ మార్ష్ టాప్-3లో ఆడతారు. దక్షిణాఫ్రికా బ్యాటర్ స్టబ్స్ మెరుపు ఇన్నింగ్స్ ఆడగల సమర్థుడు. లోయర్ ఆర్డర్‌లో అక్షర్ పటేల్ ఆల్‌రౌండర్‌గా ప్రభావం చూపగలడు. కుల్దీప్ యాదవ్ వల్ల స్పిన్ బౌలింగ్‌లో కూడా పదును ఉంది. అయితే పేస్ బలహీనంగా కనిపిస్తోంది. నోర్జే, రిచర్డ్సన్ గాయాలతో బాధపడుతుండగా... జట్టు ఆధారపడుతున్న ఖలీల్, ముకేశ్‌ల ప్రదర్శన టి20ల్లో అంతంత మాత్రమే. బ్యాటింగ్‌లో భారీ స్కోర్లు సాధిస్తేనే గెలుపుపై నమ్మకం ఉంచుకోవచ్చు. పంత్‌కు ఫిట్‌నెస్ సమస్యలు వస్తే దూకుడైన కీపర్ కుమార్ కుషాగ్ర ఆడతాడు.

జట్టు వివరాలు — ఢిల్లీ: వార్నర్, హోప్, స్టబ్స్, మార్ష్, నోర్జే, జేక్ ఫ్రేజర్, రిచర్డ్సన్ (విదేశీ ఆటగాళ్లు); పంత్ (కెప్టెన్), పృథ్వీ షా, యశ్ ధుల్, స్వస్తిక్, పారేల్, రికీ భుయ్, కుశాగ్ర, అక్షర్, లలిత్, సుమీత్, ప్రవీణ్ దూబే, విక్కీ, కుల్దీప్, ఖలీల్, ఇషాంత్, ముకేశ్, రసిక్ (భారత ఆటగాళ్లు)

ప్రిక్వార్టర్స్‌లో శ్రీజ, స్నేహిత్



బీరుట్ (లెబనాన్): ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) ఫీడర్ లెవెల్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ ప్లేయర్లు ఆకుల శ్రీజ, సూరావజ్జుల స్నేహిత్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో శ్రీజ 11-4, 11-3, 11-8తో అష్ఖారి మషిద్ (ఇరాన్)పై గెలిచింది. డబుల్స్ తొలి రౌండ్‌లో శ్రీజ-దియా చిటాలె (భారత్) జోడీ 12-10, 11-7, 14-12తో నథాలీ మర్చెటి-లీలూ మసార్ట్ (బెల్జియం) జంటను ఓడించింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో స్నేహిత్ 10-12, 11-5, 12-10, 11-3తో ఖాలిద్ ఖాదర్ (జోర్డాన్)పై, తొలి రౌండ్‌లో 11-6, 11-8, 11-6తో బాసిల్ హర్బ్ (లెబనాన్)పై గెలుపొందాడు.

బిలియర్డ్స్ ‘హాల్ ఆఫ్ ఫేమ్’లో పంకజ్ అద్వానీ




న్యూఢిల్లీ: భారత క్యూ స్పోర్ట్స్ (స్నూకర్, బిలియర్డ్స్) దిగ్గజం పంకజ్ అద్వానీ తన విజయవంతమైన కెరీర్‌లో మరో మైలురాయిని సొంతం చేసుకున్నాడు. ప్రపంచ బిలియర్డ్స్‌లో విశిష్ట క్రీడాకారుల జాబితాలో చోటు దక్కించుకున్నాడు. బిలియర్డ్స్ ‘హాల్ ఆఫ్ ఫేమ్’లో పంకజ్‌కు స్థానం కల్పించారు. చైనాలోని షాంగ్రావొ నగరంలోని ప్రపంచ బిలియర్డ్స్ మ్యూజియంలో హాల్ ఆఫ్ ఫేమ్ జాబితాను పొందుపరిచారు. ప్రపంచ విశిష్ట క్రీడాకారుల సరసన తన పేరు ఉండటం చాలా సంతోషంగా ఉందని పంకజ్ చెప్పాడు. ‘అరుదైన గౌరవానికి అర్హుడినైనందుకు ఆనందంగా ఉంది. సుదీర్ఘమైన కెరీర్‌లో అభిమానులు, శ్రేయోభిలాషుల మద్దతు వల్లే అత్యున్నత శిఖరాలను అధిరోహించాను’ అని అద్వానీ అన్నాడు. గత నవంబర్లో 38 ఏళ్ల వయసులోనూ భారత విఖ్యాత ఆటగాడు అంతర్జాతీయ బిలియర్డ్స్, స్నూకర్ సమాఖ్య (ఐబీఎస్ఎఫ్) ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో ఓవరాల్‌గా 26వ టైటిల్‌ను గెలుపొందాడు. ఇందులో పాయింట్ల ఫార్మాట్, లాంగ్ ఫార్మాట్, ప్రపంచ టీమ్ చాంపియన్‌షిప్ విభాగాల్లో టైటిళ్లున్నాయి.

సినిమా

రైటింగ్ పూర్తి చేశాం

- రాజమౌళి



● రాజమౌళి

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ సినిమా(‘ఎస్ఎస్ఎమ్‌బీ 29’ వర్కింగ్ టైటిల్) తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. కేఎల్ నారాయణ ఈ సినిమా నిర్మాత. కాగా ‘రౌద్రం.. రణం.. రుధిరం’(ఆర్ఆర్ఆర్) స్క్రీనింగ్‌లో భాగంగా రాజమౌళి జపాన్ వెళ్లారు. అక్కడ మహేశ్‌బాబుతో తాను చేయనున్న మూవీ గురించి మాట్లాడారు రాజమౌళి. ‘‘ఎస్ఎస్ఎమ్‌బీ 29’ మూవీకి సంబంధించిన రైటింగ్ పూర్తి చేశాం. ప్రీ విజువలైజేషన్ చేస్తూ, ప్రీ ప్రొడక్షన్ ప్రాసెస్‌లో ఉన్నాం. నటీనటుల పరంగా ఇప్పటివరకు మహేశ్‌బాబు ఒక్కరే ఖరారయ్యారు. మీలో (జపాన్ ప్రేక్షకులను ఉద్దేశిస్తూ..) చాలా మందికి మహేశ్ తెలుసు.. హ్యాండ్‌సమ్‌గా ఉంటాడు. త్వరగా ఈ సినిమాను పూర్తి చేస్తామనే అనుకుంటున్నాం. ‘ఎస్ఎస్ఎమ్‌బీ 29’ విడుదల సమయంలో మహేశ్‌బాబును నేను ఇక్కడికి (జపాన్) తీసుకుని వస్తాను. మరింత మందికి పరిచయం చేస్తాను’’ అన్నారు రాజమౌళి. విజయేంద్ర ప్రసాద్ కథ అందించిన ఈ సినిమాకు ఎమ్ఎమ్ కీరవాణి సంగీతం అందిస్తున్నారు. వేసవి తర్వాత ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిసింది. ఈ సంగతి ఇలా ఉంచితే... ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా డీవీవీ దానయ్య నిర్మించిన ‘ఆర్ఆర్ఆర్’ చిత్రం 2022 మార్చి 25న విడుదలైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత 21 అక్టోబరు 2022న ‘ఆర్ఆర్ఆర్’ సినిమాను జపాన్‌లో విడుదల చేసిన విషయం గుర్తుండే ఉంటుంది.

యాగంటి క్షేత్రంలో పుష్ప 2



● అల్లు అర్జున్, రష్మిక

ఆంధ్రప్రదేశ్ లోని నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలోని యాగంటి క్షేత్రంలో ‘పుష్ప: ది రూల్’ సినిమా షూటింగ్ సందడి నెలకొంది. అల్లు అర్జున్, రష్మిక మందన్నా జంటగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతోన్న తాజా చిత్రం ‘పుష్ప: ది రూల్’. 2021లో విడుదలై పాన్ ఇండియా స్థాయిలో బ్లాక్ బస్టర్‌గా నిలిచిన ‘పుష్ప: ది రైజ్’ మూవీకి సీక్వెల్‌గా ‘పుష్ప: ది రూల్’ రూపొందుతోంది. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీ చిత్రీకరణ యాగంటి క్షేత్రంలో జరుగుతోంది. యాగంటి క్షేత్రంలోని గుహలో కొలువైన శ్రీ వెంకటేశ్వరస్వామికి హీరోయిన్ రష్మిక మందన్నా బంగారు కిరీటాన్ని బహూకరించే సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు సుకుమార్. నేడు కూడా ఈ క్షేత్రంలోనే షూటింగ్ జరుగుతుంది. ‘పుష్ప: ది రూల్’ షూటింగ్‌తో ఆ ప్రాంతమంతా ప్రజలతో సందడిగా మారింది.

పదిభాషల్లో కంగువ



● సూర్య

సూర్య హీరోగా నటించిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా ‘కంగువ’. దిశాపటానీ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో బాబీ డియోల్, యోగిబాబు ప్రధాన పాత్రలు పోషించారు. స్టూడియో గ్రీన్, యువీ క్రియేషన్స్‌పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించిన ‘కంగువ’ టీజర్‌ను మంగళవారం విడుదల చేశారు. ‘‘కంగువ’ సినిమా, మేకోవర్ కోసం సూర్య చాలా కష్టపడ్డారు. పది భాషల్లో తెరకెక్కిన ‘కంగువ’ త్రీడీలోనూ ప్రేక్షకుల ముందుకు వస్తుంది. పలు అంతర్జాతీయ భాషల్లో కూడా రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం’’ అని చిత్రయూనిట్ పేర్కొంది. కంగువ పాత్రలో సూర్య కనిపించనున్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించగా, నేహా జ్ఞానవేల్ రాజా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే...‘సూరారైపోట్రు’ (తెలుగులో ‘ఆకాశం నీ హద్దురా) సినిమా తర్వాత హీరో సూర్య, దర్శకురాలు సుధా కొంగర కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. కాగా ఈ సినిమా చిత్రీకరణ కాస్త ఆలస్యంగా ప్రారంభం కానున్నట్లు సూర్య ఓ నోట్ విడుదల చేశారు.

డీజే టిల్లుని మించేలా టిల్లు స్క్వేర్ తీశాం

- సిద్ధు జొన్నలగడ్డ



● అనుపమ, సిద్ధు

‘‘డీజే టిల్లు’ సినిమాపై ప్రేక్షకుల్లో పెద్దగా అంచనాలు లేవు.. అందుకే ఎలాంటి ఒత్తిడి లేకుండా పనిచేశాం. ఆ మూవీ బ్లాక్‌బస్టర్ కావడంతో ‘టిల్లు స్క్వేర్’ మూవీపై ప్రేక్షకుల్లో అంచనాలుఉన్నాయి. అందుకే చాలా జాగ్రత్తగా ‘డీజే టిల్లు’ని మించేలా ‘టిల్లు స్క్వేర్’ తీశాం’’ అని హీరో సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. మల్లిక్ రామ్ దర్శకత్వంలో సిద్ధు జొన్నలగడ్డ, అనుపమా పరమేశ్వరన్ నటించిన చిత్రం ‘టిల్లు స్క్వేర్’. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న విడుదలవుతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి ‘ఓ మై లిల్లీ..’ అనే పాటని అభిమానుల సమక్షంలో విడుదల చేశారు. అచ్చు రాజమణి స్వరపరచిన ‘ఓ మై లిల్లీ..’ పాటకి సిద్ధు, రవి ఆంటోనీ సాహిత్యం అందించగా, శ్రీరామ్ చంద్ర పాడారు. ‘‘నేను మొదటిసారి ‘టిల్లు స్క్వేర్’ వేడుకలో పాల్గొన్నాను. మీ ప్రేమ(ఫ్యాన్స్) మాపై ఎప్పుడూ ఇలాగే ఉండాలి’’ అన్నారు అనుపమా పరమేశ్వరన్. ‘‘టిల్లు స్క్వేర్’ యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులను మెప్పించేలా ఉంటుంది’’ అన్నారు సూర్యదేవర నాగవంశీ.

హనీ-బన్నీ



● సమంత

వరుణ్‌ధావన్, సమంత లీడ్ రోల్స్‌లో నటించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ వెబ్‌సిరీస్‌కు ‘సిటాడెల్: హనీ-బన్నీ’ అనే టైటిల్‌ను అధికారికంగా ఖరారు చేశారు. ‘ది ఫ్యామిలీమేన్’ వెబ్‌సిరీస్ ఫేమ్ రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహించిన ఈ వెబ్ సిరీస్ అమేజాన్ ప్రైమ్ ఓటీటీలో త్వరలో స్ట్రీమింగ్ కానుంది. హాలీవుడ్ వెబ్‌సిరీస్ ‘సిటాడెల్’ ఇండియన్ వెర్షన్‌గా ‘సిటాడెల్: హనీ-బన్నీ’ రూపొందింది. మాతృకలో రిచర్డ్ మ్యాడేన్, ప్రియాంకా చోప్రా లీడ్ రోల్స్‌లో నటించారు.

ప్రతీకారం!



● అనుష్క

హీరోయిన్ అనుష్కా శెట్టి, దర్శకుడు క్రిష్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా సినిమాకు ‘ఘాటి’ అనే టైటిల్ ఖరారైంది. యువీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్స్ ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. చిత్రీకరణ ఇప్పటికే మొదలైంది. వ్యాపార రంగంలో అంచలంచలుగా ఎదుగుతున్న ఓ మహిళను కొందరు కావాలని ఎలా నష్టపరిచారు? ఆ తర్వాత ఆమె ఏ విధంగా వారిపై ప్రతీకారం తీర్చుకుంది? అనే కోణంలో ‘ఘాటి’ సినిమా కథనం ఉంటుందనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది.

డబుల్ ధమాకా



● ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’ ఫస్ట్‌లుక్

మలయాళ స్టార్ హీరోల్లో ఒకరైన ఫహాద్ ఫాజిల్ రెండు తెలుగు చిత్రాలకు పచ్చజెండా ఊపారు. వాటిలో ఒకటి ‘ఆక్సిజన్’ కాగా మరొకటి ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వం వహించిన ‘పుష్ప: ది రైజ్’ సినిమాలో ఎస్పీ భన్వర్ సింగ్ షెకావత్ పాత్ర ద్వారా ఫహాద్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడే. ప్రస్తుతం ‘పుష్ప: ది రూల్’ లో నటిస్తున్న ఆయన హీరోగా రెండు తెలుగు చిత్రాల ప్రకటన వచ్చింది. మలయాళ హిట్ మూవీ ‘ప్రేమలు’ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేసి, హిట్ కొట్టిన కార్తికేయ (డైరెక్టర్ రాజమౌళి తనయుడు) ‘ఆక్సిజన్’, ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’ సినిమాలతో నిర్మాణ రంగంలోకి అడుగుపెడుతున్నారు. ఆర్కా మీడియా వర్క్స్‌పై ‘బాహుబలి’ వంటి సెన్సేషనల్ చిత్రాన్ని నిర్మించిన నిర్మాత శోభు యార్లగడ్డతో కలిసి ఈ సినిమాలను నిర్మించనున్నట్లు కార్తికేయ ప్రకటించారు. ‘ఆక్సిజన్’ చిత్రంతో సిద్ధార్థ్ నాదెళ్ల, ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’ మూవీతో శశాంక్ ఏలేటి దర్శకులుగా పరిచయమవుతున్నారు. ఈ రెండు సినిమాలకు ఎస్ఎస్ రాజమౌళి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు.

ఇన్ని పాత్రలు నేనే చేశానా అనిపించింది

- లక్ష్మీ మంచు



● లక్ష్మీ మంచు, సంజీవ్, ఎస్తేర్

‘‘ఆదిపర్వం’ మూవీ పోస్టర్ చూస్తుంటే ఇన్ని పాత్రలు నేనే చేశానా? అనిపించింది. నవరసాలు, అన్ని రకాల భావోద్వేగాలు ఈ సినిమాలో ఉన్నాయి. తక్కువ సమయంలో మా దర్శకుడు సంజీవ్‌గారు ఈ చిత్రాన్ని అద్భుతంగా తీశారు. మా నిర్మాతలు కోరుకున్న దానికంటే ఈ చిత్రం ఎక్కువ విజయం సాధించాలి’’ అని లక్ష్మీ మంచు అన్నారు. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో లక్ష్మీ మంచు లీడ్ రోల్‌లో నటించిన చిత్రం ‘ఆదిపర్వం’. రావుల వెంకటేశ్వర్ రావు సమర్పణలో ఎమ్ఎస్‌కే నిర్మించారు. ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ని తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్ ఎస్.గిరిధర్ విడుదల చేయగా, జడ్చర్ల ఎమ్మెల్యే జె.అనిరుధ్ రెడ్డి తమిళ ట్రైలర్, దర్శకుడు నీలకంఠ కన్నడ ట్రైలర్, రియల్టర్ శిల్పా ప్రతాప్ రెడ్డి మలయాళ ట్రైలర్, చిత్ర సమర్పకుడు రావుల వెంకటేశ్వర్ రావు హిందీ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. ‘‘ఆదిపర్వం’ కి బలం లక్ష్మీగారు. దాదాపు ఏడు పాత్రల్లో నటించారామె’’ అన్నారు సంజీవ్ మేగోటి.

ఆర్టికల్ 21 నేపథ్యంలో...



● ఆకాశ్ పూరి, పార్వతీశం

సాయికుమార్, పార్వతీశం, ఐశ్వర్య, హారిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘మెర్సీ కిల్లింగ్’. సూరపల్లి వెంకటరమణ దర్శకుడు. వేదుల బాల కామేశ్వరి సమర్పణలో సిద్ధార్థ్ హరియల, మాధవి తాలబత్తుల నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ను హీరో ఆకాశ్ పూరి విడుదల చేసి, ‘‘మంచి కథాంశంతో వస్తున్న ‘మెర్సీ కిల్లింగ్’ సినిమా తప్పకుండా విజయం సాధించాలి’’ అన్నారు. ‘‘భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఆధారంగా తెరకెక్కిన చిత్రం ‘మెర్సీ కిల్లింగ్’. స్వేచ్ఛ అనే ఓ అనాథ బాలిక తనకు జరిగిన అన్యాయంపై ఎలా పోరాటం చేసింది? అనేది ఈ మూవీలో ఆసక్తిగా ఉంటుంది’’ అన్నారు సూరపల్లి వెంకటరమణ. ఈ చిత్రానికి కెమెరా: అమర్.జి, సంగీతం: ఎం.ఎల్.రాజా.

ఎమోషనల్ థ్రిల్లర్



● ‘సత్యం’ రాజేశ్

‘సత్యం’ రాజేష్ హీరోగా, మేఘా చౌదరి, చందన పయావుల, భరత్ కాంత్ కీలక పాత్రల్లో నటించిన ఫ్యామిలీ ఎమోషనల్ థ్రిల్లర్ ‘టెనెంట్’. వై. యుగంధర్ దర్శకత్వంలో మోగుళ్ల చంద్రశేఖర్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ మూడోవారంలో రిలీజ్‌కు సిద్ధం అవుతోంది. ‘‘ప్రస్తుత సమకాలీన పరిస్థితుల్లో మహిళలు ఎంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందో తెలియజేసేలా మా సినిమా కథనం ఉంటుంది’’ అని చిత్రయూనిట్ పేర్కొంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
736	238
72,012	21,817

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,162	▲	59
డోజోన్స్	39,058	▲	268
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,738	▲	16
డాక్స్	17,987	▲	55
షాంఘై	3,063	▽	22
నికాయ్	40,004	▲	236

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	65,589	▽	23
బంగారం (22 క్యారట్)	58,646	▽	24
వెండి (కిలో)	71,576	▽	312

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	81.19	84.48
£	బ్రిటన్ పౌండ్	[illegible]	103.88	108.12
€	యూరో	[illegible]	88.12	91.90
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	47.00	64.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	52.07	56.58
S$	సింగపూర్ డాలర్	[illegible]	60.13	64.88
SAR	సౌదీ రియాల్	[illegible]	21.12	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.65	23.43
¥	చైనా యువాన్	[illegible]	10.28	12.29

8.3 శాతానికి బీఓఐ గృహ రుణ రేటు

- ఈ నెలాఖరు వరకూ ప్రత్యేక ఆఫర్
- 15 బేసిస్ పాయింట్ల తగ్గింపు



ముంబై: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) గృహ రుణ రంగంలో తన వాటాను పెంచుకోడానికి కీలక నిర్ణయం తీసుకుంది. మార్చి 31వ తేదీ వరకూ స్వల్ప కాలానికి గృహ రుణ వడ్డీరేటు తగ్గింపు ఆఫర్ ప్రకటించింది. ప్రస్తుతం 8.45 శాతం ఉన్న రుణ రేటును 15 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) తగ్గించింది. దీనితో ఈ రేటు 8.30 శాతానికి తగ్గింది. దీనితోపాటు ప్రాసెసింగ్ ఫీజులను ఈ నెలాఖరు వరకూ కూడా పూర్తిగా రద్దు చేస్తున్నట్లు బ్యాంక్ ప్రకటన ఒకటి తెలిపింది. మిగిలిన బ్యాంకుల రుణ రేటుతో పోల్చితే తాజా 8.3 శాతం రేటు అత్యంత తక్కువ స్థాయని కూడా బీఓఐ వెల్లడించింది. 8.3 శాతం వద్ద 30 సంవత్సరాల కాల వ్యవధి హోమ్ లోన్‌కు లక్షకు నెలకు రూ. 755 ప్రారంభ ఈఎంఐ ఉంటుందని పేర్కొంది.

జొమాటో 'ప్యూర్ వెజ్'



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: శాకాహారులను దృష్టిలో పెట్టుకుని ఫుడ్ డెలివరీ యాప్ జోమాటో తాజాగా ప్యూర్ వెజ్ మోడ్, ప్యూర్ వెజ్ ఫ్లీట్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. శాకాహారాన్ని మాత్రమే అందించే రెస్టారెంట్లను ప్యూర్ వెజ్ మోడ్ కింద లిస్ట్ చేస్తారు. ఇటువంటి రెస్టారెంట్ల నుంచి మాత్రమే శాకాహార కస్టమర్లకు ఫుడ్ చేరవేసేందుకు ప్రత్యేకంగా డెలివరీ ఎగ్జిక్యూటివ్స్ ఉంటారు. అలాగే ఆకుపచ్చ రంగులో ప్రత్యేక బాక్స్‌లో ఆహారాన్ని సరఫరా చేస్తారు. ఈ బాక్సుల్లో నాన్‌వెజ్ ఫుడ్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉంచరు. ప్యూర్ వెజ్ ఫ్లీట్ మాంసాహార హోటళ్లలో అడుగుపెట్టరు.

ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 20 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు మార్చి 17వ తేదీ నాటికి 20% పెరిగి రూ.18.90 లక్షల కోట్లకు చేరాయి. ఇందులో కార్పొరేట్ పన్ను పరిమాణం రూ.9.14 లక్షల కోట్లు. వ్యక్తిగత ఆదాయ పన్ను రూ.9,72,224 కోట్లు. రిఫండ్స్ రూ.3.37 లక్షల కోట్లతో కలిపితే స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్ల మొత్తం రూ.22.27 లక్షల కోట్లని ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డ్ ఒక ప్రకటనలో పేర్కొంది.

ఆర్ఈసీ డివిడెండ్ రూ. 4.5

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ ఆర్ఈసీ బోర్డు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూడో మధ్యంతర డివిడెండ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో రూ. 10 ముఖ విలువగల ఒక్కో షేరుకి రూ. 4.5 చొప్పున చెల్లించనుంది. వాటాదారులకు కంపెనీ ఇప్పటికే రెండు విడతల్లో రూ. 6.5 డివిడెండ్ చెల్లించింది. తాజా డివిడెండ్ చెల్లింపునకు ఈ నెల 28 రికార్డ్ డేట్‌గా కంపెనీ ప్రకటించింది. వెరసి ఏప్రిల్ 17కల్లా వాటాదారులకు డివిడెండ్‌ను చెల్లించనుంది.

కార్ల కంపెనీల పల్లె'టూర్'



- చిన్న పట్టణాలకు ఔట్‌లెట్లు
- కస్టమర్లకు మరింత చేరువ
- రూరల్ వాటా 33 శాతం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశవ్యాప్తంగా 2022–23లో 38,90,114 యూనిట్ల ప్యాసింజర్ వెహికల్స్ (పీవీ) రోడ్డెక్కాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 42 లక్షల యూనిట్లు అమ్ముడవుతాయని అంచనా. 2024–25లో ఈ విభాగం 3–5% వృద్ధి చెందుతుందని పరిశ్రమ భావిస్తోంది. అయితే మొత్తం ప్యాసింజర్ వాహనాల అమ్మకాల్లో గ్రామీణ ప్రాంతాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ప్రస్తుతం పీవీ సేల్స్‌లో గ్రామీణ ప్రాంతాల వాటా 33% గా ఉంది. మహమ్మారి కాలంలో పట్టణ ప్రాంతాల్లో పీవీ విక్రయాల్లో తిరోగమన వృద్ధి ఉన్నప్పటికీ.. గ్రామీణ ప్రాంతాలు దూసుకుపోవడం గమనార్హం. కలిసి వచ్చే అంశం ఏమంటే రూరల్ ఏరియాల్లో రోడ్ నెట్ వర్క్ చాలా మెరుగైంది. వృద్ధి పరంగా పట్టణ ప్రాంతాలను కొన్నేళ్లుగా గ్రామీణ మార్కెట్లు వెనక్కి నెట్టాయి. ఈ అంశమే ఇప్పుడు తయారీ కంపెనీలకు రిటైల్ విషయంలో వ్యూహం మార్చుకోక తప్పడం లేదు.

వృద్ధిలోనూ రూరల్ మార్కెట్లే..

అమ్మకాల వృద్ధిరేటు 2023–24 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో 11.7, పట్టణ ప్రాంతాల్లో 8% ఉండొచ్చని అంచనా. 2022–23లో గ్రామీణ భారతం 20 % దూసుకెళితే, పట్టణ మార్కెట్లు 16 శాతం వృద్ధి సాధించాయి. 2021–22లో అర్బన్ మార్కెట్లు 9% తిరోగమన వృద్ధి చెందితే, రూరల్ మార్కెట్లు 1.5% ఎగశాయి. 2018–19 నుంచి 2023–24 వరకు చూస్తే ఒక్క 2019–20లో మాత్రమే గ్రామీణ భారతం తిరోగమన వృద్ధి చెందింది. అర్బన్ మార్కెట్లు మాత్రం 2021–22 వరకు వరుసగా మూడు ఆర్థిక సంవత్సరాలు తిరోగమన బాట పట్టాయి.

విస్మరించలేని గ్రామీణం..

గ్రామీణ ప్రాంతాలు విస్మరించలేని మార్కెట్లుగా అభివృద్ధి చెందాయని మారుతీ సుజుకీ చెబుతోంది. ఈ సంస్థకు 2018–19లో గ్రామీణ ప్రాంతాల వాటా 38 శాతం. ఇప్పుడు ఇది 45 శాతానికి ఎగబాకింది. దేశవ్యాప్తంగా 6,50,000 గ్రామాలు ఉన్నాయని, ఇందులో 4,10,000 గ్రామాల్లో కనీసం ఒక్క మారుతీ సుజుకీ కారైనా పరుగు తీస్తోందని కంపెనీ ధీమాగా చెబుతోంది. మిగిలిన గ్రామాలు వ్యాపార అవకాశాలు ఉన్నవేనని కంపెనీ అంటోంది. 2019–20తో పోలిస్తే టాటా మోటార్స్ గ్రామీణ ప్రాంతాల అమ్మకాలు అయిదు రెట్లు అధికం అయ్యాయి. మొత్తం విక్రయాల్లో రూరల్ వాటా ఇప్పుడు ఏకంగా 40 శాతానికి చేరిందని కంపెనీ వెల్లడించింది. వినియోగదార్లకు చేరువ అయ్యేందుకు సేల్స్, సర్వీస్ వర్క్‌షాప్స్‌ను విస్తరించినట్టు తెలిపింది. పట్టణాలకు సమీపంలో 800 ఔట్‌లెట్లు నెలకొన్నాయని, ప్రత్యేకంగా ఇవి గ్రామీణ కస్టమర్లకు సేవలు అందిస్తున్నాయని వివరించింది. దేశవ్యాప్తంగా 135 అనుభవ్ వ్యాన్స్ (మొబైల్ షోరూమ్స్) పరిచయం చేశామని తెలిపింది.

గ్రామాల్లో చిన్న కార్లు..

హ్యాచ్‌బ్యాక్స్‌కు గ్రామీణ మార్కెట్లలో విపరీత డిమాండ్ ఉంది. తొలిసారిగా కారు కొనే కస్టమర్లు ఇక్కడ అత్యధికం కూడా. ఎంట్రీ లెవెల్, మిడ్ లెవెల్ హ్యాచ్‌బ్యాక్ విక్రయాల్లో రూరల్ ఏరియాల వాటాయే అధికం. ప్రీమియం హ్యాచ్‌బ్యాక్స్ అధికంగా అర్బన్ ప్రాంతాల్లో రోడ్డెక్కుతున్నాయి. సెడాన్స్ విషయంలో ఇరు మార్కెట్లు చెరి సగం పంచుకున్నాయి. ఎస్‌యూవీల్లో అయితే అర్బన్‌దే హవా. ఇక గ్రామీణ మార్కెట్లకు విక్రయశాలలు, సర్వీసింగ్ కేంద్రాలను విస్తరించే విషయంలో కంపెనీలు డీలర్ పార్ట్‌నర్స్‌ను ప్రోత్సహిస్తున్నాయి. మానవ వనరుల సంఖ్య పెంచేందుకు సాయం చేస్తున్నాయి. టెస్ట్ డ్రైవ్ కోసం వాహనాలను సమకూరుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ నెట్‌వర్క్ మెరుగుపడింది. దీంతో వినియోగదార్లకు చేరువ కావడంలో భాగంగా సేల్స్ నెట్‌వర్క్ పెంచేందుకు కసరత్తు చేస్తున్నట్టు మహీంద్రా తెలిపింది. రూరల్ మార్కెట్లలోనూ తమ ఎస్‌యూవీలకు డిమాండ్ కొనసాగుతోందని వెల్లడించింది. ప్రజలను ప్రభావితం చేసే సర్పంచ్‌ల వంటి ముఖ్యులతో కలిసి కంపెనీలు వివిధ కార్యక్రమాలు చేస్తున్నాయి.

తెలుగు రాష్ట్రాల్లోకి మహీంద్రా ఓజా ట్రాక్టర్లు ఎంట్రీ



హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల రైతుల కోసం మహీంద్రా ట్రాక్టర్స్ తన ఓజా 3140 మోడల్ ట్రాక్టర్లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ప్రవేశపెట్టింది. ఖరీఫ్ సీజన్‌లో విడుదలైన ఈ తేలికపాటి ట్రాక్టర్లు దుక్కి దున్నే కార్యక్రమాలతో రైతులకు అనేక ప్రయోజనాలు చేకూర్చింది. దీంతో రానున్న రబీ సీజన్‌లో వీటికి డిమాండ్ పెరుగుతుందని కంపెనీ ఆశిస్తోంది. అత్యాధునిక సాంకేతిక కలిగిన ఈ ట్రాక్టర్ల ధర రూ.7.35 లక్షలుగా ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-2-2024	
విశాఖ	430–00
చిత్తూరు	478–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425–00
విజయవాడ	425–00
19-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	415–00
వరంగల్	417–00

22,000 దిగువకు నిఫ్టీ

- నెల కనిష్టానికి సూచీలు
- ప్రపంచ ప్రతికూలతల ప్రభావం

ముంబై: బ్యాంక్ ఆఫ్ జపాన్ కీలక వడ్డీ రేట్లను 17 ఏళ్ల తర్వాత పెంచడంతో ద్రవ్యోల్బణ భయాలు భారత్ ఈక్విటీ మార్కెట్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫెడరల్ రిజర్వ్ ద్రవ పాలసీ నిర్ణయాల వెల్లడి(నేడు)కి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ఫ్యూచర్స్ ధర అయిదు నెలల గరిష్టం 85 డాలర్లపైకి ఎగిసింది. జపాన్ వడ్డీ రేట్ల పెంపుతో డాలర్ ఇండెక్స్ బలపడింది. ఈ పరిణామాలతో మంగళవారం సెన్సెక్స్ 736 పాయింట్లు నష్టపోయి 72,012 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 238 పాయింట్లు పతనమై 22,000 స్థాయిని కోల్పోయి 21,817 వద్ద నిలిచింది. ముగింపు స్థాయిలు ఇరు సూచీలకు నెల కనిష్టం. ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న దేశీయ మార్కెట్ ఉదయం బలహీనంగా మొదలైంది. అన్ని రంగాల షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనడంతో సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం నష్టాల్లోనే ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 815 పాయింట్లు క్షీణించి 72,000 స్థాయి దిగువన 71,933 వద్ద, నిఫ్టీ 263 పాయింట్లు నష్టపోయి 21,793 వద్ద ఇంట్రాడే కనిష్టాలను చూశాయి. చిన్న, మధ్య తరహా షేర్లలో విక్రయాలు కొనసాగాయి.



జపాన్ ఎకానమీకి జోష్!

ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ జపాన్ పురోగమన బాటన పడుతున్నట్లు కనిపిస్తోంది. 17 సంవత్సరాల నెగటివ్ రుణ రేటు వ్యవస్థకు 4.2 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ ముగింపు పలికింది. బ్యాంకులకు బ్యాంక్ ఆఫ్ జపాన్ ఇచ్చే ఓవర్‌నైట్ రుణ రేటు మైనస్ 0.1 శాతం నుంచి ప్లస్ 0–0.1 శాతం శ్రేణికి పెరిగింది.

రూ. 4.86 లక్షల కోట్లు ఆవిరి

సెన్సెక్స్ ఒక శాతానికి పైగా నష్టపోవడంతో బీఎస్ఈలో రూ.4.86 లక్షల కోట్లు ఆవిరయ్యాయి. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.373 లక్షల కోట్లకు దిగివచ్చింది. ఈ సూచీలో 30 షేర్లకు గానూ ఏడు మాత్రమే లాభపడ్డాయి.



టీసీఎస్ నిరాశ..



టీసీఎస్ షేరు రెండేళ్లలో అతిపెద్ద పతనాన్ని చవిచూసింది. ప్రమోటర్ సంస్థ టాటా సన్స్ బ్లాక్ డీల్ ద్వారా 2.3 కోట్ల ఈక్విటీ షేర్ల విక్రయంతో ఈ షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ట్రేడింగ్‌లో నాలుగున్నర శాతం క్షీణించి రూ. 3,967 వద్ద రెండేళ్ల కనిష్టాన్ని తాకింది. చివరికి 4% నష్టంతో రూ.3,978 వద్ద ముగిసింది.

పాపులర్ వెహికల్స్ పేలవం

పాపులర్ వెహికల్స్ అండ్ సర్వీసెస్ లిస్టింగ్ మెప్పించలేకపోయింది. ఇష్యూ ధర(రూ.295)తో పోలిస్తే బీఎస్ఈలో 1% డిస్కౌంట్‌తో రూ.292 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 11% క్షీణించి రూ.263 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 6% నష్టంతో రూ.276 వద్ద ముగిసింది. మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,967 కోట్లుగా నమోదైంది.



భవిత

జాబ్ పాయింట్

నవోదయ విద్యాలయ సమితిలో 1377 నాన్‌టీచింగ్ పోస్టులు

నోయిడాలోని నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌వీఎస్)దేశవ్యాప్తంగా ఉన్న ఎన్‌వీఎస్‌లు, ఎన్ఎల్ఐలు, జవహర్ నవోదయ విద్యాలయాల్లో నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 1377
- » **పోస్టుల వివరాలు:** ఫీమేల్ స్టాఫ్ నర్స్–121, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్–05, ఆడిట్ అసిస్టెంట్–12, జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్–04, లీగల్ అసిస్టెంట్–01, స్టెనోగ్రాఫర్–23, కంప్యూటర్ ఆపరేటర్–02, క్యాటరింగ్ సూపర్‌వైజర్–78, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్–381, ఎలక్ట్రీషియన్ కమ్ ప్లంబర్–128, ల్యాబ్ అటెండెంట్–161, మెస్ హెల్పర్–442, మల్టీ టాస్కింగ్ స్టాఫ్–19.
- » **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 12వతరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా, బ్యాచిలర్స్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ట్రేడ్/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, కాకినాడ, నెల్లూరు, గుంటూరు, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్,ఖమ్మం, కరీంనగర్.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://navodaya.gov.in/

సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్‌లో 96 పోస్టులు

హైదరాబాద్‌లోని సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్(ఎస్‌పీపీ).. వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 96
- » **పోస్టుల వివరాలు:** సూపర్‌వైజర్(టీవో–ప్రింటింగ్)–02, సూపర్‌వైజర్ (టెక్–కంట్రోల్)–05, సూపర్‌వైజర్(ఓఎల్)–01, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్–12, జూనియర్ టెక్నీషియన్(ప్రింటింగ్/కంట్రోల్)–68, జూనియర్ టెక్నీషియన్ (ఫిట్టర్)–03, జూనియర్ టెక్నీషియన్(వెల్డర్)–01, జూనియర్ టెక్నీషియన్ (ఎలక్ట్రానిక్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్)–03, ఫైర్‌మ్యాన్–01.
- » **విభాగాలు:** ప్రింటింగ్/కంట్రోల్, ఇంజనీరింగ్, రిసోర్స్ మేనేజ్‌మెంట్.
- » **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఈ/బీటెక్, బీఎస్సీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** సూపర్‌వైజర్/సూపర్‌వైజర్ (టెక్నికల్ కంట్రోల్) పోస్టులకు 18 నుంచి 30 ఏళ్లు, జూనియర్ టెక్నీషియన్(ప్రింటింగ్/కంట్రోల్)/జూనియర్ టెక్నీషియన్ (ఫిట్టర్)/జూనియర్ టెక్నీషియన్(వెల్డర్)/జూనియర్ టెక్నీషియన్ (ఎలక్ట్రానిక్స్ /ఇన్‌స్ట్రుమెంటేషన్)పోస్టులకు 18 నుంచి 25 ఏళ్లు, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **పరీక్ష:** ఆన్‌లైన్ విధానంలో పరీక్ష జరుగుతుంది. మొత్తం 150 మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుంది. తప్పు సమాధానానికి నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**15.04.2024
- » **పరీక్ష తేది:** మే/జూన్–2024.
- » **వెబ్‌సైట్:** https://spphyderabad.spmcil.com/en

కోల్ ఇండియా లిమిటెడ్, కోల్‌కతాలో 72 పోస్టులు

కోల్‌కతాలోని కోల్ ఇండియా లిమిటెడ్ వివిధ విభాగాల్లో మెడికల్ స్పెషలిస్ట్ (ఈ4) /మెడికల్ స్పెషలిస్ట్(ఈ3), సీనియర్ మెడికల్ ఆఫీసర్(ఈ3) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 72
- » **స్పెషాలిటీ:** సర్జరీ, జనరల్ ఫిజిషియన్/మెడిసిన్, జి–ఓ, అనెస్తీషియా, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, సైకియాట్రీ, పాథాలజీ, డెర్మటాలజీ, పల్మనాలజీ/చెస్ట్ సెషాలిటీ, ఆఫ్తాల్మాలజీ, రేడియాలజీ, ఈఎన్‌టీ.
- » **అర్హత:** ఎంబీబీఎస్, సంబంధిత విభాగంలో మెడికల్ పీజీ/డీఎన్‌బీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** సీనియర్ మెడికల్ స్పెషలిస్ట్(ఈ4) పోస్టులకు 42 ఏళ్లు, సీనియర్ మెడికల్ ఆఫీసర్/మెడికల్ స్పెషలిస్ట్(ఈ3) గ్రేడ్ 35 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు సీనియర్ మెడికల్ స్పెషలిస్ట్(ఈ4)కు రూ.70,000 నుంచి రూ.2,00,000, మెడికల్ స్పెషలిస్ట్(ఈ3)కు రూ.60,000 నుంచి రూ.1,80,000, సీనియర్ మెడికల్ ఆఫీసర్(ఈ3)కు రూ.60,000 నుంచి రూ.1,80,000.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జనరల్ మేనేజర్(పర్సనల్)/హెచ్‌వోడీ(ఈఈ), ఎగ్జిక్యూటివ్ ఎస్టాబ్లిష్‌మెంట్ డిపార్ట్‌మెంట్, రెండో అంతస్తు, కోల్ ఎస్టేట్, వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్, సివిల్ లైన్స్, నాగ్‌పూర్, మహారాష్ట్ర చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 11.04.2024.
- » **వెబ్‌సైట్:** www.coalindia.in/careercil/jobscoalindia

రైల్వేలో పోలీస్ కొలువులు

- » రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లో 4,660 ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులు
- » ఏప్రిల్ 15 నుంచి మొదలు కానున్న దరఖాస్తు ప్రక్రియ
- » మూడు దశల ఎంపిక విధానం
- » నిర్దిష్ట వ్యూహంతో విజయానికి అవకాశం

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్.. సంక్షిప్తంగా ఆర్‌పీఎఫ్! భారతీయ రైల్వేలకు సంబంధించి.. రక్షణ, భద్రత వ్యవహారాలను పర్యవేక్షించే విభాగం! తాజాగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్ విభాగాల్లో.. సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ), కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. వచ్చే నెల (ఏప్రిల్) 15 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కానుంది!! ఈ నేపథ్యంలో.. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లో.. పోలీస్ ఉద్యోగాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..



కోవిడ్ కారణంగా గత మూడేళ్లుగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లో నియామకాలు చేపట్టలేదు. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది భారీగా నియామకాలకు భారత రైల్వే శాఖ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే నాలుగు వేలకుపైగా పోస్టుల భర్తీకి సన్నాహకాలు చేపడుతోంది. అభ్యర్థులు పటిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగిస్తే విజయావకాశాలు మెరుగుపరచుకోవచ్చు.

ఎస్ఐ, కానిస్టేబుల్.. 4,660 పోస్టులు

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ తాజా నోటిఫికేషన్ ద్వారా సబ్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ హోదాలలో మొత్తం 4,660 పోస్టులకు నియామకం చేపట్టనుంది. వీటిలో ఎస్ఐ పోస్టులు 452, కానిస్టేబుల్ పోస్టులు 4,208 ఉన్నాయి.

అర్హతలు

- ఆర్‌పీఎఫ్ నియామకాలకు సంబంధించి డిగ్రీ, పదో తరగతి అర్హతతో పోటీ పడే అవకాశం ఉంది. ఎస్ఐ పోస్టులకు బ్యాచిలర్ డిగ్రీ, కానిస్టేబుల్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: జూలై 1, 2024 నాటికి 20–28 ఏళ్ల మధ్య ఉండాలి(రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనల మేరకు గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది)

వేతనం

ఎస్ఐ పోస్టులకు పే లెవల్–6తో (రూ.35,400 –రూ.1,12,400); కానిస్టేబుల్ పోస్టులకు పే లెవల్ –3తో(రూ.21,700–రూ.69,100) ప్రారంభ వేతనం లభిస్తుంది.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

ఆర్‌పీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ పోస్టులకు మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. తొలి దశలో కంప్యూటర్ బేస్డ్ విధానంలో రాత పరీక్ష; రెండో దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, మూడో దశలో ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్‌లు ఉంటాయి. వీటన్నిటిలోనూ విజయం సాధిస్తే.. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేసి నియామకాలు ఖరారు చేస్తారు.

120 మార్కులకు రాత పరీక్ష

ఎంపిక ప్రక్రియలో తొలిదశ రాత పరీక్షను మూడు విభాగాల్లో 120 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో జనరల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు–50 మార్కులకు, అర్థమెటిక్ 35 ప్రశ్నలు–35 మార్కులకు, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 35 ప్రశ్నలు–35 మార్కులకు ఉంటాయి. నెగిటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు మార్కును తగ్గిస్తారు. పరీక్షకు లభించే సమయం 90 నిమిషాలు.

రెండో దశ పీఈటీ, పీఎంటీ

రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్టుకు పది మందిని చొప్పున (1:10 నిష్పత్తిలో) ఎంపిక చేసి.. వారికి తదుపరి దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్‌లు నిర్వహిస్తారు.

ఉన్నత హోదాలు

ఆర్‌పీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్‌గా ఎంపికైన వారు సర్వీసు నిబంధనలను అనుసరించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకునే అవకాశం ఉంది. ఎస్ఐగా నియమితులైన వారు అసిస్టెంట్ సూపరింటెండెంట్ స్థాయికి చేరుకోవచ్చు. కానిస్టేబుల్‌గా ఎంపికైన వారు సబ్ ఇన్‌స్పెక్టర్/ఇన్‌స్పెక్టర్ స్థాయికి చేరుకునే వీలుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** 2024, ఏప్రిల్ 15 – మే 14
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://rpf.indianrailways.gov.in/RPF/, https://rrbsecunderabad.gov.in

రాత పరీక్షలో రాణించేలా

జనరల్ అవేర్‌నెస్

ఈ విభాగానికి సంబంధించి.. సమకాలీన అంశాలతోపాటు చరిత్ర, రాజ్యాంగం, ఎకానమీ, జాగ్రఫీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ అంశాలపై పూర్తి అవగాహన పొందాలి. అదే విధంగా..భారత చరిత్రకు సంబంధించి ముఖ్యమైన ఘట్టాలు, చరిత్ర గతిని మార్చిన సంఘటనలు, భారత స్వాతంత్ర్య ఉద్యమంలోని ప్రధాన ఘట్టాలపై పట్టు సాధించాలి. జాగ్రఫీలో భారత, ఏపీ భౌగోళిక స్వరూపం, సహజ వనరులు, నదులు, సముద్రతీర ప్రాంతాలు, అడవులు, పంటలు, సాగు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఎకానమీలో కోర్ ఎకనామీ అంశాలతో పాటు సమకాలీన పరిణామాలు, దేశ ఆర్థిక రంగంలో అమలవుతున్న కొత్త విధానాలపై స్పష్టత ఏర్పరచుకోవాలి. పాలిటీకి సంబంధించి రాజ్యాంగం, రాజ్యాంగ రూపకర్తలు, రాజ్యాంగంలోని ముఖ్యమైన అధికరణలు, ప్రకరణలు వంటి వాటితో పాటు తాజా రాజ్యాంగ సవరణలు, వాటి ఉద్దేశం , ప్రభావం గురించి తెలుసుకోవాలి.

అర్థమెటిక్

అభ్యర్థులు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన విభాగం.. అర్థమెటిక్ అండ్ టెస్ట్ ఆఫ్ రీజనింగ్. అర్థమెటిక్‌లోని సగటు, కసాగు, గసాభా, సంఖ్యలు, వర్గ మూలాలు, ఘన మూలాలు, నిష్పత్తులు, భాగస్వామ్యం, వయసు, శాతాలు, లాభ–నష్టాలు, చక్రవడ్డీ, సరళ వడ్డీ, కాలం–దూరం, కాలం–పని వంటి వాటిపై పట్టు సాధించాలి. అదే విధంగా మ్యాథమెటిక్స్‌లోని ప్రాథమిక అంశాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి. జామెట్రీ, ట్రిగ్నోమెట్రీ, మ్యాట్రిసెస్, సెట్స్–రిలేషన్స్‌ను ప్రత్యేకంగా ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్

విశ్లేషణాత్మక దృక్పథంతో మంచి మార్కులు సొంతం చేసుకునే అవకాశం ఉన్న విభాగం రీజనింగ్. ఇందులో నంబర్ సిరీస్, మిస్సింగ్ నెంబర్స్, కోడింగ్–డీకోడింగ్, సీటింగ్ అరేంజ్‌మెంట్, బ్లడ్ రిలేషన్స్ వంటి వాటిపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. వెన్ డయాగ్రమ్స్, అసెంప్షన్ అండ్ రీజన్, ఆర్గ్యుమెంట్, సిలాజిజమ్, డేటా సఫిషియన్సీ విభాగాల్లో పట్టుతో వెర్బల్ రీజనింగ్‌లో రాణించే అవకాశం ఉంది. దీంతోపాటు ఆడ్ మన్ ఔట్, డైస్ అండ్ క్యూబ్స్, వెన్ డయాగ్రమ్స్‌లపై అవగాహన పెంచుకోవాలి. ఫలితంగా నాన్ వెర్బల్ రీజనింగ్‌లో వీటిలన్నీ ఎక్కువ ప్రశ్నలకు సమాధానం ఇచ్చే నైపుణ్యం లభిస్తుంది. మెంటల్ ఎబిలిటీ విభాగంలో రాణించేందుకు టాబ్యులేషన్, డేటా సమీకరణ, డేటా విశ్లేషణలపై అవగాహన పెంచుకోవాలి.

క్లిష్టత స్థాయిలో వ్యత్యాసం

ఆర్‌పీఎఫ్ ఎస్ఐ, కానిస్టేబుల్ రెండు పోస్టులకు సిలబస్ అంశాలు ఒకే విధంగా ఉన్నాయి. కాని పరీక్షలో ప్రశ్నల క్లిష్టత స్థాయిలో వ్యత్యాసం ఉంటుంది. ఎస్ఐ పోస్టుల పరీక్షలో క్లిష్టత ఎక్కువ ఉన్న ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. కానిస్టేబుల్ పోస్టులకు మాత్రం పదో తరగతి స్థాయిలో ప్రశ్నలు అడిగే వీలుంది. దీనికి అనుగుణంగా అభ్యర్థులు ఆయా అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

వైద్య కళాశాల సమస్యలపై

విచారణ కమిటీ ఏర్పాటు

భద్రాద్రి జిల్లా కలెక్టర్ ప్రియాంక వెల్లడి

కొత్తగూడెం రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలో విద్యార్థులపై ప్రిన్సిపాల్ వేధింపులు, ఇతర సమస్యలపై విచారణ కమిటీ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. జెడ్పీ సీఈఓ ఎస్.ప్రసూన రాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కమిటీలో చీఫ్ ప్లానింగ్ అధికారి యు.శ్రీనివాసరావు, జిల్లా ఉద్యానవన అధికారి సూర్యనారాయణ సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. ఈనెల 22వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు విచారణ పూర్తి చేయాలని కమిటీని కలెక్టర్ ఆదేశించారు. హాస్టల్‌లో కనీస సౌకర్యాలు, భోజనంలో నాణ్యత, మెస్ చార్జీల వసూలు, ప్రిన్సిపాల్ వేధింపులు, హాస్టల్‌లో రాత్రి వేళ వీడియోలు తీయించడం వంటి అంశాలపై విచారణ చేపట్టి, నివేదిక అందజేయాలని సూచించారు. కాగా, రెండో రోజైన మంగళవారం కూడా విద్యార్థులు వైద్య కళాశాల ఎదుట ధర్నా చేశారు. దీంతో డీఎంఈ వాణి ఆదేశాల మేరకు ఖమ్మం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో కాలేజీలో విచారణ చేపట్టారు.

రేగళ్ల గుంపునకు

తాగునీటి ట్యాంకర్

సాక్షి ఎఫెక్ట్

అశ్వారావుపేట: రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి సమస్యపై సోమవారం 'సాక్షి' ప్రధాన సంచికలో 'గొంతెండుతోంది..' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం బచ్చువారిగూడెం జీపీ పరిధి రేగళ్ల గుంపులో తాగునీటి సమస్య 'ఊరంతటికీ చెలిమ నీరే ఆధారం' శీర్షికన ఫొటో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ నివేదిక సమర్పించాలని దమ్మపేట ఏటీడబ్ల్యూఓ చంద్రమోహన్‌ను ఆదేశించారు. ఈమేరకు ఆయన అశ్వారావుపేట ఎంపీడీఓ శ్రీనివాస్‌తో మాట్లాడి బచ్చువారిగూడెం గ్రామపంచాయతీ నుంచి ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేయాలని సూచించగా, మంగళవారం రేగళ్ల గుంపునకు ట్యాంకర్ పంపించారు.


ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న రేగళ్ల గుంపు వాసులు

23న దేశవ్యాప్తంగా 'ఎర్త్ అవర్'

శనివారం రాత్రి 8.30 నుంచి 9.30 వరకు రాష్ట్రంలో విద్యుత్ దీపాలు ఆర్పేయాలి

అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీ ప్రసాద్

సాక్షి, హైదరాబాద్: దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఎర్త్ అవర్‌లో భాగంగా...ఈ నెల 23న రాత్రి 8.30 నుంచి 9.30 వరకు గంట పాటు విద్యుత్ దీపాలు ఆర్పేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీ ప్రసాద్ కోరారు. సచివాలయంలో మంగళవారం ఆమె 'ఎర్త్ అవర్'పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎర్త్ అవర్ అనేది భూగోళం ఎదుర్కొంటున్న మూడు రకాల సంక్షోభాలను గుర్తించడానికని తెలి పారు. వాతావరణ మార్పులు, జీవ-వైవిధ్య నష్టం, పర్యావరణ రక్షణకు... దేశవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలతో పాటు ఎర్త్ అవర్ పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం రాత్రి 8.30-9.30 సమయంలో హైదరా బాద్‌లోని సెక్రటేరియట్, దుర్గం చెరువు, బీఆర్ అంబేడ్కర్, బుద్ధ విగ్రహాలు, గోల్కొండ కోట, చార్మినార్, రాష్ట్ర గ్రంథాలయం, రాష్ట్రంలోని ఇతర స్మారక చిహ్నాలన్నింటిలో లైట్లు ఆర్పాలని చెప్పారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.